

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-10-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 249 పేజీలు: 8+16 వెల: 6.50




హంగేరి రచయితకు
## సాహిత్యంలో నోబెల్
లాస్లో క్రాస్నహోర్కైకు అత్యున్నత పురస్కారం 2



## బిజెపియే బిల్లుకు అడ్డు

### బిఆర్ఎస్ 50 శాతం శ్లాబ్‌తో ఇరుకున పెట్టింది: డి.సిఎం భట్టి

**హైదరాబాద్,అక్టోబరు 9,ప్రభాతవార్త:** బిజెపి ప్రభుత్వం బిసిలకు న్యాయం జరగకుండా బిల్లు ఆపుతోందని,మరోవైపు బిఆర్ఎస్ 50శాతం స్లాబ్‌తో ఇరకాటంలోకి నెట్టిందని డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో గురువారంవిలేకర్లతో భట్టి మాట్లాడుతూ సెప్టెంబరు 30లోపు ఎన్నికలు పెట్టాలని హైకోర్టు చెప్పిందని >>2

# ఆగిన 'స్థానిక' ప్రక్రియ



## ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే

## బిసి కోటా జీవో 9 అమలూ నిలిపివేత

### తదుపరి విచారణ 6 వారాలకు వాయిదా

### నిరాశ చెందం.. పోరాటం సాగిస్తాం: మంత్రులు

### ఎన్నికల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి

### ఎన్నికల కోడ్ ఎత్తివేత 2

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు9:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం 9పై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు జీవో అమలును నిలిపివేస్తూ గురువారం మధ్యాహ్నం తర్వాత మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా హైకోర్టు స్టే విధించింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు 2 వారాల గడువు విధించింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగిన విషయం తెలిసిందే. హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోనుంది. న్యాయస్థానంలో విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్రం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణ రాష్ట్రంలోనే జరిగిందని ఆయన అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57.6శాతం ఉన్నట్లుగా తేలిందన్న ఆయన 42 శాతం రిజర్వేషన్ల >>2

**నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు** 6



## కాంగ్రెస్ సర్కార్ అసమర్థత

### ప్లాన్ బితో వాదనలు వినిపించిన ప్రభుత్వం: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే, ఈతీర్పు వెలువడిందని విమర్శించారు. బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. ముందగానే ప్లాన్ 'బి'ని సిద్ధం చేసుకుని హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బిసిలను >>2


ముంబయిలో ప్రధాని మోడీతో భేటీ అయిన బ్రిటన్ పిఎం కీర్

## ద్వైపాక్షికం పటిష్టం

### భారత్, యుకె సహజ భాగస్వాములు

### ఒప్పందంతో ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహం

### 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు లక్ష్యం

### ముంబయిలో బ్రిటన్ ప్రధాని కీర్‌తో ప్రధాని మోడీ భేటీ

### ఇండో పసిఫిక్ సముద్ర భద్రతపై కలిసి పనిచేయాలని నిర్ణయం

**ముంబయి, అక్టోబర్ 9:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లో భారత్, యుకె మధ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, ఆర్థిక ప్రగతికి ఒక ముఖ్యమైన స్తంభంలా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టంచేశారు.'భారత్-యుకె భాగస్వామ్యం విశ్వసనీయమైనది. ప్రతిభ,సాంకేతికత ఆధారితమైనది. యుకె ప్రధాని >>2

# సుంకాలు పెనుభారమే

### ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యం ఆహ్వానిస్తున్నాం


అమెరికా ప్రతినిధి బృందంతో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

### ఎపిలో మచిలీపట్నం పోర్ట్ దాకా 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే

### అమెరికా ప్రతినిధి బృందంతో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు9:** అమెరికా నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో.. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్ 1 బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయటంతో పాటు అస్థిరతకు, అపార్థానికి దారి తీస్తాయన్నారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలను పంచుకున్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధులు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, ఇండస్ట్రీస్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అమెరికాలోని హడ్సన్ ఇన్స్టిట్యూట్ కు చెందిన ప్రతినిధులు 16 మంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్ ప్రపంచ నగరంగా అందరినీ ఆకర్షిస్తోందని, దేశ విదేశాల నుంచి పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయన్నారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోందని, మన మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని ఆయన అన్నారు.జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని, 2034 నాటికి ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని అన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వంలక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రిఅన్నారు. హైదరాబాద్‌లో గేమ్‌ఛేంజర్ ప్రాజెక్టులు చేపడుతున్నామని ముఖ్యమంత్రి >>2


హ్యామ్ రోడ్లపై సమీక్ష చేస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

## రూ.10986 కోట్లతో హ్యామ్‌రోడ్ల నిర్మాణం

### మొదటి దశలో 5,587 కి.మీ గుర్తింపు

### డి.సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు9,ప్రభాతవార్త:** తెలంగాణలో రూ. 10986 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకొన్నామని టెండర్ ప్రక్రియ కూడా మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఆర్అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సచివాలయంలో గురువారం హ్యామ్ రోడ్ల నిర్మాణం పై కీలక సమీక్షఆర్ అండ్ బిశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన విశిష్ఠ అతిథి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో సమావేశం జరిగింది. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాష్ట్రంలో దశలవారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుఅన్నారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ క్రమంలో అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని, రోడ్ల నిర్మాణ క్రమంలో ట్రాఫిక్ సర్వేను గమనంలో పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు.ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇంకో అసెంబ్లీ నియోజకవర్గానికి కన్టెక్టివిటీ కారిడార్లుగా హ్యామ్ రోడ్లు ఉంటాయని చెప్పారు. ఆర్అండ్‌బి >>2


గురువారం హైదరాబాద్ బస్ భవన్ వద్ద కెటిఆర్, హరీష్ తదితరులు

### ఆర్టీసీ ఛార్జీలు తగ్గించేదాకా

## తగ్గేదేలే..

### బిఆర్ఎస్ నేతల ఛలో బస్ భవన్

### ఆర్టీసీ ఎండికి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్, హరీష్

### ఎక్కడికక్కడ పలువురు నేతల హౌస్ అరెస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు9:** ఆర్టీసి బస్సు చార్జీల పెంపుపై ప్రతిపక్ష బిఆర్ఎస్ భగ్గుమంది. సిటీ బస్సులో పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ 'చలో బస్ భవన్' కార్యక్రమాన్ని బీఆర్ఎస్ చేపట్టింది. నిర్బంధాల నడుమ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, వాణి దేవి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, లక్ష్మారెడ్డి, పార్టీ నేతలు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి బస్ భవన్ >>2

## కోటి ఎకరాలు నిషేధిత జాబితాలోకి



### ప్రభుత్వ భూముల రక్షణకు కీలక అడుగు

### వాటిపై పూర్తి అధికారం ఇక సర్కార్‌దే

**హైదరాబాద్,అక్టోబర్ 9, ప్రభాతవార్త:** తెలంగాణ రెవెన్యూ శాఖ కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలోకి చేర్చింది. ప్రభుత్వ భూములు, పట్టా పాస్‌బుక్ లేని వ్యవసాయ భూములు, నాలా భూములతో పాటు వివాదాస్పద ప్రైవేట్ భూములు కూడా ఇందులో ఉన్నాయి. ఈ చర్యతో భూ వివాదాలు తగ్గి, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లభిస్తుందని అధికారులు తెలిపారు. తెలంగాణలో భూ వివాదాలకు చెక్ పెట్టి ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించే దిశగా రెవెన్యూ శాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రంలో దాదాపు కోటిఎకరాలకు పైగా భూమిని నిషేధిత జాబితాలోకి చేర్చడానికి తుది జాబితాను సిద్ధం చేసింది. ఈ మొత్తం భూమిని లావాదేవీల నిమిత్తం భూభారతి పోర్టల్‌లో లాక్ చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు..భూమి రికార్డుల్లో ఉన్న అస్తవ్యస్తతను సరిదిద్ది, అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టడంలో ఈ జాబితా కీలకంగా పనిచేయనుంది. నిషేధిత జాబితాలోకి చేర్చడానికి ప్రతిపాదించిన కోటి ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజించింది.ప్రభుత్వ భూములు (77 లక్షల ఎకరాలు): వివిధ ప్రభుత్వశాఖలకు కేటాయించిన భూములు,అసైన్డ్ ల్యాండ్స్, అటవీ భూములు, నీటిపారుదల ప్రాజెక్టుల భూములు, రోడ్లు, ఇంటి స్థలాల రూపంలో ఉన్న భూమి. ఈ విస్తీర్ణం దాదాపు >>2

## రేపు ఎఐసిసి పరిశీలకులు రాక

### డిసిసి అధ్యక్షుల ఎంపిక ఏర్పాట్లు


**హైదరాబాద్,అక్టోబరు9, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి వారి మనోభావాలకు అద్దం పట్టేలా డిసిసి అధ్యక్షుల ఎంపిక చేయడం కోసం ఎఐసిసి నియమించిన పరిశీలకులు తెలంగాణకు శనివారం ఉదయం రాబోతున్నారు. డిసిసి ప్రసిడెంట్ ఎంపికకోసం సెప్టెంబరు 23న అఖిలభారత కాంగ్రెస్‌కమిటీ సెక్రటరీ కెసి వేణుగోపాల్ 22 మందితో కూడిన పరిశీలకుల జాబితా ప్రకటించారు.తెలంగాణ పరిశీలకులలో వి.నారాయణ స్వామి, సి.పి.జోషి. శక్తి సింగ్ గోహిల్, బెన్నీ బెహానన్, అంటో ఆంటోనీ, హిబి ఈడెన్, స్టారిటా లైట్‌ప్లాంగ్,శోభా ఓజా, బి.వి. శ్రీనివాస్, అజయ్ సింగ్, రిజ్వాన్ అర్షద్, టి.సిద్ధిక్ ,సోఫియా ఫిర్దాస్, శ్రీనివాస్ మానే, అమిన్ పటేల్ ఎం.నారాయణ స్వామిప సారత్ రౌత్, బిస్వరంజన్ మోహంతీ, నబజ్యోతి పట్నాయక్,డెబాసిస్ పట్నాయక్, జాన్సన్ అబ్రహామ్,కె.మహేంద్రన్‌లతో కూడిన జాతీయ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.శనివారం వారు రాగానే నియామకాల ప్రక్రియ కోసం ఔత్సాహిక నాయకుల పట్ల కాంగ్రెస్ కార్యకర్త మనోభావాలు అంనావేసేకార్యక్రమం ప్రారంభమౌతుంది.క్షేత్ర >>2

**వాయుకాలుష్యంతోనూ మోకాళ్ల నొప్పులే!** 3

## టిటిడిలో సింఘాల్ మార్కుపాలన షురూ!

### తొలివిడతగా డిప్యూటీ ఇఒలు బదలీ

### వారం రోజుల్లో కీలకస్థానాల అధికారులకు స్థానచలనం



**తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానంలో సుదీర్ఘకాలం తిష్టవేసిన...ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు అధికారులు, ఉద్యోగులకు స్థానచలనం కల్పించడానికి టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ శ్రీకారం చుట్టారు. టిటిడిలో సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న కొందరు అధికారులు,ఉద్యోగులు ఎజెండాగా రూపొందించే అభివృద్ధిపనుల నిర్ణయాలను,కొన్ని తీర్మానాలను ముందుగానే వేగులుగా గత పాలకమండలి పెద్దలకు చేరవేసి రాజకీయం చేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇదే విషయంగా ఏడాదికాలంగా టిటిడిపై దుష్ప్రచారాలు సాగడం, పనిగట్టుకుని కొందరు ప్రతిదీ భూతద్దంలో చూపేలా కారణమవుతున్నారనేది బోర్డుక అందిన సమాచారం. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు ముందు ఇఒగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన సింఘాల్ పాలనను గాడిన పెట్టడానికి భారీ వ్యూహాన్ని రూపొందించారు. బ్రహ్మోత్సవాలు ముగియగానే వారంరోజుల్లో ఒక్కసారిగా డిప్యూటీ ఇఒ స్థాయి అధికారులను పూర్తిగా బదిలీ చేసి టిటిడిలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారనేది ప్రస్ఫుటమవుతోంది. గత వైసిపి పాలనలో ,టిటిడి బోర్డులో బదిలీలకు గురైన డిప్యూటీ ఇఒలను పూర్తిగా స్థానచలనం చేశారు. తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒగా ఉన్న ఎం.లోకనాథంను తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ డిప్యూటీ ఇఒగా, తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఇఒ పి,హరీంద్రనాథ్‌ను ఏకంగా మళ్లీ రెండవసారి తిరుమల ఆలయ డిప్యూటీ ఇఒగా నియమించారు. తిరుమలలో వసతి కల్పన విభాగం డిప్యూటీ ఇఒ (ఆర్1)భాస్కర్‌ను టిటిడి పరిపాలన భవనంలోని సర్వీసెస్ విభాగానికి, ఇక్కడ ఉన్న గోవిందరాజన్‌ను తిరుమల కల్యాణకట్టకు, అన్నదానం డిప్యూటీ ఇఒగా సెల్వంను, వసతికల్పనవభాగం డిప్యూటీ ఇఒ(ఆర్1)గా అన్నదానం డిప్యూటీ ఇఒ రాజేంద్రను నియమించారు. ఆర్2గా ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు. తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయ డిప్యూటీ ఇఒగా గోవిందరాజస్వామి ఆలయం నుండి శాంతిని, కల్యాణకట్టనుండి వెంకటయ్యను తిరుపతి అన్నదానం డిప్యూటీ ఇఒగా బదలీ చేశారు. ఇక రెండుమూడురోజుల్లో పూర్తిస్థాయిలో ఆలయం నుండి వసతికల్పన విభాగం, దాతల విభాగం, మార్కెటింగ్ విభాగంతోబాటు స్థానిక ఆలయాల్లో ఉన్న ,కీలకమైన కొన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు,సీనియర్ అసిస్టెంట్‌లను బదిలీ చేసేందుకు రంగం సిద్దంచేశారు. వీరిలో కొందరు గత వైసిపికి వంతపాడుతున్నట్లు టిటిడికి అందిన ఫిర్యాదులు.ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లతోబాటు సబార్డినేట్‌లను బదిలీ చేసి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు సింఘాల్ సిద్దమయ్యారు.



రతన్ టాటా వర్ధంతి సందర్భంగా సూరత్‌లో కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

## బిజెపియే బిల్లుకు అడ్డు

>> గుర్తుచేశారు. ఎన్నికలు జరపడానికి 42 శాతం బిసిలకు రిజర్వేషన్ ఇవ్వాలని ప్రయత్నం చేశామని అన్నారు . 2018 లో బిఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ కటాఫ్ 50 శాతం చేస్తూ చట్టం చేయడం ప్రతిబంధకంగా మారిందని అన్నారు.ఒబిసి లకు రిజర్వేషన్ ఇవ్వాలని ఆ నాటి ప్రభుత్వం ప్రయత్నం చేయలేదని విమర్శించారు. ఇవాళ బిఆర్ఎస్. బిజెపి మాపై నిందలు వేస్తుందని దుయ్యబట్టారు . ప్రజలు అమాయకులు కాదు,బిసి సంఘాల నాయకులు అంతకంటే అమాయకులు కాదని అన్నారు. ఎంపిరికల్ డాటా లేకుండా రిజర్వేషన్ ఎలా ఇస్తారు అని ఆనాడు కోర్టు చెప్పింది జివో9 తేవడానికి సిపెక్ సర్వే చేశాం అని ఆయన వివరించారు. సైంటిఫిక్ గా సర్వే చేసివాటిని బిల్లు రూపంలోకి తెచ్చినామని ఆయన చెప్పారు. పొరపాటు జరగకుండా సర్వే చేశామని అన్నారు. మేము సభలో చేసిన బిల్లు గవర్నర్ దగ్గర పెండింగ్ లో ఉందని చెప్పారు. తెలంగాణ శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బిల్లు ఆపింది ఎవరు? . బీజేపీ ప్రభుత్వం కదా..?అని ఆయన నిలదీశారు. బిజెపిబిల్లు లు ఆపుతుంది, బిఆర్ఎస్ 50 శాతం స్లాబ్ దాటకుండా చట్టం చేస్తుందని ఆయన నిందించారు. బిఆర్ఎస్‌బిజెపి పార్టీలు బిసి ల నోటికాడి ముద్ద లాక్కున్నారు. ఇద్దరు కూడ పలుక్కని అడ్డుకున్నారని ఆయన అన్నారు. మీరా మా చిత్తశుద్ధిని ప్రశ్నించేది అని ఆయన ఆగ్రహం చెందారు.గవర్నర్ బిల్లు మూడు నెలలు అయినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అది చట్టం గా మారినట్టే అందుకే జివో ఇచ్చాం అని ఆయన చెప్పుకొచ్చారు. సర్వే లో కూడా పాల్గొనని పార్టీలు ఇవాళ మాట్లాడుతున్నాయితగుదునమ్మా అని, మిమ్మల్ని ప్రజలు క్షమించరు అంటూ నిష్ఠూరాలు పలికారు.న్యాయస్థానాల్లో,రాజకీయంగా పోరాటం చేస్తాం అని ప్రకటించారు. “42 శాతం రిజర్వేషన్ కోసం మేము ధర్నా చేసినప్పుడు బిఆర్ఎస్ బిజెపి ఏమైంది, డిల్లీకి ఎందుకు రాలేదు ఇప్పుడు రండి అంటున్నారు” అని భట్టి విపక్షాలను ఎండగట్టారు.

## కాంగ్రెస్ సర్కార్ అసమర్థత

>> రాజకీయంగా వాడుకుంటుందని మండిపడ్డారు. బిసిలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50శాతం క్యాప్‌ను నిర్దేశించిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు. బిసిల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బిజెపి తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

## సుంకాలు పెనుభారమే

>> వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీతో పాటు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి పొరుగున ఉన్న ఏపీలో మచిలీపట్నం పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఉండేలా రవాణా సదుపాయాలు విస్తరిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి అటు చైన్నై వరకు, ఇటు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు అభివృద్ధి చేస్తామని, సిటీలో ఇప్పుడున్న మెట్రో రైలును అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు చెప్పారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి కొత్త మార్గాలను తెరుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. 30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలని, ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ‘చైనా+1’ వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా నిలుస్తుందని, అటువంటి భవిష్యత్తు ప్రణాళికలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ఆలోచనలున్నాయని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఏఐ రంగంలో రాష్ట్రాన్ని దేశానికే స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే ప్రణాళికతో ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. హైదరాబాద్ నుండి వచ్చే కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్లలో ప్రధాన వాటాను సరఫరా చేశాయని, స్వదేశీ కంపెనీ లను మరింతగా పెంపొందించడానికి ప్రయత్నాలు కొనసాగుతు న్నాయని నొక్కి చెప్పారు.హడ్సన్ ఇన్స్టిట్యూట్ ప్రతినిధి, వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్‌వేవ్ క్యాపిటల్ పార్టనర్స్ సీఈవో మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు రావెనెల్ కర్రీ, బిల్లింగ్స్లీ కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్‌తో పాటు మొత్తం 16 మంది అమెరికా ప్రతినిధి బృందంలో ఉన్నారు.

## నిషేధిత జాబితాలోకి

>> 77 లక్షల ఎకరాలు ఉన్నట్లు అంచనా.పట్టా పాస్‌బుక్ జారీ చేయని వ్యవసాయ భూములు (18 లక్షల ఎకరాలు పైగా): ఈ పార్ట్ బీ కేటగిరీ కింద 11 లక్షలకు పైగా ఖాతాలు ఉన్నాయి. భూ భారతిలో లావాదేవీలకు పాస్‌బుక్ తప్పనిసరి కాబట్టి. ఈ భూములు కూడా తాత్కాలికంగా నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి.నాలా భూములు వ్యవసాయేతర అవసరాల కోసం కన్వర్ట్ చేసుకున్న (నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్ అసెస్‌మెంట్) సుమారు 3 లక్షల ఎకరాల విస్తీర్ణం కూడా ఈ జాబితాలోకి చేరుతుంది.ఈ మూడు కేటగిరీలతో పాటు, కొన్ని వివాదాస్పదంగా ఉన్న ప్రైవేట్ పట్టా భూములు కూడా ఈ జాబితాలో చేరనున్నాయి. మొత్తం మీద ఈ నిషేధిత భూముల విస్తీర్ణం రాష్ట్రంలో దాదాపు కోటి ఎకరాలకు చేరుకోనుంది. నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై పూర్తి అధికారం ప్రభుత్వానికే ఉంటుంది. ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు చేయాలన్నా లేదా ఒకరి నుంచి మరొకరికి బదలాయింపు చేయాలన్నా కచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉండాల్సిందే. ఈ జాబితాను లాక్ చేయడం వల్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడటం, ముఖ్యంగా అక్రమ రిజిస్ట్రేషన్లను అరికట్టడం సులభతరం అవుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం భూమి విస్తీర్ణం 2.50 కోట్ల ఎకరాలకు పైగా ఉండగా.. ఇందులో 1.53 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి మాత్రమే చట్టబద్ధమైన లావాదేవీలకు వీలు కల్పించే పట్టా పాస్‌బుక్‌లు జారీ అయ్యాయి. మిగిలిన కోటి ఎకరాల భూమి ఇకపై నిషేధిత జాబితాలో కొనసాగుతుంది.ఈచర్యద్వారా భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయని రెవెన్యూ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

### హంగేరి రచయితకు
## సాహిత్యంలో నోబెల్
### లాస్లో క్రాస్నహోర్కైకు అత్యున్నత పురస్కారం
### దార్శనిక రచనలకు దక్కిన అరుదైన గౌరవం

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నా హోర్కై రాసిన 'హెర్ష్ 07769 నవలకు 2025 నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. ఆ నవల సామాజిక అశాంతి, హింస, దహనాలతో చుట్టుముట్టిన ఒక చిన్న తురింగియన్ పట్టణ ప్రజల మానవ అస్థిత్వ వేదనను ప్రతిబింబించేలా ఉండటంతో “గొప్ప సమకాలీన జర్మన్ నవల“గా పేరుగాంచింది. తన రచనలతో ఆ నవలను అద్భుతంగా రచించారు. ఆయన విలక్షణమైన, దార్శనిక రచనలకు ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం అధికారికంగా ప్రకటించింది.

ప్రపంచ వినాశనం వంటి తీవ్ర భయానక పరిస్థితుల మధ్య కూడా కళకు ఉన్న అపారమైన శక్తిని తన రచనల ద్వారా బలంగా చాటి చెప్పినందుకు గాను లాస్లోకు ఈ గౌరవం అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. ఆయన సాహిత్యం సమకాలీన ప్రపంచంలోని సంక్లిష్టతలను, మానవ అస్తిత్వ వేదనను వినూత్న శైలిలో ఆవిష్కరిస్తుందని ప్రశంసించింది.

లాస్లో క్రాస్నహోర్కై తన రచనలతో ఆధునిక సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు నోబెల్ బహుమతితో ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైంది.

1954లో హంగేరి సరిహద్దులోని రొమేనియాకు సమీపంలో ఉన్న గ్యులా అనే చిన్న పట్టణంలో జన్మించిన క్రాస్నా హోర్కై తన సుదీర్ఘమైన, సంక్లిష్టమైన వాక్యాలు, తాత్విక లోతుకు ప్రసిద్ధి చెందాయి. ఫ్రాంజ్ కాఫ్కా, థామస్ బెర్న్ హార్డ్‌లతో పోలిస్తే అతని రచనలు అసంబద్ధత, వింతైన చిత్రాలు, ఆధ్యాత్మిక ఆత్మపరిశీలనను మిళితం చేస్తాయి. క్రాస్నా హోర్కై 1985లో తొలిసారిగా రాసిన స్టటాంగో (సాటాంటాంగో)తో అంతర్జాతీయ ప్రశంసలు అందుకున్నారు. అలాగే 'ఎ మౌంటైన్ టు ది నార్త్'(2003), ఎ లేక్ టు ది సౌత్, పాత్స్ టు ది వెస్ట్, ఎ రివర్ టు ది ఈస్ట్ నవలలు సాహితీ ప్రియులను మంత్రముగ్దులను చేశాయి. ఆ తర్వాత సీయోబో దేర్ బిలో (2008) నవల కూడా ప్రశంసలందుకుంది.

### వారం - వర్జ్యం

10-10-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
చవితి రా.7.42
కృత్తిక సా.5.34
వర్జ్యం : ఉ.8.07-9.34
దు.ఉ.8.22-9.09, 2) మ.12.19-1.06
శుభసమయం : ఉ.5.30-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** భూమి స్థిరాస్తుల సంబంధితమైన రాబడి ఉద్యోగ పరముగా ఇబ్బందులకు గురిచేస్తాయి.

**వృషభం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి.

**మిథునం:** మౌనం శ్రీరామ రక్ష అవుతుంది. ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి.

**కర్కాటకం :** యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు.

**సింహం:** మనోధైర్యంతో మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించబడతాయి.

**కన్య :** నైపుణ్యంతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో నష్టం నుండి తప్పుకోంటారు.

**తుల :** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు మీకు ఉపకరించవు. ప్రయాణాలు.

**వృశ్చికం:** అరోగ్యము సూత్రాలు పాటించవలసిన కాలం. ఆర్థిక లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆర్థిక విషయ వ్యవహారాలు, వృత్తి ఉద్యోగ వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

**మకరం:** పెదవిదాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. జాగ్రత్త వహించండి.

**కుంభం:** ఉద్యోగస్తులు తమ తోటి వారితో అప్రమత్తతో మెలగాలి.

**మీనం :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆగిన 'స్థానిక' ప్రక్రియ

>> ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు న్యాయస్థానానికి వివరించారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే అసెంబ్లీ తీర్మానం చేసిందని సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. మరో న్యాయవాది రవివర్మ హైకోర్టులో తన వాదనలు వినిపిస్తూ రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని తెలిపారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.షెడ్యూల్ ప్రకారం, రాష్ట్రంలో శుక్రవారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, హైకోర్టు తాజా ఆదేశాలతో ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఎన్నికల భవిష్యత్తుపై తీవ్ర అనిశ్చితి నెలకొంది. తదుపరి విచారణలో వెలువడే న్యాయస్థానం తీర్పుపైనే ఎన్నికల ప్రక్రియ ఆధారపడి ఉంటుంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9తో పాటు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధించిచడంపై హైకోర్టు ఆవరణలో కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎవరు చేయలేని సాహసం చేసిందని వ్యవసాయ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.ఇంటింటికి తిరిగి కులగణనం చేసి 42శాతం బీసీ రిజర్వేషన్ల రూపొందించామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ బీజేపీ ఒక్కటై బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రభుత్వం కట్టుబడి ఉందని, బీసీలకు న్యాయం జరగాలని అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికలకు హైకోర్టు స్టే విధించడంపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందించారు. బీసీలకు 42 శాతంపై అన్ని పార్టీలు మద్దతు ఇచ్చిన కూడా స్టే విధించడం విచారకరమని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ కొలిక్కి వచ్చిందనుకున్నాం.. కానీ కోర్టు తీర్పు ఊహించలేదని చెప్పారు.ఎక్కడ ఇబ్బంది లేకుండా కులగణన పూర్తి చేసి బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు.బీసీల నోటి కాడ కూడు లాగేయడం శోచనీయమని పేర్కొన్నారు. 42 శాతం బీసీల రిజర్వేషన్ కు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ బిడ్డలు అధైర్య పడాల్సిన అవసరం లేదని,కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.బీసీ రిజర్వేషన్ బిల్లును రెండు సభల్లో పాస్ చేసి గవర్నర్‌కు పంపించామని, గవర్నర్ బిల్లు పాస్ చేయకుండా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ.. కోర్టు తీర్పు చాలా బాధ కలిగించిందన్నారు.బీజేపీ,బీఆర్ఎస్ నేతలు తమ నోటి దగ్గరి ముద్దను లాక్కున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లపై ప్రభుత్వం తరపున చేయాల్సింది చేశామని చెప్పారు. అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని.. బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థలో బీసీలు వచ్చే వరకు తమకు అన్యాయం జరుగుతూనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పుతో చాలా నిరాశ చెందాం.బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా సీఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారు. కులగణనతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చాము. బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయింది.. అయినా మేం నిరాశ చెందం, పోరాటం కొనసాగుతుంది. తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడుతాం. బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు.. సీఎం రేవంత్ నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వేషన్లు సాధించుకుందాం అని అన్నారు.

## ఆర్టీసీ ఛార్జీలు తగ్గించేదాకా తగ్గేదేలే..

>> చేరుకున్నారు. అనంతరం టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కేటీఆర్, హరీశ్, సబిత, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు భేటీ అయ్యారు. గ్రేటర్ పరిధిలో పెంచిన ఆర్టీసీ చార్జీలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ తరపున లేఖ అందజేశారు. ప్రభుత్వ బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం రూ.1353 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆర్టీసీ ఎండీ స్వయంగా బీఆర్ఎస్ నేతలకు తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.9246 కోట్ల ఆర్టీసీ గ్రాంట్‌ను విడుదల చేశారని ఆర్టీసీ ఎండీకి కేటీఆర్ తెలిపారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని ముంచేలా కనబడుతున్నదని ఆరోపించారు. మొత్తంగా సంస్థను ప్రైవేటుకు అప్పగించే కుట్ర చుస్తున్నదని చెప్పారు. పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని చెప్పారు. బస్ భవన్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలను మొదట పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బస్ భవన్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బస్సు భవనకు హాఫ్ కిలోమీటర్ దూరంలోనే బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడు అంచల భద్రతతో పోలీసులు పహారా కాశారు. అప్పటికే కొందరు నేతలను హౌస్ అరెస్ట్ చేశారు. ఉదయం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్ భవన్‌కు వెళ్లేందుకు నంది నగర్‌లోని తన నివాసం నుంచి బయల్దేరారు. సికింద్రాబాద్‌లోని రేతి ఫైల్ బస్ స్టేషన్ నుంచి పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆర్టీసి బస్సులో కేటీఆర్ ఆర్టీసీ ఎక్స్ రోడ్డులోని బస్ భవన్‌కు చేరుకున్నారు. కేటీఆర్ వెంట పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను నిరసిస్తూ బీఆర్ఎస్ తరపున చలో బస్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినం అని పేర్కొన్నారు. మహిళలకు ఉచితం అని, పురుషులకు టికెట్ల రేట్లు డబుల్ చేస్తే.. బస్ పాస్ ధరలు పెంచితే కుటుంబం మీద భారం పడదా? అని రేవంత్ సర్కార్‌ను నిలదీశారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు మొదట గృహ నిర్బంధం చేశారు. గురువారం తెల్లవారుజామునే నంది నగర్‌లోని కేటీఆర్ నివాసం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. తనతోపాటు బీఆర్ఎస్ నాయకుల ఇండ్ల ముందు భారీగా పోలీసుల మోహరింపుపై, ప్రభుత్వం పైన కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



గురువారం ముంబయిలో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని మోడీ, బ్రిటన్ ప్రధాని కీర్

# ద్వైపాక్షికం పటిష్టం

>> స్టార్మర్ నాయకత్వంలో భారత్, యుకె సంబంధాలు గణనీయమైన పురోగతిని సాధించాయి. భారత్, యుకె సహజ భాగస్వాములు. ప్రస్తుత ప్రపంచ అస్థిరత యుగంలో ఇరుదేశాల మధ్య పెరుగుతున్న ఈ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి ఒక ముఖ్యమైన పునాది“ అని మోడీ పేర్కొన్నారు. ఇరుదేశాల భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక పురోగతికి పునాదిగా మారుతోందని అభిప్రాయపడ్డారు. భారత్- బ్రిటన్ సంబంధాలకు పునాది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన వంటి విలువలపై ఉన్న ఉమ్మడి నమ్మకమేనని తెలిపారు. ముంబయిలో బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ఉన్నత స్థాయి చర్చల అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ, విద్య, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. భారత్, యుకె మధ్య అతిపెద్ద బిజినెస్ లీడర్స్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. వీటన్నింటితో పాటు ఇరుదేశాల సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి సూచనలు, అవకాశాలను పంచుకున్నామని వివరించారు. “ఇటీవల యుకె పర్యటన సందర్భంగా చరిత్రాత్మక సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. భారత్- బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో, రెండు దేశాలకు దిగుమతి ఖర్చు తగ్గుతుంది. యువతకు కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వాణిజ్యం పెరుగుతుంది. ఈ ఒప్పందం భారత్‌లోని పరిశ్రమలు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఒప్పందంపై సంతకం చేసిన కొద్ది నెలల్లోనే, ఇప్పటివరకు అతిపెద్ద వ్యాపార ప్రతినిధి బృందం యుకె ప్రధాని స్టార్మర్‌తో పాటు భారత్‌కు రావడం ఇరుదేశాల భాగస్వామ్యానికి నాందిగా నిలిచింది.“ అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. యుకెకు చెందిన తొమ్మిది విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లను ప్రారంభిస్తాయని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం తాలుక గురుగ్రామ్ క్యాంపస్ ఇప్పటికే ప్రారంభమైందని, అక్కడ ఇప్పటికే మొదటి సంవత్సరం విద్యార్థులు చేరారని పేర్కొన్నారు. అని మోడీ తెలిపారు. భారతదేశ వృద్ధి కథ చాలా అద్భుతమైనదని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. 2028 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్, ప్రధాని మోడీ నాయకత్వాన్ని తాను అభినందిస్తున్నానని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే ప్రధాని మోడీ లక్ష్యమన్నారు. “భారత్ అభివృద్ధి ప్రయాణంలో యుకె భాగస్వామిగా ఉండాలని కోరుకుంటోంది. నా సందర్శన ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రికార్డు స్థాయిలో 126 మంది బ్రిటిష్ ప్రతినిధుల బృందంతో భారత్‌కు తీసుకొచ్చాను. మేము భారత్‌తో కలిసి భవిష్యత్తుపై దృష్టి సారించాం. కొత్త ఆధునిక భాగస్వామ్యాన్ని సృష్టిస్తున్నాం. రెండు దేశాలు మరింతగా కలిసి పనిచేస్తాయనే నమ్మకం, విశ్వాసం ఉంది“ అని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

### రూ.10986 కోట్లతో
## హ్యామ్‌రోడ్ల నిర్మాణం

>> మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అద్దంలా ఆర్ అండ్ బి రోడ్లు తీర్చిదిద్దుతామని వివరించారు. దేశానికే రోల్ మోడల్ గా నిలపాలనే లక్ష్యంతో ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని ఆయన చెప్పారు. ప్రమాదాలు తలెత్తకుండా అత్యంత ఆధునిక సాకేంతిక పరిజ్ఞానంతో రోడ్ల నిర్మాణంపై ప్రధాన దృష్టి సారించామని దశలవారిగా హ్యామ్ రోడ్లు చేపట్టనున్నట్లు మంత్రి కోమటి రెడ్డి స్పష్టం చేశారు మొదటి ఫేజ్ లో 5,587 కి.మీ,తీసుకొంటామనిఅన్నారు. మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు డబుల్ లేన్ రోడ్లు వేస్తామని, జిల్లా కేంద్రాల నుండి రాష్ట్ర రాజధానికి నాలుగు వరసల రోడ్ల నిర్మాణం చేస్తామని చెప్పారు.

మొదటి ఫేజ్ కు వచ్చే నెలలో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. ఫ్లడ్ డ్యామేజ్ రోడ్ల వివరాలు సమగ్రంగా సేకరణ చేసి వాటిపై కూడా దృష్టిసారించాలని ఇంజనీర్లకు ఆదేశాలు జారీచేశారు. రోడ్లు రాష్ట్ర ప్రగతికి సోపానాలు అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ఆర్ అండ్ బి ఇఎన్‌సి లు మోహన్ నాయక్,జయ భారతి,సి.ఈ లు బి.వి రావు,కిషన్ రావు పలువురు ఎస్.ఇలు,ఇఇలు తదితరులు పలువురు ఆర్ అండ్ బి అధికారులు అభిప్రాయపడ్డారు.

## ఎన్నికల కోడ్ ఎత్తివేత
### స్థానిక ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ నిలిపివేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు9:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 29న విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు గురువారం రాత్రి ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలు,నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ ఇచ్చే వరకు ఎన్నికల ప్రక్రియలన్నీ నిలిపివేసినట్లు ప్రకటించింది. కాగా గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, 42 శాతం బిసి రిజర్వేషన్లతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పై హైకోర్టు సాయంత్రం 4.30 గంటలకు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై ఎన్నికల సంఘం స్పందించింది. హైకోర్టు ఆదేశాల మేరకే వ్యవహరిస్తామని వెల్లడించింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు బ్రేక్ పడినట్లు అయ్యింది.కాగా, తొలిరోజు ఉదయం నామినేషన్ల ప్రారంభమైనందున ఎంపీటీసీ,జెడ్‌పిటీసీ స్థానాల్లో 16 జెడ్‌పిటీసీ, 103 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు అయినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది, అత్యధికంగా కొమురం భీం జిల్లాలో ఎంపీటీసీ స్థానాల్లో 9 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. సిద్దిపేటలో జెడ్‌పిటీసీ స్థానాల్లో 7 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. పలు చోట్ల నామినేషన్లు దాఖలు కాలేదు.

## ఎఐసిసి పరిశీలకులు రాక

>> స్థాయిలో పర్యటించి వారం రోజులలో ఒక సమగ్రమైన నివేదిక ఎఐసిసి కి అందజేస్తారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం పరిశీలకుల పేర్లను ఎఐసిసి సెప్టెంబరు మూడో వారం ప్రకటించింది. జాతీయ స్థాయిలో సీనియర్ నాయకులను పరిశీలకులనియమించినారు.డిసిసిల నియామకాలను ఎఐసిసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొంది అందుకే పరిశీలకుల నియామకం జాబితాను కూడా ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేపేరుతోనే విడుదల చేశారు. ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవడానికి ఎఐసిసి సీనియర్ నాయకులను ఇంచార్జ్ లుగా నియమించినారు. ఎఐసిసిమాజీ ముఖ్యమంత్రి, సభ్యులు, మాజీ కేంద్ర మంత్రులు, స్పీకర్ గా పని చేసిన వారిని తెలంగాణ డిసిసిల నియామకాలకు ఇంచార్జ్ లుగా వేయడం జరిగింది. డిసిసి నియామకాలకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో డిసిసి నియామకాలు ఎంత పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా, ఎలాంటి ఒత్తిడి లేకుండా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు.డిసిసి లకు భవిష్యత్ లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనుండడంతో డిసిసి లకు డిమాండ్ పెరిగింది.

## నేటి నుంచి సిపిజెట్-2025 రెండో విడత కౌన్సెలింగ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, అక్టోబరు 9:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు(సిపిజెట్)-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత కౌన్సెలింగ్‌ను నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభించనున్నారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా 10 నుంచి 14 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగానే ఎంఈడి, ఎంపిఈడిలో అడ్మిషన్లకు సంబంధించిన మొదటి విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15,16 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఈ నెల 17న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 21న రెండో విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారు ఈ నెల 24లోగా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు. 2025-2026 విద్యా సంవత్సరానికి పిజి మొదటి సంవత్సరంలో చేరడానికి వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో మొదటి విడతలో 20,467 మందికి సీట్ల కేటాయింపు చేశారు. సీటు పొందిన వారు ఈ నెల 8 వరకు కాలేజీల్లో చేరడానికి అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవేశాల కోసం సిపిజిఈటి-2025ను నిర్వహించిన సంగతి తెలిసిందే.

## బిజెపి, బిఆర్ఎస్‌లే బిసి బిల్లును అడ్డుకున్నాయి: మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించలేదని, దానికి కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నాయని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక ప్రకటనలో ఆరోపించారు. కోర్టులో కేసులు వేయించింది బిఆర్ఎస్, బిజెపిలే అని ఈ రెండు పార్టీలు కలిసి బిసిలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నేతలను బిసి బిడ్డలు ప్రశ్నిస్తారన్నారు. ప్రజలు బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ లోని ప్రజా ప్రభుత్వం పక్కాగా బీసీ కులగణన పూర్తి చేసిందన్నారు.

# హైకోర్టు తీర్పు దురదృష్టకరం

### నోటి కాడ ముద్ద లాక్కోవడమే: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** నాలుగు వారాలు ఎన్నికలు వాయిదా వేస్తూ కోర్టు స్టే ఇవ్వడం అన్యాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఇది 'బీసీల నోటి కాడ అన్నం ముద్దను లాక్కోవడమే' అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వేసిన తర్వాత రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పులకు వ్యతిరేకంగా నాలుగు వారాలు ఎన్నిక వాయిదా వేయడం పట్ల ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో 14 బీసీ సంఘాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. కోర్టు స్టే ఇచ్చిన తర్వాత బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆర్ కృష్ణయ్య హైకోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులను తీవ్రస్థాయిలో ఖండించారు. 'గురువారం జడ్‌పిటీసి, ఎంపిటీసీల స్థానాలపై వేలాదిమంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కోర్టు ఎలా చేయిస్తాది' అన్నారు. కేసు నాలుగు రోజులుగా కోర్టులో నడుస్తుంది. ఇస్తే మొదటి రోజే ఇవ్వాలి. కానీ రెండుసార్లు స్టే ఇవ్వబోమని కోర్టు ఇవ్వడానికి నిరాకరించింది. చాలా వాదాలను విన్నాక ఇలా స్టే ఇవ్వడం బాధాకరం. రిజర్వేషన్ల కేసులో 30 బీసీ సంఘాలు ఇంప్లీడ్ కేసులు వేశారు. పిటిషనర్ల వాదన కూడా వినకుండా స్టే ఎలా ఇస్తారు' అని ప్రశ్నించారు. ఇది చాలా అన్యాయం అన్నారు. బీసీలను అవమానపరిచారని దీనికి భారీ మూల్యం చెల్లిస్తారని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు మద్దతుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఉన్నత న్యాయస్థానాలు బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వరుసగా ఇస్తున్నందున దీనికి ప్రధానంగా జడ్జీలలో బీసీ ఎస్సీ ఎస్టీలు లేకపోవడమే ప్రధాన కారణం హైకోర్టు సుప్రీంకోర్టు జడ్జీలా నియామకాల్లో ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బిసి సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, నీల వెంకటేష్,అనంతుల రామమూర్తి గౌడ్, అల్లంపల్లి రామకోటి, టీ.రాజకుమార్, రాజు నేత, చెరుకు మణికంఠ, లింగయ్య యాదవ్, పగిలిన సతీష్, రాందేవ్ మోడీ, ఆంజనేయులు, రామ నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో తహసీల్దార్

### మ్యూటేషన్ కోసం రూ.10 లక్షల డిమాండ్

**చిట్యాల, అక్టోబరు 9, ప్రభాతవార్త:** చిట్యాల మండల తహసీల్దార్ గగులోతు కృష్ణ గురు వారం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు.



మహబూబ్నగర్ ఏసీబీ డీఎస్పీ, నల్లగొండ ఇన్‌చార్జ్ ఎసిపి డిఎస్‌పి సీహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని మేసర్స్ రత్న హౌసింగ్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన 172 సర్వే నంబర్ భూమిని పరిశీలించి, పోలీస్ స్టేషన్‌కు రిపోర్ట్ ఇవ్వడం కోసం, అలాగే 172 సర్వే నంబర్‌లో గల భూమిని మ్యూటేషన్ చేయడం కోసం తహసీల్దార్ గగులోతు కృష్ణ సంస్థ ప్రతినిధుల వద్ద రూ.10 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు. చివరికి ఐదు లక్షలకు బేరం కుదరగా, గురువారం సంస్థకు చెందిన వ్యక్తి రూ.2 లక్షలు తహసీల్దార్‌కు చెందిన ప్రైవేట్ వ్యక్తి గట్టు రమేష్‌కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి వారిని పట్టుకున్నారు. అధికారులు తహసీల్దార్ కృష్ణ, గట్టు రమేష్‌ల నుంచి రూ.2 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు.

# గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగే దాకా పోరాటం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** గ్రూప్-1 అవకతవకల విషయంలో వారం రోజుల పాటు పోరాటాలు చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. రేపు అశోకనగర్లో వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం జాగృతి ఆధ్వర్యంలో గ్రూప్ నియామకాలపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చాక కూడా మన యువకులు ఇంత బాధపడాల్సి వస్తుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చాక మొదటి పదేళ్లలో కేసీఆర్ విద్యార్థుల కోసం చేయాల్సినంత చేశారు. ఐతే దురదృష్టవశాత్తు మనం గ్రూప్1 పరీక్ష



గురువారం జాగృతి ఆధ్వర్యంలో గ్రూప్-1 నియామకాలపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

నిర్వహించుకోలేకపోయామన్నారు గత ప్రభుత్వం ఎప్పుడు విద్యార్థుల మీద కోపం పెట్టుకోలేదన్నారు. గ్రూప్1 ఇష్యూను నేను ఒక తల్లి కోణంలో చూస్తున్నట్లు తెలిపారు. గత 6 నెలలుగా ఈ ప్రభుత్వ వైఖరిని చూస్తున్నామని ఇక లాభం లేదని పోరాటానికి సిద్ధమయ్యామని తెలిపారు. సిటీ లైబ్రరీ, అశోక్ నగర్ లో రాహుల్ గాంధీ అబద్ధపు అంశాలను ఎలా ముందుకు తెచ్చారో అదే ప్రాంతానికి వెళ్లి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో మాత్రమే కాదు..జిల్లాలు, ఊర్లు, గ్రామాలకు వెళ్లి పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను ఇప్పటికీ రష్యా యూనివర్సిటీలో పాఠాలుగా చెప్తున్నారని వెల్లడించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టండి.. ఉద్యోగాలు సాధించేలా కష్టపడండి.. మీ తరఫున మేము పోరాటం చేస్తామని కవిత తెలిపారు. ఈసందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశంలో ఐదు తీర్మానాలు పెట్టారు.

గ్రూప్ 1 నియామకాలు రద్దు చేసి.. తిరిగి ప్రిలిమ్స్, మెయిన్స్ నిర్వహించాలన్నారు. గ్రూప్1 రిజల్ట్ చివరికంటా పోరాటం చేయాలని నిర్ణయించామని కవిత తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీ అమలయ్యే వరకు ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని తీర్మానించామన్నారు. 2 లక్షల ఉద్యోగాల పూర్తి స్థాయిలో ఇచ్చే వరకు ప్రభుత్వం పై పోరాటం చేస్తామన్నారు. టీజీపీఎస్సీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని రిజర్వేషన్లను రద్దు చేసే విధంగా ఉన్న జీవో 29 ను రద్దు చేయాలని, మొత్తం ఐదు తీర్మానాలను చేశామని తెలిపారు. ఈ ఐదు తీర్మానాలను గవర్నర్, సీఎంలకు పంపిస్తామని చెప్పారు.

# వాయుకాలుష్యంతోనూ మోకాళ్ల నొప్పులే!

### శాస్త్రవేత్తల అధ్యయనంలో కొత్త విషయాలు వెలుగులోకి



**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** మనం పీల్చే కలుషిత గాలి కేవలం ఊపిరితిత్తులు, గుండెకే కాదని, కీళ్లను సైతం తీవ్రంగా దెబ్బతీసి శాశ్వత వైకల్యానికి దారితీసే రుమటాయిడ్ ఆర్థరైటిస్ (కీళ్లవాతం) వంటి వ్యాధులకు కారణమవుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటివరకు జన్యుపరమైన కారణాలతో ముడిపడి ఉన్న ఈ వ్యాధి, ఇప్పుడు వాయు కాలుష్యం కారణంగా కూడా ప్రబలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ పొరపాటున సొంత కణజాలంపైనే, ముఖ్యంగా కీళ్లపై దాడి చేసే ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. దీనివల్ల కీళ్లలో తీవ్రమైన నొప్పి, వాపు, బిగుసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఢిల్లీలోని ద్వారకలో జరిగిన ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ 40వ వార్షిక సదస్సులో (ఐరాకాన్ 2025) నిపుణులు ఈ కీలక విషయాలను వెల్లడించారు. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5, శరీరంలోకి ప్రవేశించి తీవ్రమైన వాపు ప్రక్రియలను ప్రేరేపిస్తున్నాయని, దీనివల్ల రోగ నిరోధక వ్యవస్థ అతిగా స్పందించి కీళ్లను దెబ్బతీస్తోందని తెలిపారు. "వంశపారంపర్యంగా ఎలాంటి ఆటో ఇమ్యూన్ వ్యాధుల చరిత్ర లేనివారు కూడా కాలుష్య ప్రాంతాల్లో నివసించడం వల్ల రుమటాయిడ్ ఆర్థరైటిస్ బారిన పడుతున్నారు. ఇది మనం ఇక ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేని ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి అని ఢిల్లీ ఎయిమ్స్ రుమటాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉమా కుమార్ అన్నారు. కాలుష్య సంబంధిత కేసులు కేవలం సంఖ్యలోనే కాకుండా, వ్యాధి తీవ్రతలోనూ ఎక్కువగా ఉంటున్నాయని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి ప్రొఫెసర్, రుమటాలజిస్ట్ డాక్టర్ పులిన్ గుప్తా వివరించారు. అధిక పీఎం 2.5 కాలుష్యానికి గురైన రోగులలో వ్యాధి చాలా వేగంగా ముదురుతోంది. పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం తగ్గడం కూడా ఈ సమస్యను మరింత జటిలం చేస్తోందని ఆయన తెలిపారు. భారత్ లో ఇప్పటికే సుమారు 1శాతం జనాభా ఈ వ్యాధితో బాధపడుతుండగా, కాలుష్యం కారణంగా ఈ సంఖ్య గణనీయంగా పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు శాశ్వత నివారణ లేదని, జీవితాంతం మందులతో నియంత్రించాల్సి ఉంటుందని వారు గుర్తుచేశారు. కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో అవగాహన పెంచాలని, ప్రమాదంలో ఉన్నవారికి ముందస్తు పరీక్షలు నిర్వహించాలని వారు ప్రభుత్వాలకు సూచించారు.

# ఐ సెట్ స్పెషల్ ఫేజ్ నాటికి 30,371 మందికి సీట్లు

### 13లోగా ఫీజు చెల్లించి కాలేజీల్లో చేరాలి
### 72 కాలేజీల్లో 100 శాతం సీట్ల కేటాయింపు
### సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఏ, ఎంసిఏ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఐసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపును గురువారం చేశారు. మొత్తం కన్వీనర్ సీట్లలో 80.2 శాతం సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన వారు ఈ నెల 13లోగా ఫీజు చెల్లించి, సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఫేజ్ నాటికి 72 కాలేజీల్లో 100 శాతం సీట్లను కేటాయించారు. ఐ సెట్-2025లో 58,985 మంది అర్హత సాధించారు. వారిలో 36,052 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరయ్యారు. స్పెషల్ ఫేజ్‌లో 6,466 మంది 76,331 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 288 కాలేజీల్లో 37,860 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. అందులో 30,587 ఎంబిఏ సీట్లు కాగా.. 7273 ఎంసిఏ సీట్లు ఉన్నాయి. వాటిలో స్పెషల్ ఫేజ్ నాటికి ఎంబిఏలో 25,743 సీట్లను కేటాయించగా.. ఎంసిఏలో 4,628 సీట్లను కేటాయించారు. ఎంబిఏలో 4,844 సీట్లు, ఎంసిఏలో 2,645 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం కన్వీనర్ కోటా సీట్లలో 80.2 శాతం సీట్లను కేటాయించారు. ఈ డబ్ల్యూఎస్ కోటాలో 942 సీట్లను కేటాయించారు. సీట్లు పొందిన వారు ఈ నెల 13లోగా ట్యూషన్ ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్‌తో కాలేజీల్లో చేరాలని కమిషనర్ సూచించారు. ఎంబిఏలో 20 యూనివర్సిటీ కాలేజీల్లో 1,573 సీట్లు ఉండగా 1440(91.5శాతం) కేటాయించారు. రెండు గవర్నమెంట్ కాలేజీల్లో 132 సీట్లు ఉండగా.. 75 సీట్లను(56.8శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 184 సీట్లు ఉండగా వాటిలో 178(96.7శాతం) సీట్లు కేటాయించారు. 252 ప్రైవేటు కాలేజీల్లో 28,698 సీట్లకి 24,050 (83.2 శాతం) సీట్లను కేటాయించారు. ఎంసిఏలో 17 యూనివర్సిటీ కాలేజీల్లో 1122 సీట్లు ఉండగా వాటిలో 894(79.6 శాతం) సీట్లను కేటాయించారు. 62 ప్రైవేటు కాలేజీల్లో 6,151 సీట్లు ఉంటే వాటిలో 3,734(60.7 శాతం) సీట్లను కేటాయించారు. ఎంబిఏలో 276 కాలేజీల్లో 30,587 సీట్లలో 25,743(84.1 శాతం) సీట్లను కేటాయించారు. ఎంసిఏలో 79 కాలేజీల్లో 7,273 సీట్లు ఉంటే వాటిలో 4,628(63.6 శాతం) సీట్లను కేటాయించారు.

# చట్టపరంగా, న్యాయపరంగా భవిష్యత్ కార్యాచరణ

### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై మంత్రి పొన్నం

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ అందిన తరువాత చట్టపరంగా, న్యాయపరంగా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వం తరుపున బలమైన వాదనలు వినిపించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించి డెడికేటెడ్ కమిషన్ వేసి, సబ్‌కమిటీ వేసి కేబినెట్ ఆమోదించి, శాసన సభలో చట్టం చేసి గవర్నర్‌కి పంపించడం జరిగిందన్నారు. 2018 పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేశామని, స్థానిక సంస్థల ఎన్నికలు జరపకపోవడం వల్ల కేంద్రం నుండి రావాల్సిన నిధులు రావడం లేదన్నారు. బిసి రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే విధిస్తుందని అనుకోలేదని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్సే నన్నారు. బిఆర్ఎస్, బిజెపిలు హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో జవాబు చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తమ అధినాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయంతో ఎన్నికలకు వెళ్తామని మంత్రి స్పష్టం చేశారు.

## బిసిల బిడ్డలెవరూ అధైర్యపడొద్దు!

### మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు బిసి రిజర్వేషన్‌లకు అనుకూలంగా కేసులో ఇంప్లీడ్ అవ్వాలని లేకపోతే చరిత్రలో బిసి ద్రోహులుగా చరిత్రహీనులుగా మిగిలిపోతారని రాష్ట్ర యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి హెచ్చరించారు. హైకోర్టు స్టేవిధించినా 42శాతం బిసి రిజర్వేషన్లు కల్పించడంలో వెనక్కి తగ్గేదేలేదని గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ గురువారం అన్నారు. సామాజిక న్యాయం కోసం రాజకీయంగా రిజర్వేషన్లు అమలు కాకుండా బిసిల నోటికాడ ముద్ద లాక్కునే ప్రయత్నం చేసారఇ ఆవేదన చెందారు. బిసి రిజర్వేషన్లకు ఎవరు అడ్డు పడుతున్నారో, యావత్తు తెలంగాణ ఆలోచన చేయాలని కోఆరరు. బిసిలపై చిత్తశుద్ధితో రాష్ట్రంలో ఎంపారికల్ డేటా చేపట్టడం జరిగిందని చెప్పారు. ఎంపారికల్ డేటా ఉన్నా స్టే విధించి బిసిల నోటికాడ ముద్ద లాగే ప్రయత్నం చేయడం శోషనీయం అని అన్నారు.ప్రభుత్వం వెనుక బడిన తరగతులకు ఇచ్చిన మాటపై కట్టుబడి ఉన్నదని పునరుద్ఘాటించారు. రాబోయే రోజుల్లో ఏ విధంగా ముందుకు వెళ్ళాలో ఆలోచన చేస్తామని అన్నారు. బిసిల బిడ్డలు ఎవరు అధైర్యపడొద్దు ఎవరు కూడా ఏలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. బిసిలకు రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు.

# ప్రజారోగ్యం దేశ ప్రజలందరి సామాజిక బాధ్యత

### దేశ భద్రత, విద్య, ఆరోగ్యం, ఆత్మ నిర్భరతకు అత్యధిక ప్రాధాన్యత
### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ప్రజా ఆరోగ్యం దేశ ప్రజలందరి సామాజిక బాధ్యత అని కరోనా లాంటి ఎలాంటి మహమ్మారినైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాండమిక్ రెడీ ఇండియా కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి ప్రబలినప్పటి నుంచి ఈ విషయం మనకు అర్థమైందని, కరోనా సమయంలో ఆ మహమ్మారిని ఎదుర్కొనేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సిద్ధంగా లేవన్నారు. కానీ 140 కోట్ల భారతీయులు ఐక్యంగా ఉండి ఆ మహమ్మారిపై పోరాడామని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మార్గదర్శనంలో కరోనాను పారదోలామన్నారు. సరైన సమయంలో లాక్‌డౌన్ విధించడం, మిషన్ సురక్షా ద్వారా కరోనా వ్యాక్సిన్‌ను త్వరితగతిన అభివృద్ధి చేశామన్నారు. పిఎంకేర్స్ నిధుల ద్వారా ఆరోగ్య, ఎమర్జెన్సీ సేవలను మరింత పటిష్టం చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎప్పుడూ దేశ భద్రత, విద్య, ఆరోగ్యం, ఆత్మ నిర్భరతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని, ఇందులో భాగంగా 2014 నుంచి ఇప్పటివరకు ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ స్వస్థ్ భారత్ యోజన, నేషనల్ హెల్త్ మిషన్, మిషన్ ఇంద్రధనుష్ వంటి అనేక పథకాలతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు.

ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్, నేషనల్ వన్ హెల్త్ వన్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ జూనోసిస్, నేషనల్ వెక్టార్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వంటి అనేక ప్రోగ్రామ్స్ తీసుకొచ్చామని తెలిపారు. ఎయిమ్స్ సంఖ్య 23కు పెంచినట్లు, మెడికల్ కాలేజీల సంఖ్యతో పాటు ఎంబిబిఎస్ సీట్ల సంఖ్యను భారీగా పెంచామన్నారు. దేశవ్యాప్తంగా 17 వేల జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో నాణ్యమైన మందులను అందరికీ అందుబాటు ధరలో అందజేస్తున్నామన్నారు. కరోనా సమయంలో నేషనల్ కంట్రోల్ రూమ్‌కు కోఆర్డినేటర్‌గా ఈ మహమ్మారిని ఎదుర్కొనే విషయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగిన యాక్టివిటీస్‌ను సమ న్వయం చేశా న్నారు. కరోనా కారణంగా ప్రపంచ వ్యాప్తంగా సప్లయ్ చైన్ ఆగిపోయిందని, దీంతో అంతర్జాతీయ వాణిజ్యం తగ్గిపోయిందన్నారు. పరిశ్రమలు పనిచేయలేదని, దీంతో మెడికల్ సామగ్రి లభ్యత తగ్గిపోయిందన్నారు. దీంతో ప్రధాని ఆత్మ నిర్భరతకు బాటలు వేశారు. దేశంలోనే వ్యా క్సిన్, డయాగ్నస్టిక్స్, పిపిఈ, వెంటిలేటర్లు, హెల్త్ మానిటర్ల ఉత్పత్తిని యుద్ధ ప్రాతిపదికన పెంచారన్నారు. ప్రధానమంత్రి నాయకత్వంలో పిఎం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్, ఆక్సిజన్ ప్లాంట్స్, ఐసీయూలను జిల్లా స్థాయి వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, వందకు పైగా దేశాలకు స్నేహపూర్వకంగా వ్యాక్సిన్లను అందజేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రాణాలు కాపాడామన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఆత్మ నిర్భరత సాధించేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అసవరం ఉందన్నారు.

# కాంగ్రెస్ 42 శాతం బిసి రిజర్వేషన్లు ఓ డ్రామా

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 9:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడం తెలిసిందే. ఈ పరిణామంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని, బీసీలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని, వారి కుట్రలు ఇప్పుడు పటాపంచలయ్యాయని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టినట్లే, ఇప్పుడు 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరో డ్రామాకు తెరతీశారని హరీశ్ రావు ఆరోపించారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, 22 నెలలుగా ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గల్లీలో డ్రామాలు సృష్టిస్తున్నారు తప్ప, అసలు పోరాటం చేయాల్సిన ఢిల్లీలో మౌనంగా ఉన్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే, దానికి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఆ దిశగా రేవంత్ రెడ్డి ఎందుకు ఒత్తిడి తేవడం లేదని ఆయన ప్రశ్నించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యం చేసేందుకే ప్రభుత్వం తూతూమంత్రంగా జీవో ఇచ్చి చేతులు దులుపుకుందని హరీశ్ రావు ఆరోపించారు. "55 ఏళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, బీసీ రిజర్వేషన్ల కోసం ఏనాడూ చిత్తశుద్ధితో పనిచేయలేదు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బీసీలపై కపట ప్రేమ చూపిస్తోంది. మీకు నిజంగానే బీసీలపై ప్రేమ ఉంటే, మీ జాతీయ నాయకులతో కలిసి ఢిల్లీలో పోరాటం చేయండి. పార్లమెంటులో ఈ అంశంపై చట్టం చేయించి, దాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించండి. అప్పుడే బీసీలకు నిజమైన న్యాయం జరుగుతుంది" అని ఆయన సవాల్ విసిరారు. బీసీల హక్కుల కోసం ఢిల్లీ వేదికగా చేసే పోరాటంలో అఖిలపక్షాలను భాగస్వామ్యం చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి డ్రామాలు ఆపి, బీసీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హరీశ్ రావు హితవు పలికారు.

## బిజెపి వల్లే బిసిలకు అన్యాయం

### హైకోర్టు స్టేతో విప్ ఆదిశ్రీనివాస్ ఆవేదన

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో చాలా నిరాశ చెందినట్లు తెలిపారు. బిసి రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని అన్నారు. కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా సిఎం రేవంత్ రెడ్డి ఒంటరి పోరాటం చేశారని కొనియాడారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కల్పించామని అన్నారు. కులగణన చేయడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బిసిల లెక్క తేల్చామని చెప్పారు. బిసిల నోటికాడి బువ్వ అందకుండా పోయింది.. అయినా మేం నిరాశ చెందం.. పోరాటం కొనసాగుతుంది అని కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఇప్పటికైనా బిసిల ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. బిసిలు ఎవరూ అధైర్యపడొద్దు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వే షన్లు సాధించుకుందామని అన్నారు.

# రాష్ట్రంలో పెరుగుతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు

### 2024-25లో 1,19,187 మెట్రిక్ టన్నులు వ్యర్థాలు విడుదల
### యుపి, హర్యానా తర్వాత తెలంగాణలో ఇ-వేస్ట్ వ్యర్థాలు అత్యధికం

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అంతకు రెట్టింపు వేగంతో ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు (ఈ వేస్ట్) విడుదల అవుతున్నాయి. సెల్ ఫోన్, కంప్యూటర్, ల్యాప్టాప్, రిఫ్రిజిరేటర్ ఎన్ ప్రింటర్లు ఇలా ప్రతి ఎలక్ట్రానిక్ ఉత్పత్తి వినియోగం తర్వాత వ్యర్థాలుగా మారుతున్నాయి. తెలంగాణలో తొలిసారిగా ఈ వేస్ట్ లక్ష మెట్రిక్ టన్నుల మార్క్ ను దాటింది. 2024 -25లో 1.19.187 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్ విడుదలయ్యాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.అదే 2023-24లో 5.228 మెట్రిక్ టన్నుల ఈ వేస్ట్ విడుదలైంది. అంటే ఏడాది కాలంలో రాష్ట్రంలో అదనంగా 53,961 మెట్రిక్ టన్నులు ఈ వ్యర్థాలు విడుదలయ్యాయి.దేశంలో ఉత్తరప్రదేశ్ హరియాణా తర్వాత దేశంలో అత్యధిక ఈ వ్యర్థాలు విడుదలవుతున్నది. మన రాష్ట్రం లోనే తెలంగాణలో అధికంగా ఈవేస్ట్ విడులయ్యేది హైదరాబాద్ నుంచే గత ఐదేళ్లలో నగరంలో ఉత్పత్తి అయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరుగుతుందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2017 -18లో నగరంలో 33,425 మెట్రిక్ టన్నుల ఈవ్యర్థాలు ఉత్పత్తికాగా ఇప్పుడది 50.835 మెట్రిక్ టన్నులు పెరిగాయి.

ఈ వేస్ట్ ప్రాసెసింగ్ దేశంలో ఈ వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం 13.97 మెట్రిక్ టన్నులు కాగా ఇందులో8.5 శాతం ప్రాసెసింగ్ వృద్ధిలోఉత్తరప్రదేశ్ తర్వాత తెలంగాణ రెండో స్థానంలో ఉంది. 2001 -22 నుంచి ఈ వెస్ట్ ప్రాసెసింగా మూడు రెట్లు వృద్ధి చెందుతోంది. ఐటీ సంస్థల కార్యకలాపాలు పెరుగుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం దుడుకైన ఈ వేస్ట్ నిర్వహణ విధానాలు ప్రాసెసింగ్ వృద్ధికి ప్రధాన కారణాలు 2021-22లో 42,297 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ప్రాసెసింగ్ కాగా గత ఆర్థిక సంవత్సరానికి 19 లక్ష మెట్రిక్ టన్నులకు పెరిగింది. అయితే రాష్ట్రంలో కేవలం 15 రీసైక్లింగ్ కేంద్రాలే ఉన్నప్పటికీ ప్రాసెసింగ్‌లో ఈ స్థాయిలో వృద్ధి నమోదు కావడం గమనార్హం. ఈ వ్యర్థాలు ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రభావం చూపిస్తుందని పర్యావరణ నిపుణులు ఆందోళన. వ్యక్తం చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో సీసం, పాదరసం, కాడ్మియం, క్రోమియం వంటి రసాయన పదార్థాలు ఉంటాయి. వీటిని సరిగా నిర్వీర్యం చేయ కుండా పారేస్తే, గాలి, నీరు,నేల కలుషితం అవుతాయి. ఈ కలుషితాలతో శ్వాస కోశ వ్యాధులు నాడీ సంబంధిత రుగ్మతలు దీర్ఘకాలిక వ్యాధులకు కారణవుతాయని వైద్యులు చెబుతున్నారు. పిల్లలు. వృద్ధులపై ఈ ప్రమాదం ఎక్కు గా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఎలక్ట్రానికి వ్యర్థాల నిర్వహణ సక్రమంగా, కనీసంగా అమలు చేయాలని నిపుణులు సూచిస్తు న్నారు. దేశంలో అత్యధికంగా ఈ వేస్టు రీ సైక్లింగ్ కేంద్రాలు ఉన్న రాష్ట్రాలు వివరాలు ఇలా ఉన్నాయి.

| | |
|---|---|
| ఉత్తరప్రదేశ్ | 82 |
| కర్ణాటక | 45 |
| మహారాష్ట్ర | 43 |
| హర్యానా | 32 |
| గుజరాత్ | 29 |
| తెలంగాణ | 15 |
| తమిళనాడు | 13 |
| రాజస్థాన్ | 10 |

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

### ఈగల్ టీమ్‌చే రూ.10 కోట్ల విలువైన ఎఫిడ్రిన్ స్వాధీనం

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీ డ్రగ్స్ పట్టు బడింది. అత్యంత పటిష్ట నిఘా ఉన్న అక్రమా ర్కులు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తూన్నే ఉన్నా రు.



జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను ఈగల్ టీం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.72 కోట్లు ఉంటుందని అధికారులు భావించారు. దేశ మార్కెట్‌లో రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయిదత్తా రెసిడెన్సీలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు ఈగల్ టీంకు విశ్వసనీయ సమాచారం అందడంతో దాడులు నిర్వహించి ఎఫిడ్రిన్ డ్రగ్స్‌ను పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా.. ఒకరు పరా రీలో ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఎఫెడ్రిన్ తయారీకి బిగ్ స్కేల్ కెమికల్ యూనిట్ వినియోగించినట్లు గుర్తించారు.

డ్రగ్ తయారీలో ప్రధాన నిందితుడు అయిన వాస్తవాయి శివరామకృష్ణ వర్మతో పాటు దంగేటి అనిల్, మద్దు వెంకటకృష్ణ, ఎం ప్రసాద్, ముసిని దొరబాబు ఉన్నారని తెలిపారు. వీరంతా ఏపీలోని కాకినాడ, తూర్పు గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారని పోలీసులు తేల్చారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములాను సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మన జీవితానికి ఒక ఉద్దేశ్యం, ఒక లక్ష్యం ఉంటేగాని అది జీవితం అనిపించుకోదు.

-రాఛెల్

# చిత్తశుద్ధి లేని చట్టాలెందుకు?

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాల మీద చట్టాలు చేస్తున్నా, కఠిన శిక్షలు తప్పవని ప్రకటనలతో హెచ్చరిస్తున్నా అవేమీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. ఆటపాటలతో, చదువుసంధ్యలతో ఆనందంగా గడపాల్సిన లక్షలాది మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాలకుల మాటలు నీటిమూటలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి పకడ్బందీగా సరికొత్త చట్టాలు తీసుకొచ్చామని నేతలు చెప్పుకుంటున్నా శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదోఒకమార్గంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటి కంటే ముఖ్యంగా ఏళ్లతరబడి మగ్గుతున్న బాలకార్మికులను ఆ కూపం నుంచి బయటకు తీసుకువచ్చినా వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది అధికారులందరికి తెలిసిన సత్యమైనా ప్రభుత్వాన్ని నమ్మించేందుకు కాగితాల మీద ఏదో రాసుకొని కాలం గడుపుతున్నారు. అందుకే చట్టాలు, శిక్షలు కాగితాలకే పరిమితం కావడంతో బాలకార్మిక వ్యవస్థ నిరాటంకంగా కొనసాగుతున్నది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదలు నేటి ప్రధాని నరేంద్ర మోడీ వరకు అటు రాష్ట్రపతులందరూ బాలలపట్ల అత్యంత ప్రేమాదరణలు చూపినవారే. ఈ బాలలే భావిభారత పౌరులని, వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆశించినవారే.ఆ దిశలో ఎన్నో కార్యక్రమాలు,మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించినవారే. అంతెందుకు రాజ్యాంగంలోని ఇరవైనాలుగోవ అధికరణ బాలకార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. పధ్నాలుగు సంవత్సరాల లోపు వయసు గల పిల్లలను, వ్యక్తులుకానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ) అధికరణ కూడా అదే విషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనిలో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలకు వయసుకు మించిన భారం అప్పగించకూడదని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నది. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాలున్నా అంతగా ఫలితం లేకపోవడంతో బాలకార్మిక వ్యవస్థలో మార్పులు రాకపోగా మరింత పెరుగుతుండడంతో 1986లో పదమూడు వృత్తులకు సంబంధించి యాభైఏడు రకాల పనులను పిల్లలతో చేయించకూడదని మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టాలకు విరుద్ధంగా బాలకార్మికులను పనిలో నియమించుకునేవారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆశించిన ఫలితాలు చేకూరలేదు.

1994లో ఈ విషయంలో ఆందోళన చెందిన కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా అప్పటి ప్రధాని పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. రెండువేల నాటికి బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించారు. అది కూడా కాగితాలకే పరిమితమైంది. రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మిక సంఖ్యను, పరిస్థితులను చూసి ఆందోళన చెందిన దేశ అత్యున్నత న్యాయస్థానం కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించింది. దీంతో ఉన్న చట్టాలతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం సాధ్యం కాదని, భావించిన కేంద్ర ప్రభుత్వం ఆ యేడాది అక్టోబరు పదిన కొత్త చట్టానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఇళ్లలో పనిచేస్తున్న లక్షలాది మంది బాలకార్మికుల భవిష్యత్‌కు భరోసా కల్పించి, వారికి అక్షరాలునేర్పించి చైతన్యవంతులను చేయాలనే దిశలో నడుం బిగించింది. పెద్దఎత్తునే హడావుడి చేశారు. ముఖ్యంగా బాలకార్మికులను నిబంధనలకు విరుద్ధంగా నియమించుకునేవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుశిక్ష విధించేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. ఇళ్లలో హోటళ్లు, రెస్టారెంట్లలో పనిచేస్తున్న బాలకార్మికులను బయటకు తీసుకువచ్చి వారికి విముక్తి కల్పిస్తున్నట్లు ప్రకటనలు చేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. దీంతో ఆ పిల్లలు తిరిగి పాతబాటే మేలని భావించిఅవైపే మొగ్గుచూపారు. తల్లిదండ్రుల్లో కూడా ప్రభుత్వం కల్పించే పునరావాస కార్యక్రమాల మీద నమ్మకం కలగలేదు.ఇటు చదువు రాక,అటు పనిరాక, రెంటికి చెడ్డరేవడిలాతయారై మరో మార్గంలో ప్రయాణిస్తారనే భయాందోళనలకు గురయ్యారు. దీంతో వారు కూడా పాతమార్గంవైపే మొగ్గుచూపారు. దీనికితోడు కరోనా రక్కసి సృష్టించిన బీభత్సంతో లక్షలాది మంది బాలకార్మికులు పాతబాటవైపే నడవడం ప్రారంభించారు. లేతవయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతుంటారో ఒక్కసారి మనస్సుపెట్టి ఆలోచించాలి. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా అలాంటి పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగు తెంచుకొని పుట్టిన కన్నబిడ్డను కేవలం డబ్బుకోసమే పరాయిపంచకు పంపడానికి కారణం వారి ఆర్థిక పరిస్థితేనన్నది నగ్నసత్యం. ఆ పిల్లలు చేయలేని, చేయరాని పనులెన్నో చేస్తూ మరెన్నో బాధలు అనుభవిస్తున్నారన్న విషయం ఆ తల్లిదండ్రులకు తెలియంది కాదు. అటు తల్లిదండ్రులకు, ఇటు తమకు ఇష్టంలేని ఆవ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దరిద్రమే ఏకైక కారణం. ఆ కోణంలో ఆలోచిస్తే కొంతవరకైనా సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

మనల్ని గాయపరిచినవారితో మనల్ని పోల్చుకోకపోవడమే సరైన ప్రతీకారం.



జేన్ పోర్టర్

మహనీయుడు మరణాసన్నదశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.



స్వీడెన్ బర్గ్


# చరిత్రతో ప్రయోగాలు చేయొద్దు!

**ఆర్.యస్.యస్ భారతీయ నాగరికత ప్రతిబింబిస్తున్న తత్వశాస్త్రానికి కస్టోడియన్ అని బిజెపి నాయకులన్నా, జాతిపిత గాంధీ ఆధునిక వైతాళికుడు జవహర్‌లాల్ నెహ్రూ వల్లనే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెసు చెప్పుకున్నా, చిదంబరం, శశిథరూర్ లాంటి నాయకులురాజకీయ లబ్ధిపొందాలనే తాపత్రం తమమాటల్లో అర్ధనిజాలు వక్కాణించినా, ఆర్‌యస్‌యస్, వాజ్‌పాయ్ ప్రతిభాపాటవాలను బిజెపి నాయకులు ఇప్పుడు తెరమీదకుతెచ్చినా భారత ప్రజలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదు. కలిసికట్టుగా ఆనాడు పోరాడబట్టే స్వాతంత్ర్యం ఈ దేశానికి వచ్చింది. ఇప్పుడున్న రాజకీయ నాయకులలో కొందరు అప్పుడు పుట్టలేదు కూడా! అందుకే ఆ ఫలాలను అందుకుంటూ, చెట్టుకాయలను అమ్ముకునే ప్రయత్నం ఈనాటి నాయకులు చేయడం న్యాయం కాదు. ఇప్పుడిప్పుడే మనదేశం అన్నివిధాలా ముందంజ వేస్తున్నది. దయచేసి వెనకకులాగే ప్రయత్నాలు చేయడం భావ్యం కాదు.**



రావులపాటి సీతారాం రావు

కాలగమనాన్ని ఎవరూ ఆపలేరు! చరిత్రను ఎవరూ తిరిగిరాయలేరు. కొందరి ప్రయత్నం చరిత్రను మార్చాలనే సంకల్పం, అందుకు తగ్గ ఏర్పాట్లు ఈ మధ్యకాలంలో విజ్ఞులు గమనిస్తూనే ఉన్నారు.ఎందుకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయంటే జవాబు ఒక్కటే కళ్లముందు కదలాడుతున్నది. ప్రస్తుత పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకోవాలనే ఆరాటం వల్ల కొందరు చరిత్రను తిరగతోడుతున్నారు. అర్థ సత్యాలను అనుకూలంగా విశ్లేషిస్తున్నారు. ఒక చిన్న ఆధారంతో మూలాలనే సమూలంగా పెళ్లగించాలనే ప్రయత్నంలో పడ్డారు. ఒక్కమాటలో చెప్పాలంటే చరిత్రతో రాజకీయాలు చేస్తున్నారు. రెండు,మూడు వార్తా కథనాలు ఈ మధ్య కావాలనో, మరెందుకనో బహుళ ప్రచారంలో ఉన్నాయి. వీటి ప్రస్తావన కేవలం ఈ కథనాల ఆధారంతో పార్టీలు పబ్బం గడుపుకుందామనే ఆలోచనను బహిర్గతం చేసేందుకే! అయితే ఒక కథనం ఈ నాటి యువతకు మార్గదర్శకంగా నిలిచే కథనం. ఒక విధంగా చరిత్ర సంగతి వదిలేస్తే, ఆ కథనం జాతిని మరొక్కసారి మేల్కొలిపి, సరైన మార్గంలో పెట్టేదే! ఈ కథనంలో రాజకీయ ప్రమేయం పసిగట్టడానికి ఆధారాలు లేవు. కానీ ఈ మంచి వార్తను కూడా రాజకీయ నాయకులు తమపార్టీలకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తారని హెచ్చరించేందుకే! నవజీవన్ ప్రెస్ ప్రచురించిన 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్' ఇప్పటివరకు అరవై ఒక్క లక్షల కాపీలు 17 భాషలలో అమ్ముడుపోయింది. అంతకంటే బహుశా ఎక్కువకాపీలే ప్రజలు తెచ్చుకొని చదివి ఉండవచ్చు. ఈ వంద సంవత్సరాలలో ఆ పుస్తకం 'బెస్ట్ సెల్లర్'గా పేరు తెచ్చుకుంది. జాతిపిత మహాత్మాగాంధీ రాసిన రచన అప్పట్లో పీరియాడికల్‌గా నవజీవన్ ట్రస్ట్ నుంచి నవంబరు 1925లో మొదలైన విషయం చాలా మందికి తెలియకపోవచ్చు కానీ, 'గాంధీ' గొప్పతనం దాదాపు జాతి, జాతిపితను మరిచిపోయిన తరుణంలో రిచర్డ్ అటెన్‌బరో సినిమా 'గాంధీ'ని మరొక్కసారి మహత్తరంగా జ్ఞప్తికి తెచ్చింది. 'లగేరహో మున్నాభాయి' హిందీ సినిమాతో మహాత్మా ముఖ్యంగా యువతకు దగ్గరయ్యారు. ఆసక్తిపరంగా ఇప్పుడు ఈ పుస్తకం కథ బయటకువచ్చింది. అయితే ఇంతవరకూ ఏ రాజకీయ పార్టీలూ గాంధీ మహాత్ముడిని తమ రాజకీయ పార్టీలో ఉత్పన్నమవుతున్న ఏ సమస్యతో ముడిపెట్టకపోవడం చాలా మంది పాతకాలం వారికి ఊరట కలిగిస్తున్నది. ఈ మధ్యన కాంగ్రెసులో సీనియర్ నాయకుడిగా ఎంతో అనుభవం గడించిన పి. చిదంబరం ఒక టి.వి ఇంటర్వ్యూలో చెప్పిన అంశం సెన్సేషనల్‌గా మారింది. కావాలనే ఆ ప్రస్తావన తెచ్చారో ఏమో కానీ ఇప్పుడున్న పరిస్థితులలో కాంగ్రెసు పార్టీకి మరో సమస్యను ఆయన ఇంటర్వ్యూ తెచ్చిపెట్టింది. 'ముంబాయిలో 26/11 ఉగ్రవాద దాడుల తర్వాత మన్మోహన్ గవర్నమెంట్ పాకిస్థాన్ ప్రభుత్వానికి ధీటుగా ప్రతిదాడులతో జవాబు ఇవ్వడానికి సిద్ధమైనా, ఆగిపోయింది. బహుశా అమెరికా ఒత్తిడి వల్ల కావచ్చు' అని ఆ ఇంటర్వ్యూలో ఇచ్చిన అంశం సారాంశం. ఇన్నేళ్ల తర్వాత చిదంబరం ఎందుకు



ఈ రహస్య సమాచారాన్ని అందివ్వాలని ఆశించారో తెలియదు. కానీ ఈ మాటలు మాత్రం కాంగ్రెస్ పార్టీని మరింత బలహీనపర్చడానికి కారణంగా మారాయి. టారిఫ్‌లతో తన విదేశాంగ విధానంతో భారత్‌ను ట్రంప్ తక్కువ చూపు చూస్తూ, ప్రధానికీ, బిజెపి నాయకత్వం వహిస్తున్న ఎన్‌డిఏ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ తరుణంలో ఎందుకు ఎన్నో పదవులు అనుభవించి కాంగ్రెసులో ప్రముఖ స్థానాన్ని పొందిన తమిళనాడు చిదంబరం కావాలనే ఈ నిప్పురవ్వ వదిలాడా, లేక యాదృచ్ఛికంగా ఈ సంగతి బయటపడిందా అన్న సంగతి అటుంచితే, బిజెపి పని మాత్రం గారెలబుట్టలో పడ్డట్లయింది. ఉగ్రవాదులు కాశ్మీర్‌లో చేసిన పహల్గాం దాడి తర్వాత భారత్, ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌ను భయంకరంగా నిర్వీర్యులను చేసింది. ప్రపంచ దేశాలు భారత్ ఆయుధ సంపత్తితో పాటు దాడి నైపుణ్యాన్ని గుర్తించాయి.కాంగ్రెసు పార్టీతోసహా అన్ని పక్షాలూ ఆర్మీ దాడిని శ్లాఘించక తప్పలేదు.ఇటువంటి తరుణంలో దిక్కుతోచక ట్రంప్ అదే పనిగా తానే పాకిస్థాన్, భారత్‌ల మధ్య ఘర్షణలు ఆపానని, ప్రచారం చేసుకున్నా, ప్రపంచ దేశాలు నమ్మలేదు. అనేక రకాల ఆర్థిక, దౌత్యపరమైన ఇబ్బందులు అమెరికా దేశం సృష్టించాలని ప్రయత్నించినా భారత్ పైచేయే అందరికీ కనపడింది. ఇలాంటి పరిస్థితులలో చిదంబరం బయటపెట్టిన రహస్యం లాంటి ఆ మాట (ఎంతవరకు నిజమో కాని) ఒక్కసారి కాంగ్రెసు పార్టీని పాతాళంలోకి తోసేసింది. అంతకు మునుపుకొందరు కాంగ్రెస్ నాయకులు కూడా ఇలాంటి మాటలతో ప్రతిపక్షమైన కాంగ్రెసును బలహీనపర్చారు. బిజెపి నాయకులు కాంగ్రెస్ నిష్క్రియా పర్వాన్ని మాత్రమే ఎత్తిచూపుతున్నారు కానీ, చిదంబరం ఆ విధంగా ఈ తరుణంలో మాట్లాడటం భావ్యం కాదని మాటవరుసకైనా అనటం లేదు. అలా అనాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారికి అనుకూలమైన పరిణామాలను ఎందుకు వదులుకుంటారు. చిదంబరం ప్రకటనకు విరుగుడుగా కాంగ్రెసు అధ్యక్షుడు ఖర్గే దేశమంతా స్వాతంత్ర్యం తెచ్చుకోటానికి బ్రిటిష్ వారితో పోరాడుతుంటే ఆర్.ఎస్.ఎస్ బ్రిటిష్ ప్రభుత్వానికే సహకరించిందని మళ్లీ పాత పాటనే తెరమీదకి తెచ్చారు. గాంధీ పుస్తకాన్నిగురించి అనుకోకుండా వచ్చిన కథనం ఆధారంగా గాడ్సే ఉదంతం కాంగ్రెస్ అనుకూలురు తెరమీదికి తెచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ఇలాంటి వ్యర్థ ప్రయత్నాలతో ఇప్పుడిప్పుడే అగ్రస్థానం వహిస్తూ ఆర్థికపరంగా ఆర్మీపరంగా, అభివృద్ధి పరంగా ముందుకు దూసుకొని వెళ్తున్న మన దేశ ప్రతిభను రాజకీయాలతో దిగజారుస్తున్నందుకేఆశ్చర్యపడాలి.ఆర్‌యస్.యస్ భారతీయ నాగరికత ప్రతిబింబిస్తున్న తత్వశాస్త్రానికి కస్టోడియన్ అని బిజెపి నాయకులన్నా, జాతిపిత గాంధీ ఆధునిక వైతాళికుడు జవహర్‌లాల్ నెహ్రూ వల్లనే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెసు చెప్పుకున్నా, చిదంబరం, శశిథరూర్ లాంటి నాయకులురాజకీయ లబ్ధిపొందాలనే తాపత్రం తమమాటల్లో అర్ధనిజాలు వక్కాణించినా, ఆర్‌యస్‌యస్, వాజ్‌పాయ్ ప్రతిభాపాటవాలను బిజెపి నాయకులు ఇప్పుడు తెరమీదకుతెచ్చినా భారత ప్రజలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదు. కలిసికట్టుగా ఆనాడు పోరాడబట్టే స్వాతంత్ర్యం ఈ దేశానికి వచ్చింది. ఇప్పుడున్న రాజకీయ నాయకులలో కొందరు అప్పుడు పుట్టలేదుకూడా! అందుకే ఆ ఫలాలను అందుకుంటూ,చెట్టుకాయలను అమ్ముకునే ప్రయత్నం ఈనాటి నాయకులు చేయడం న్యాయం కాదు. ఇప్పుడిప్పుడే మనదేశం అన్నివిధాలా ముందంజ వేస్తున్నది. దయచేసి వెనకకు లాగే ప్రయత్నాలు చేయడం భావ్యం కాదు. ●

# 'కడుపుకోత'లు తెలంగాణలోనే ఎక్కువ!

డాక్టర్ మధుసూదన్ రెడ్డి బుర్ర

గర్భం దాల్చడం ఓ మధుర అనుభూతి. మాతృత్వం ఓ దేవుడిచ్చిన వరం. సహజ ప్రసవం ఓ అద్భుత అదృష్టం. సహజ ప్రసవంతో మాతాశిశు ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయి. అన్నీ తెలిసిన నడవంత్రపు నరులు తీరొక్క ఆలోచన చేస్తున్నారు. పిల్లల్ని కనడం భూమిని మోసినంత భారం అవుతున్నది. పిల్లల పెంపకంలో బాధ్యతలు బాధలతో కూడినవే అంటూ విపరీత ఆలోచనలు చేస్తున్నాం. కుటుంబ నియంత్రణ బహుళ ప్రచార దీవెనలతో వన్ ఆర్ నన్ నినాదాన్ని నిజం చేస్తున్నాం. సహజ ప్రసవంలో ప్రసవ వేదన పడలేమంటూ, మంచి ముహూర్తాలు చూసి ఆయా సమయాలకు ఆపరేషన్ ద్వారా అవాంఛనీయ కృత్రిమ ప్రసవాలకు మొగ్గు చూపుతున్నాం. సుముహూర్తాలను చూసుకొని కడుపు కోతలు, అధిక బిల్లుల వసూలుకు ప్రైవేట్ ఆసుపత్రులు పాటిస్తున్న అనైతిక ఆచారాలు, పూర్తి అవగాహన లేకపోవడం లాంటి పలు కారణాలతో క్రమంగా సహజ ప్రసవాలు తగ్గుతూ సిజేరియన్ ఆపరేషన్లు పలు రెట్లు పెరుగుతున్నాయి. ఆధునిక ప్రసవాల్లో సహజ ప్రసవాలు అరుదైపోతున్నాయి. మాతాశిశు ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నాం. ప్రపంచ స్థాయిలో నేడు సిజేరియన్ ప్రసవాలు 21 శాతం జరుగుతుండగా, ఇవి 2030నాటికి 28 శాతానికి పెరగవచ్చని కూడా అంచనా వేస్తున్నారు. భారత్‌లో 2016లో 17.2 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ ద్వారా జరుగగా, 2021లో అది 21.5 శాతానికి పెరగడం గమనించారు. 2021లో ప్రైవేట్ ఆసుపత్రి ప్రసవాల్లో ఏకంగా 47.4 శాతం ప్రసవాలు,




ప్రభుత్వ ఆసుపత్రుల్లో 14 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ల ద్వారా జరిగినట్లు లాంసెట్ దేశవ్యాప్త విస్తృత అధ్యయనాల ద్వారా తెలుస్తున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం కేవలం 15శాతం కన్న తక్కువగా కావలసిన సిజేరియన్ ప్రసవాలు నేడు భారతదేశవ్యాప్తంగాపలు రాష్ట్రాల్లో అత్యధిక శాతం నమోదు కావడం విచారకరం. దేశంలో సిజేరియన్ ప్రసవాలు అత్యధికంగా తెలంగాణ రాష్ట్రంలో 60.7 శాతం వరకు జరుగుతున్నాయని, అతి తక్కువ సిజేరియన్ ప్రసవాలు నాగాలాండ్‌లో 5.2 శాతం మాత్రమే జరుగుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా తమిళనాడులో 44.9 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 42.4 శాతంగా సిజేరియన్ ప్రసవాలు నమోదు అయ్యాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో మేఘాలయాలో 8.2 శాతం, బీహార్‌లో 9.7 శాతం మాత్రమే సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. పేదలతో పోల్చితే ధనిక వర్గాల్లో ఐదు రెట్లు అధికంగా సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నట్లు స్పష్టం అవుతున్నది. సహజ ప్రసావాలకు వైద్యులు, వైద్య సిబ్బంది ఎక్కువ సమయం, శ్రమ కేటాయించాల్సి వస్తున్నది. సిజేరియన్ ఆపరేషన్ ప్రసవాలు కేవలం గంటలో పూర్తి కావడంతో వైద్యులకు, ప్రసవించిన తల్లులకు శ్రమ తగ్గుతోంది. ప్రసవ సమయంలో మాతాశిశు ఆరోగ్యానికి ప్రమాదం కావచ్చని భావించినపుడు మాత్రమే సిజేరియన్ ప్రసవాలను ఆశ్రయించాలి. సహజ ప్రకృతి ప్రసవాలకు అవకాశం ఉన్నప్పటికీ సిజేరియన్ ప్రసవాలను ఆశ్రయించడం తల్లి బిడ్డలకుఆరోగ్యకరం కాదు. సహజ ప్రసవాలతో శిశువులపై మాతృత్వ అనుభూతులు తియ్యగా ఉంటుంది. ప్రకృతి నియామకాలకు విరుద్ధంగా వేసే ప్రతి అడుగు అనర్థానికి దారి తీస్తుందని గమనించి సహజ ప్రసవాలకు పట్టం కడదాం. ●

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రతీ ఏడాది అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నాం. నేటి ఔత్సాహిక యువతరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సతమవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణంలోనే చూస్తున్న ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలిపేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానసిక రోగులుగా మారిపోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చివాళ్ళేననేది నిపుణుల అంచనా. అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్‌గా వుండే వాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్ నార్మాలిటీ? ఎన్ని వింత పోకడలు?తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి, పేరుపిచ్చి, సినిమాల పిచ్చి, గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు,అతివాగుడు, మితిమీరిన కోపం వైద్య పరిభాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించుకోలేకపోవడమే రుగ్మతను తెచ్చిపెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంతవరకు ఎవరూ మనని తప్పుపట్టరు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభమవుతుంది. మొత్తం 20 శాతం మంది బాలబాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వసాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణమవుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం, కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. అమ్నోసియా ఇది కూడా సర్వసాధార



ణంగా కనబడేదే. వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చిపోతుంటారు. ఆస్పర్జెర్స్ సిండ్రోమ్ వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోషకరమైన పండుగలు ఇతరత్రా ఏవివచ్చినా వాటిని జరుపుకునేందుకు ఆసక్తిచూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మహత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్ అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంటుంది. వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయం పెరగడంతోవృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతో పాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యాపెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వందమందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్యసమస్యలు వస్తున్నాయి. మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. జన్యుశాస్త్రం కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల ఇతర అంశాలవల్ల అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి. అంటు రోగాలు మెదడు దెబ్బ తినడానిక,మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగివుంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఏ.ఎన్.డి.ఏ) గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనేది అబ్సెస్సివ్‌కంపల్సివ్ డిజార్డర్ (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితి తప్పనిసరి, బలవంతమైన వైకల్యం) ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. మెదడులోని కొన్ని భాగాలలో లోపాలు కలుగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుంది. ●

# ప్రజావాక్కు



### గ్రామీణ ప్రాంత రోడ్లను బాగు చేయాలి

**ఇటీవలి** కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపు నీరు రోడ్ల పై నుండి ప్రవహించి రోడ్లు కోతకు గురైయ్యాయి. ఈ పరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి,కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడే విధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపివాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

**- తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా**

### ఉద్యోగాల కోత

**ఇప్పటి వరకు** ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. ఏటా లక్షల మంది దేశవ్యాప్తంగా ఇంజనీర్లు పుట్టుకువస్తున్నారు. వీరందరికి ఉద్యోగాలు దొరకక బ్యాంకులలోనూ, ఇతర ప్రభుత్వ ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్యతమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు.తక్కువజీతంలో కొత్తవారిని తీసుకుంటున్నారు. చాలా మంది ఇళ్ళు, బళ్ళు కొని బ్యాంకులకు ఇన్‌స్టాల్‌మెంట్లు కడుతున్నారు. వీరి ఆర్థిక భవిష్యత్తు అంధకారమవుతున్నది.

**- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్**

### ఎన్నికలలో విద్యార్హతలు నిర్ణయించాలి

**త్వరలో** జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో నేరస్తులుగా జైలుశిక్షఅనుభవించిన వారిని,హత్యలు,కొన్నిపోలీస్ కేసులు ఉన్న వారిని నేరస్తులుగా శిక్ష పడిన వారిని, ఎన్నికలలో పోటీ చేసే అర్హతను కట్టడి చేయాలి. ఎన్నికలలో పోటీ చేయకుండా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనర్హులుగా ప్రకటించాలి. స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు విద్యా అర్హతలు నిర్ణయించాలి.

**- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా**

### దగ్గు మందు నిషేధం

**ఇటీవలి** కాలంలో ప్రభుత్వాలు కొన్ని దగ్గు మందులపై నిషేధం విధించడం ప్రజారోగ్య పరిరక్షణలో ఒకముఖ్యమైన నిర్ణయంగా చెప్పుకోవచ్చు. మార్కెట్‌లో లభించే కొన్ని సిరపులు, మందుల్లో ప్రమాదకరమైన రసాయనాలు ఉండటం, వాటి వాడకం చిన్నారులలో,యువతలో వ్యసనానికి దారి తీస్తుండటం గమనార్హం. ముఖ్యంగా కోడైన్ వంటి పదార్థాలు కలిగిన దగ్గు సిరపులు మత్తు పదార్థాలుగా మారి ఆరోగ్యానికి హానికరమవుతున్నాయి. ఈ పరిస్థితిని అరికట్టడానికి కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ కొన్ని బ్రాండ్లను నిషేధించడం సముచితం. దీని ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి, వైద్యుల సలహా లేకుండా మందులు వాడే అలవాటు తగ్గుతుంది. తల్లిదండ్రులు పిల్లలకు మందులు ఇచ్చేటప్పుడు వైద్యుని సూచన తప్పనిసరిగా తీసుకోవాలి.దగ్గు మందు నిషేధం అనేదికేవలం నియంత్రణచర్య మాత్రమే కాదు ఇది ఆరోగ్య భద్రతకు, సమాజం మేలుకు దారితీసే నిర్ణయం.

**- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి**

### స.హ. చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

**సమాచార** హక్కుచట్టం వారోత్సవాల్లో సమాచారహక్కు చట్టం ఎలా అమలులోకి వచ్చింది, చట్టంతో ప్రజలకు ఉపయోగపడే వివరాలను తెలుపాలి సమాచార హక్కు చట్టం కింద ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల సమాచారం,ఉద్యోగులవిధులు, బాధ్యతలు తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చు. దేశభద్రత, రహస్య ఇతర ఇబ్బందులు ఎదురయ్యే సమాచారం మినహా అన్ని ఇవ్వాలి.ప్రతిప్రభుత్వ కార్యాలయంలో పౌరసమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి వివరాలు ఉండాలి. ఎవరైనా సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30రోజుల్లో వారికి సమాధానం ఇవ్వాలి.

**-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా**

### దాడి గర్హనీయమైంది

**సుప్రీంకోర్ట్** ప్రధాన న్యాయమూర్తిపయిన జరిగిన దాడి గర్హనీయమయింది. కోర్ట్ సెంట్రల్ హాల్‌లో అందరూ చూస్తుండగా జరగడం ఒక కారణం రెండు అతని పదవికి అతని అభిప్రాయ స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా సదరు న్యాయమూర్తి వ్యవహారం ఉంది. కజురాహో విగ్రహం విషయంలో దాఖలు అయిన పిల్ విషయంలో సదరు ప్రధాన న్యాయమూర్తి వ్యక్తికరించిన అభిప్రాయంకు మీడియా అత్యంత ప్రాధాన్యత ప్రచారం కల్పించింది. మీడియా కొంత సంయమనం వహిస్తే బాగుండు.

**-భారత అవినాష్, జనగామ**

మన విఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వస్తుందో.. రాదో!

## నోబెల్ 'శాంతి' పై ట్రంప్ నిర్వేదం



**వాషింగ్టన్, అక్టోబరు 9:** ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ఒక్క రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏడు ప్రపంచ స్థాయి వివాదాలను పరిష్కరించానని చెప్పుకుంటూనే, ఆ పురస్కారం తనకు దక్కకపోవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు బహుమతి ఇవ్వకుండా ఉండేందుకు నార్వే నోబెల్ కమిటీ ఏదో ఒక కారణాన్ని వెతుకుతుందని ఆయన జోస్యం చెప్పారు. గురువారం వైట్ హౌస్‌లో ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. నాకు నోబెల్ బహుమతి వస్తుందో లేదో తెలియదు. మేం ఏడు యుద్ధాలను పరిష్కరించామని విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెబుతారు. ఎనిమిదో వివాదం పరిష్కారానికి కూడా చాలా దగ్గరగా ఉన్నాం. రష్యా సమస్యను కూడా మేమే పరిష్కరిస్తామని భావిస్తున్నాను. చరిత్రలో ఏ నాయకుడూ ఇన్ని వివాదాలను పరిష్కరించి ఉండడు అని ట్రంప్ అన్నారు. అయితే, నోబెల్ కమిటీ మాత్రం తనకు పురస్కారం ఇవ్వకపోవడానికి ఏదో ఒక కారణం వెతుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రంప్ ఇలా అనుమానాలు వ్యక్తం చేస్తుండగా, వైట్ హౌస్ మాత్రం ఆయన్ను ది పీస్ ప్రెసిడెంట్ (శాంతి అధ్యక్షుడు) అంటూ అభివర్ణిస్తూ ఒక చిత్రాన్ని పంచుకుంది. ఇది ట్రంప్ వ్యాఖ్యలకు పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఇటీవల ఇజ్రాయెల్‌హమాస్ మధ్య తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో ట్రంప్ కీలక పాత్ర పోషించినట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలో భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న సైనిక సంక్షోభాన్ని కూడా తానే పరిష్కరించానని ట్రంప్ పలుమార్లు చెప్పుకున్నారు. ఈ కారణంగానే పాకిస్తాన్ ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసింది. అయితే, అమెరికా జోక్యం వల్లే కాల్పుల విరమణ జరిగిందన్న వాదనను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ డీజీఎంఓ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణకు అంగీకరించామని, ఇందులో అమెరికా పాత్ర ఏమీ లేదని న్యూఢిల్లీ స్పష్టం చేసింది. తనకంటే ముందు బరాక్ ఒబామాకు నోబెల్ బహుమతి రావడంపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన ట్రంప్, ఈసారైనా తనకు ఆ పురస్కారం దక్కాలని బలంగా ఆకాంక్షిస్తున్నారు.

# ఇక 'జైషే' మహిళా ఉగ్రవాదులు!

## పంథాను మార్చుకున్న అంతర్జాతీయ ఉగ్రసంస్థ



**ముజఫరాబాద్, అక్టోబరు 9:** ఆపరేషన్ సిందూర్ దెబ్బకు ఛిన్నాభిన్నమైన పాక్ ఉగ్ర సంస్థ జైషేమహ్మద్ కొత్త పన్నాగానికి తెర తీసింది. ఉగ్రకార్యకలాపాల్లో తొలిసారిగా మహిళలను రంగంలోకి దింపేందుకు సిద్ధమైంది. ఐసీస్, బోకో హారమ్, హమాస్, ఎల్‌టీటీఈ వంటి సంస్థలు మహిళా ఉగ్రవాదులను ఆత్మాహుతి దాడులకు ఉపయోగిస్తాయి. అయితే, లష్కర్ ఏ తాయిబాతో పాటు జైష్ మాత్రం మహిళలను యుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉంచుతాయి. కానీ జైష్ తాజాగా తన పంథాను మార్చుకుంది. ఉగ్ర కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు మహిళలనూ రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. ఇందుకు జైష్ అధినేత మసూద్ అజర్, అతడి సోదరు తల్హా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మహిళ ఉగ్రమూకల బృందానికి జమాత్ ఉల్ మోమినత్ పేరును ఖరారు చేశారు. ఈ దళానికి జైష్ అధినేత మసూద్ అజర్ సోదరి సాదియా అజర్ నేతృత్వం వహిస్తోంది. ఈ బృందంలో ఇప్పటికే జైషే ఉగ్రవాదుల భార్యలను చేర్చుకుంది. వీరితో ఆత్మాహుతి దాడులు చేయించేందుకు తర్ఫీదునిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత దళాలు జైష్ ప్రధాన కార్యాలయంపై జరిపిన దాడిలో సాదియా భర్త మరణించాడు. ఆర్థికంగా, సామాజికంగా బలహీన స్థితిలో ఉన్న మహిళలను జైష్ ఈ బృందంలో చేర్చుకుంటోంది. బహావల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్, మాన్సేరా ప్రాంతాల్లోని తన కేంద్రాల్లో మహిళలను రిక్రూట్ చేసుకుంటోంది. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా రిక్రూట్‌మెంట్ చేసుకునేందుకు ట్రై చేస్తోంది. భారత్‌లో కూడా జమాత్ ఉల్ మోమినత్ కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధమైన జైష్ ఆన్‌లైన్ వేదికల ద్వారా జమ్మూకశ్మీర్, యూపీలో తన ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దక్షిణాదిలోని కొన్ని ప్రాంతాలను కూడా జైష్ టార్గెట్ చేసింది. మతం పేరిట నగరాల్లోని విద్యావంతులైన మహిళను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించేలా మక్కా, మదీనాల ఫొటోలతో కూడిన సర్క్యులర్‌లను జారీ చేసింది. ఇక ఆపరేషన్ సిందూర్ దాడుల్లో తమ కుటుంబంలోని పది మంది మరణించారని జైష్ అధిపతి మసూద్ గతంలో ప్రకటించాడు. తన సోదరి, ఆమె భర్త, మరో బంధువు, అతడి భార్య, మేనకోడలు, మరో ఐదుగురు చిన్నారులు మరణించినట్టు తెలిపారు. భారత్ 1994లో మసూద్‌ను అరెస్టు చేసినా ఆ తరువాత ఎయిర్ ఇండియా ఐసీ 814 విమానం హైజాక్ నేపథ్యంలో అతడిని విడిచిపెట్టాల్సి వచ్చింది.

# కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'సాక్షమ్' ఇక రంగంలోకి

## ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో రూపకల్పన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9:** సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం మరింత ముందడుగు వేసింది. సంపూర్ణ దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'సాక్షమ్' అనే అత్యాధునిక కౌంటర్ డ్రోన్ వ్యవస్థను కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) ఈ వ్యవస్థను రూపొందించింది. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన దాదాపు 400 డ్రోన్లను భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ అవసరాన్ని సైన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సాక్షమ్ కొనుగోలుకు ఫాస్ట్ ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ (ఎఫ్టీపీ) విధానంలో ఆమోదం తెలిపింది. రాబోయే ఏడాదిలోగా ఈ వ్యవస్థను అన్ని సైనిక క్షేత్రాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో సైన్యం కేవలం భూభాగంపైనే దృష్టి సారించేది. కానీ ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, భూమికి 10,000 అడుగుల ఎత్తు వరకు ఉన్న గగనతలాన్ని కూడా వ్యూహాత్మక యుద్ధ క్షేత్రంగా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తించి, వాటిని నాశనం చేస్తూనే మన వైమానిక దళాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడటమే సాక్షమ్ ప్రధాన లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు వివరించారు. సాక్షమ్ వ్యవస్థ ఒక మాడ్యులర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌గా పనిచేస్తుంది. ఇది శత్రు డ్రోన్లను సరైన సమయంలో గుర్తించడం, ట్రాక్ చేయడం, వాటిని నిర్వీర్యం చేయడం వంటి పనులను చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ, ముప్పును ముందుగానే పసిగట్టి కమాండర్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుంది. సెన్సార్లు, సాఫ్ట్‌కిల్, హార్డ్‌కిల్ ఆయుధ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, గగనతలంలో పూర్తి స్థాయి భద్రతను అందిస్తుంది. రష్యాఉక్రెయిన్, ఇజ్రాయెల్ పాలస్తీనా వంటి ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల పాత్ర పెరిగిన తరుణంలో, భారత సైన్యం ఈ వ్యవస్థను సమకూర్చుకోవడం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# చైనాలో 5.4 తీవ్రతతో భూకంపం

## భూటాన్‌లోనూ ప్రకంపనలు



**బీజింగ్, అక్టోబరు 9:** చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో గురువారం తీవ్ర భూకంపం సంభవించింది. అయితే 5.4 తీవ్రతతో సంభవించిన భూకంపం ప్రాంతం పశ్చిమంలోని ఎత్తయిన ప్రాంతాల్లో ఒకటైన గాంజి అని చైనా భూకంప నెట్‌వర్క్ కేంద్రం తెలిపింది. ఈ భూకంపం దాటికి పొరుగున ఉన్న భూటాన్‌లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. భూకంప కేంద్రం గాంజి ప్రాంతంలో పది కిలోమీటర్ల అడుగు ఉందని తెలిపింది. గాంజి ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. అయినప్పటికీ ఈ భూకంపం ధాటికి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రాంతానికి దక్షిణ సరిహద్దులో యున్నాన్, పశ్చిమాన టిబెట్ ఉంది. ఎత్తయిన పర్వతాలతో నిండి కఠిన పరిస్థితులుండే గాంజి ప్రాంతమంటే పర్వతారోహకులకు, ప్రకృతి అన్వేషకులకు చాలా పరిచయమే. అయితే గత ఐదేళ్ల కాలంలో చైనాలో సంభవించిన భూకంపాల తీవ్రతల్లో గురువారం నాటి భూకంపం తీవ్రత ఎక్కువని చైనా భూకంప నెట్‌వర్క్ కేంద్రం వివరించింది.

# చెప్ప విసిరిన లాయర్‌కు సుప్రీంకోర్టులో నోఎంట్రీ!

## కోర్టు బార్ అసోసియేషన్ నిర్ణయం



**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** సుప్రీంకోరు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ పై ఓ న్యాయ వాది చెప్పుతో దాడి చేసేందుకు యత్నించిన ఘటన దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనను పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇక సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ని సస్పెండ్ చేస్తున్నట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో న్యాయవాది రాకేష్ కిశోర్‌కు సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ షాక్ ఇచ్చింది. రాకేష్ సభ్యత్వాన్ని రద్దు చేయడంతోపాటూ సుప్రీంకోర్టు పాంగణం లోకి ప్రవేశించకుండా ఆయన ఎంట్రీ కార్డును రద్దు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్ట్ బార్ అసోసియేషన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. సీజేఐపై న్యాయవాది రాకేష్ కిశోర్ చేసిన దాడి స్వతంత్ర న్యాయవ్యవస్థపై పవిత్రమైన కోర్టు గది కార్యకలాపాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. ఈనెల 6వ తేదీన ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా సీజేఐ జస్టిస్ గవాయ్‌పై ఓ న్యాయవాది బూట్ విసిరేందుకు ప్రయత్నించాడు. లాయర్లు కేసుల గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. న్యాయవాది రాకేష్ కిశోర్ వేదిక వద్దకు వెళ్లి తన బూట్‌ను తీసి సీజేఐపైకి విసిరేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అడ్డుకొని అక్కడి నుంచి తరలించారు. ఈ సమయంలో అతడు 'సనాతన ధర్మానికి అవమానాన్ని సహించం' అని గట్టిగా అరిచారు. అయితే దీనిపై సీజేఐ గవాయ్ చలించకుండా వాదనలు కొనసాగించాలని న్యాయవాదులను కోరారు. 'ఇలాంటి వాటితో కలవరపడకండి. మేం కలవరపడలేదు. ఇలాంటివి నన్ను ప్రభావితం చేయవు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై కోర్ట్ భద్రతా యూనిట్ విచారణ ప్రారంభించింది.

# భారత్ అభివృద్ధిపై యుకె పిఎం కీర్ స్టార్మర్ ప్రశంసలు

## డొనాల్డ్ ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు కౌంటర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** 'భారత్‌ది డెడ్ ఎకానమీ..' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు యుకె ప్రధాని కీర్ స్టార్మర్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న యుకె ప్రధాని.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందంటూ ప్రశంసలు కురిపించారు. యుకె ప్రధాని కీర్ స్టార్మర్ భారత్ పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. '2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు గానూ ప్రధాని మోడీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# కోల్డ్రిఫ్ కంపెనీ యజమాని చెన్నైలో అరెస్టు



**చెన్నై,అక్టోబరు 9:** దగ్గు మందు అంటే భయపడేలా చేసిన కోల్డ్రిఫ్ కాఫ్ సిరప్‌ను తయారు చేస్తున్న కంపెనీ యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని చెన్నైలో శ్రేసన్ ఫార్మాస్యూటికల్స్ ఓనర్ రంగనాథన్‌ను మధ్యప్రదేశ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సిరప్ కారణంగా రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇప్పటివరకు 20 మంది చిన్నారులు మరణించారు. చిన్నారుల మరణాలు, అస్వస్థత నేపథ్యంలో కాంచీపురంలో ఉన్న స్రేసన్ ఫార్మాస్యూటికల్స్‌లో ఈనెల 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ యూనిట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్డ్రిఫ్ సిరప్ తయారీ యూనిట్‌లో గ్యాస్ స్టవ్‌లపైనే రసాయనాలను వేడిచేయడం, తుప్పు పట్టిన పరికరాలు, మురికి పట్టిన పైపులు, గ్లౌజులు, మాస్కులు లేకుండా సిబ్బంది పదార్థాలను మిక్స్ చేయడం వంటివి అధికారులు గమనించారు. అక్కడున్న కార్మికుల్లో దాదాపుగా అనుభవం లేనివారేనని, స్వచ్ఛత పరీక్షలు జరుపకుండానే సిరప్‌ల కోసం నీటిని ఉపయోగిస్తున్నారని తేలింది. ఎయిర్ ఫిల్టర్లు, హెచ్‌ఈపీఏ వ్యవస్థలు లేకపోవడం వంటివి గుర్తించారు.

# అజర్‌బైజాన్ విమానంపై రష్యా క్షిపణుల మిస్‌ఫైర్

## ఉక్రెయిన్‌డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో ప్రమాదం

**మాస్కో, అక్టోబరు 9:** అజర్‌బైజాన్ విమానం కూల్చివేతలో రష్యా ప్రమేయం అనుకోకుండా జరిగిందని, అయితే తాము నేరుగా దాడులకు దిగలేదని, ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్లను మట్టుబెట్టే క్రమంలో తాము ప్రయోగించిన క్షిపణి శకలాలు తగలడం వల్లనే అజర్‌బైజాన్ విమాన ప్రమాదం జరిగిందని మాస్కో అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ పేర్కొన్నారు అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్ విమానం 8243కు క్షిపణి శకలాలు తలడంతో కూలిందని, ఉక్రెయిన్ మూడు డ్రోన్లు తమ సరిహద్దును దాటి రావడంతో వాటిని ట్రాక్‌చేసే క్రమంలో ఈ విమానం ప్రమాదానికి లోనయిందని పుతిన్ అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హాం హైదర్ ఓగ్లు అలియేవ్‌కు స్పష్టంచేసారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ఉక్రెయిన్‌డ్రోన్‌పైచేసిన ప్రయోగం మిస్‌ఫైర్ అయిందన్నారు. రెండు క్షిపణులు ఈ ప్యాసింజర్ విమానానికి 33 అడుగుల దూరంలోనే పేలాయి. ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత తీసుకుని సంపూర్ణపరిహారం చెల్లిస్తామని రష్యా ప్రకటించింది.

# నాభర్త మృతి కారకులపై ఎఫ్‌ఐఆర్ నమోదుచేయాలి

## ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనికి ఐపిఎస్ భార్య లేఖ



**హర్యానా, అక్టోబర్ 09:** తన భర్త మృతికి బాధ్యులైన వారిపై వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయ్యాలని ప్రభుత్వాన్ని ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ భార్య అమినిత్ పి కుమార్ డిమాండ్ చేశారు. ఆ క్రమంలో హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ కుమార్ సింగ్ సైనీకి ఆమె గురువారం లేఖ రాశారు. సదరు ఉన్నతాధికారులపై సస్పెన్షన్ వేటు వేయాలంటూ ఆ లేఖలో సీఎం సైనీకి ఆమె విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఈ కేసు దర్యాప్తులో వారు జోక్యం చేసుకుంటారని సందేహం వ్యక్తం చేశారు. అలాగే సాక్ష్యాధారాలను వారు తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఈ కేసు దర్యాప్తుపై వీరు ప్రభావితం చేస్తారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. వారి నుంచి తమ కుటుంబానికి ముప్పు పొంచి ఉందని ఆందోళన చెందారు. వారి నుంచి తమకు బెదిరింపులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆ లేఖలో ఆమె స్పష్టం చేశారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని సీఎం సైనీని ఆమె కోరారు. తన భర్త మరణించి రోజులు గడుస్తున్నా.. నేటికి ఆయనను వేధించి, అవమానించి, మానసిక హింసకు గురి చేసిన వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని విచారం వ్యక్తం చేశారు. అదీకాక తన భర్త మృతికి కారకులైన అధికారులంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఈ సందర్భంగా ఆమె ఆ లేఖలో వివరించారు. ఈ ఉన్నత స్థాయి శక్తివంతమైన ఈ అధికారులు తనతోపాటు తన కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో శాఖ పరంగా లేకుంటే ఇతరత్రా తనను ఇరికించే ప్రయత్నాలు చేయవచ్చని ఈ సందర్భంగా ఆమె భయాందోళన చెందారు. తన భర్త ఆత్మహత్య గురించి తెలిసిన వెంటనేతన కుమార్తెను భర్త ఉన్న ప్రదేశానికి పంపానని ఆ లేఖలో చెప్పారు. ఆ సమయానికి తన భర్త ఇంటి బేస్‌మెంట్‌లో విగత జీవిగా పడి ఉన్నారని తన కుమార్తె వివరించిందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ హర్యానా కేడర్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య అమినిత్ పి కుమార్ సైతం అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా పని చేస్తున్నారు. అయితే పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో.. అమినిత్ పి కుమార్ జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ బృందం జపాన్‌లో పర్యటిస్తుంది. ఆ బృందంలో ఆమె సైతం ఉన్నారు. హర్యానా పోలీస్ శాఖలో పూరన్ వై కుమార్ తీవ్ర కుల వివక్షకు గురైనట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో బుధవారం తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుచుకుని ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. పూరన్ వై కుమార్ హర్యానాలో అడిషనల్ డీజీపీగా విధులు నిర్వహిస్తున్నారు.

# శాంతి ప్రణాళికపై ఇజ్రాయెల్-హమాస్ సంతకాలు

## నెతన్యాహు బలమైన నాయకత్వానికి ప్రతిబింబం: మోడీ పోస్ట్



**జెరూసలేం, అక్టోబరు 9:** గత రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ముగింపునకు కీలక ముందడుగు పడింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. శాంతి ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారని ఈ సందర్భంగా ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుందని ట్రంప్ ప్రకటించారు. ఈ చరిత్రాత్మక, అపూర్వ సంఘటన జరగడానికి యుఎస్‌తోపాటు కలిసి పనిచేసిన మధ్యవర్తులు ఖతార్, ఈజిప్ట్, తుర్కియేకు ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. గాజాలో యుద్ధం ముగింపునకు డొనాల్డ్ ట్రంప్ 20 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఫార్ములాను భారత్ సహా పలు దేశాలు స్వాగతించాయి. ట్రంప్ ఫార్ములాకు ఇజ్రాయెల్, హమాస్ కూడా అంగీకారం తెలిపాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగు పడింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ ఒప్పందం యుద్ధంతో దెబ్బతిన్న గాజా ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రణాళికలోని మొదటి దవ ఒప్పందాన్ని మేము స్వాగతిస్తున్నాం.

# సంక్షిప్తంగా..

## విజయ్ ఇంటికి మరోసారి బాంబు బెదరింపు



**చెన్నై, అక్టోబరు 9:** ప్రముఖ తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. భవిష్యత్తులో బహిరంగ సభలు నిర్వహిస్తే ఆయన ఇంటికి బాంబు పెడతామని ఓ ఆగంతుకుడు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నీలాంగరైలోని విజయ్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం కన్యాకుమారి నుంచి ఓ వ్యక్తి అత్యవసర నంబర్ 100కు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. కరూర్‌లో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించిన నేపథ్యంలో ఈ బెదిరింపు.

## రేసింగ్‌లో ప్రమాదం: నుజ్జునుజ్జయిన పోర్షేకారు



**ముంబయి, అక్టోబరు 9:** ముంబై మహానగరంలో లగ్జరీ కార్ల రేసింగ్ బీభత్సం సృష్టించింది. అత్యంత వేగంతో దూసుకెళ్లిన ఓ పోర్షే కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవేపై జోగేశ్వరి మెట్రో స్టేషన్ సమీపంలో గత అర్ధరాత్రి సుమారు 2 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ పోర్షే కారు, మరో బీఎండబ్ల్యూ కారు హైవేపై రేసింగ్‌కు దిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. గంటకు సుమారు 150 కిలోమీటర్ల వేగంతో ఈ రెండు కార్లు పోటీ పడుతుండగా, ఉన్నట్టుండి పోర్షే కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు నేరుగా వెళ్లి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆ లగ్జరీ కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రెండు కార్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతూ వేగంగా వెళ్లాయి.


## అఫ్గాన్ విదేశాంగ మంత్రికి ఘనస్వాగతం

**న్యూఢిల్లీ, అక్టోబరు 9:** ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ అధికారిక పర్యటన కోసం గురువారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాలు, పలు ప్రాంతీయ అంశాలపై చర్చించేందుకు ఆయన వారం రోజుల పాటు భారతదేశంలో పర్యటించనున్నారు. ఢిల్లీకి చేరుకున్న ముత్తఖీకి భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వాగతం పలికింది. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై జరగనున్న చర్చల కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొంది. ఈ పర్యటనలో భాగంగా ఆమిర్ ఖాన్ ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఈ పర్యటన కొన్ని వారాల క్రితమే జరగాల్సి ఉన్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్‌ఎస్‌సీ) విధించిన ప్రయాణ నిషేధం నుంచి మినహాయింపు లభించకపోవడంతో వాయిదా పడింది.

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు: కర్ణాటక కేబినెట్ నిర్ణయం

**బెంగళూరు, అక్టోబర్ 9:** మహిళా ఉద్యోగుల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒకరోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటి కంపెనీలు, ఇతర ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం. నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవును ఇవ్వాలనుకున్నాం అని న్యాయశాఖ మంత్రి హెచ్ కె పాటిల్ వెల్లడించారు.

## 51 మందితో పికె తొలి జాబితా



**పాట్నా, అక్టోబరు 9:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో జన్ సురాజ్ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. 51 మంది అభ్యర్థులతో పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ గురువారంనాడు తొలి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో వైద్యులు, మాజీ పోలీస్ అధికారులు, విద్యావేత్తల పేర్లున్నాయి. 1989లో భాగల్పూర్ అల్లర్లను నియంత్రించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌కె మిశ్రా 'దర్భంగా' నుంచి పోటీ చేయనున్నారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు కెసి సిన్హా 'కుమ్రార్' నుంచి. వీరితోపాటు వైద్య నిపుణుడు డాక్టర్ అమిత్ కుమార్ దాస్, పాట్నా హైకోర్టు సీనియర్ న్యాయవాది వైబి గిరి, మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ మనవరాలు జాగృతి ఠాకూర్, మాజీ ఐపీఎస్ అధికారి జైప్రకాష్ సింగ్, సామాజిక కార్యకర్త ప్రీతి కిన్నార్ పోటీచేయనున్నారు.

వార్త, ఖమ్మం, శుక్రవారం 10, అక్టోబరు 2025

# రాష్ట్రంలో ఖనిజాల నిక్షేపాలు

**ఐదు జిల్లాల్లో గ్రానైట్, సున్నపురాయి తవ్వకాల కోసం సర్కార్‌కు ప్రతిపాదనలు**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఇసుకతో పాటు, ఇతర మినరల్స్ తవ్వకాలను చేపట్టేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఖనిజ అభివృద్ధి సంస్థ ప్రస్తుతం ఒక్క ఇసుక విక్రయాలు మాత్రమే నిర్వహిస్తుండా, మిగిలిన ఖనిజాలను టెండర్ల పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు కేటాయింపులు చేస్తోంది. అయితే అనుమతి పొంది సంబంధిత ఖనిజ తవ్వకాలను చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్నట్లు సంస్థ గుర్తించింది. దీంతో ఇసుకతో పాటు, ఇతర ఖనిజాలను కూడా సంస్థ ద్వారా చేపట్టాలని నిర్ణయించింది.

ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఖనిజ అభివృద్ధి సంస్థ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఇసుకతో పాటు, డోలమైట్, గ్రానైట్, సున్నపురాయి, మార్బుల్, మైకా తదితర ఖనిజాల నిల్వలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినట్లయితే వీటన్నింటినీ ఇక నుండి సొంతంగానే తవ్వకాలు జరిపాలని అధికారులు నిర్ణయించారు. కాగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీగా గ్రానైట్, సున్నపురాయి నిల్వలు ఉన్నట్లు బయటపడింది. ఈ మేరకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల్లో రాష్ట్రంలోని 5 జిల్లాల్లో గ్రానైట్, సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రధానంగా కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ నిల్వలు భారీగా ఉన్నట్లు తేల్చింది. కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, ఖమ్మం జిల్లాలో కొత్తగట్టు, నమిలికొండ, వెంతడుప, తాళ్లపూసపల్లె తదితర ప్రాంతాల్లో 83.25 హెక్టార్ల విస్తీర్ణంలో 28,400 క్యూబిక్ మీటర్లలో తెలుపు, బ్రౌన్, నలుపు రకాలకు చెందిన గ్రానైట్ నిల్వలు ఉన్నాయి.

అదేవిధంగా నల్లగొండ, సూర్యాబాద్, వికారాబాద్ జిల్లాల్లో సున్నపు రాయి నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఆయా జిల్లాల్లోని సూర్యాపేట్ జిల్లాలోని మేళ్లచెర్వు, మఠంపల్లి, రఘునాధపాలెం, రామాపురం, దొండపాడు, నల్లగొండ జిల్లా తామరచెర్ల, వికారాబాద్ జిల్లా మల్కాపూర్, జివాంగి ప్రాంతాల్లో 276.83 కిలోమీటర్ల విస్తీర్ణంలో సున్నపు రాయి నిల్వలు ఉన్నట్లు గుర్తించింది.

ఈ మేరకు వీటికి సంబంధించిన తాజాగా నివేదికను ఖనిజాభివృద్ధి సంస్థ ప్రభుత్వానికి సమర్పించింది. ఇదే సమయంలో ఈ నిక్షేపాలను తవ్వేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

## తెలంగాణకు మినరల్ రీసెర్చ్ సెంటర్లు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తెలంగాణకు కీలకమైన ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఇండియాలోనే అత్యవసరంగా కావాల్సి న కీలక ఖనిజాలపై జరగనున్న ఏడు రీసెర్చ్ సెంటర్లను కేంద్ర ఏర్పాటు చేస్తోంది. వాటిల్లో రెండు రీసెర్చ్ సెంటర్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని కీలకమైన నిర్ణయాన్ని కేంద్రం తీసుకుంది. ఈ రెంటిలో ఒకటి ఐఐటి హైదరాబాద్ కాగా, మరొకటి రాష్ట్రంలోని హకీంపేట్‌లో గల నాన్స్ ఫామ్స్ టెక్నాలజీ డెవెలప్‌మెంట్ సెంటర్ (ఎన్ఎఫ్‌టిడిసి)లో క్రిటికల్ మినరల్ రీసెర్చ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇప్పుడున్న టెక్నాలజీతో పాటు, ఫ్యూచర్‌కి కావాల్సి న ఎనర్జీ, బ్యాటరీలు, స్పేస్ లాంచ్‌లు, డిఫెన్స్ టెక్నాలజీ ఇవన్నీ ఓ ప్రత్యేకమైన మినరల్స్ మీదే ఆధారపడి ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ఏర్పాటు చేసింది. ఈ మిషన్ కింద రూ16,300 కోట్లు బడ్జెట్ కేటాయింపులు జరిపింది. ఇవే కాకుండా మరో రూ.18 వేల కోట్లు పీఎస్‌యూల నుంచి తీసుకోనుంది. మొత్తం దేశాన్ని కవర్ చేసేందుకు ఏడేళ్ల ప్లానింగ్ రెడీగా ఉంది. ఈ ప్లాన్‌లో భాగంగానే దేశవ్యాప్తంగా 7 సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తోంది. ఐఐటీలు, సైన్స్ ఇన్‌స్టిట్యూట్లతో కలిసి హార్డ్‌కోర్ సీసెర్చ్ చేయనుంది. దేశ భద్రత, ఎనర్జీ భద్రత, స్పేస్ రంగాలు వంటి మల్టీ బిలియన్ డాలర్ టెక్ రంగాల్లో ముందుకు వెళ్లాలంటే, ఈ రిసెర్చ్ సెంటర్లు ఎంత అవసరమనే ప్రధాన లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తోంది.

## భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ



రజతోత్సవాల ప్రత్యేక సంచికను విడుదల చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (సికిందరాబాద్), అక్టోబరు 9, ప్రభాతవార్త:** భారతీయుల జీవన ప్రమాణాలు, సనాతన ధర్మం, సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, అవి మన వేదవిజ్ఞానంతో ముడిపడి ఉన్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మన ప్రాచీన సంస్కృతి, అసలైన దేశ చరిత్ర నేటితరం తెలుసుకోవాలని ఆయన సూచించారు. పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న జనార్ధనానంద సరస్వతి స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వేదవిద్వాన్ మహాసభల నిర్వా హకులను ఆయన అభినందించారు. రజతోత్సవాల ప్రత్యేక సంచికను ఆయన విడుదల చేశారు. శ్రీస్కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం చైర్మన్ ఎల్వీ సుబ్రమణ్యం, జనార్ధనానంద సరస్వతిస్వామి సంస్కృతి ట్రస్ట్ చైర్మన్ తూములూరి సాయి నాథశర్మ, కార్యదర్శి బ్రహ్మానందశర్మ, చింతపల్లి సుబ్ర మణ్యం, ఎన్వీ శ్రావణ్ పాటు పలువురు ప్రముఖులు, వేదపండితులు పెద్దఎత్తున హాజరయ్యారు.

## బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యానికి కేంద్రంలోని బిజెపిదే బాధ్యత

**సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీలు**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టులో స్టే రావడం తీవ్ర నిరాశకు గురి చేసిందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బిసిలకు పెంచిన రిజర్వేషన్ జాప్యం జరగడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. శాసనసభలో బిజెపి సహా అన్ని పక్షాలు రెండు సార్లు బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించాయని, దాంతో పాటు రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. ఈ మూడింటిని రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వద్దకు పంపినప్పటికీ, వాటిని గవర్నర్ కేంద్రానికి పంపగా, అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని కూనంనేని మండిపడ్డారు. కేంద్రం వద్ద శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి పెండింగ్ ఉన్నందునే.. గురువారం స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందన్నారు. దీనికి పూర్తి బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదేనని అన్నారు. తక్షణమే శాసనసభ ఆమోదించిన స్థానిక సంస్థలు, ఉద్యోగ, విద్య రంగాలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పన బిల్లులను ఆమోదిస్తే, ఎలాంటి ఆటంకాలు లేకుండా పెంచిన రిజర్వేషన్ ఎన్నికలు యథావిధిగా నిర్వహించవచ్చన్నారు. ఇందుకోసం బిజెపి రాష్ట్ర నాయకులు ఇప్పటికైనా చొరవ చూపాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జిఒ 9పై వేసిన రిట్ పిటిషన్ కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో దాఖలైన కేసుల్లో సిపిఐ తరుపున ఇంప్లీడ్ అయ్యామని, హైకోర్టు తాజా స్టే నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ కార్యాచరణ చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై స్టే రావడం, బిసిలకు పెంచిన రిజర్వేషన్ అమలు జరపకుండా జాప్యం కావడానికి కేంద్రంలోనీ బిజెపి ప్రభుత్వం ప్రధాన కారణమని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. బిసిలకు బిజెపి ద్రోహం చేసిందన్నారు. ఇప్పటికే శాసనసభలో బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచే బిల్లులను అన్ని పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిందని, అలాగే రిజర్వేషన్ పెంచుతూ జారీ చేసిన ఆర్డినెన్స్ కూడా ఉందన్నారు. కేంద్రం వద్ద శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు నెలలు తరబడి పెండింగ్ ఉన్నందునే స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించడానికి కారణమైందని సత్యం విమర్శించారు.

**బిసి వ్యతిరేక బిజెపిని గద్దె దింపాలి: సిపిఎం**

రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలుకు వ్యతిరేకంగా ఉన్న బిజెపిని గద్దె దింపాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద గురువారం హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచి పోయాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడానడరు. ఇందుకు ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని.. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు, మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధమైన చర్యలన్నీ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టేను నిరసిస్తూ ..**

# నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

**బిసి, కుల సంఘాలు, అఖిలపక్షాలతో నేడు భేటీ**

**అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: జాజుల**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లపై హైకోర్టు విధించిన స్టేను నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బిసి రిజర్వేషన్లు చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావని బిసి రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. ఒక పార్టీ మీద ఇంకొక పార్టీ నేపం నెట్టడమే తప్ప బిసిలకు నిజమైన మద్దతు ఇవ్వడం లేదన్నారు. శుక్రవారం హైదరాబాదులో బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులతోపాటు అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హైకోర్టు తీర్పు అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. చట్టబద్ధంగా పెంచిన బిసి రిజర్వేషన్ల జీవోపై రాష్ట్ర హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బిసి సంక్షేమ సంఘం తీవ్రంగా నిరసిస్తుందని, ఇది బిసి వ్యతిరేక చర్యగా భావిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కింది నుంచి పై కోర్టుల వరకు బిసి రిజర్వేషన్లు పెంచిన ప్రతిసారి కోర్టులను వేదికగా చేసుకుని రిజర్వేషన్ వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. కోర్టులు కూడా బిసిలకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నేడు రాష్ట్రంలో ఎక్కడికక్కడ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి బిసిలు తమ నిరసనను వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. బిసి రిజర్వేషన్ల చట్టాన్ని రాష్ట్ర గవర్నర్ ఆమోదించి ఉంటే రాష్ట్ర హైకోర్టులో రిజర్వేషన్లపై స్టే వచ్చే అవకాశం లేదన్నారు.

గవర్నర్ ఆమోదం కనుక ఉంటే రాష్ట్ర హైకోర్టులో స్టే వచ్చేది కాదన్నారు. బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్ధతి దక్కడానికి మొదటి నుండి బిసి సమాజమంతా 9వ షెడ్యూల్లో చేర్చాలని, కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ బిజెపి నేతలు బిసి రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉందని పదేపదే బిసి సమాజాన్ని తప్పుదోవ పట్టించారని గుర్తు చేశారు. బిజెపి నేతలు రాష్ట్ర గవర్నర్ను కలిసి ఉంటే గవర్నర్ సానుకూల నిర్ణయం తీసుకునే వారనీ.. కానీ బిజెపి ఇదేమి చేయకుండా బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని అనడం సిగ్గుచేటన్నారు. నేడు హైదరాబాదులో అన్ని బిసి సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, అఖిలపక్ష రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

సమావేశంలో బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, దాసు సురేష్, విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కురుమ, మనీ మంజరి, నరేష్ ప్రజాపతి, నరసింహా నాయక్, జాజుల లింగం, శేఖర్ సగర, గొడుగు మహేష్ యాదవ్ ఈడిగ శ్రీనివాస్ గౌడ్, మాదేశి రాజేందర్, కవుల జగన్నాథ పానుగంటి విజయ్, వరికుప్పల మధు, మల్లికార్జున యాదవ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు

**వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు పండించిన మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం ఒక ప్రకటనలో రాష్ట్రంలో 6,24,544 ఎకరాల్లో మొక్కజొన్న సాగు అయిందని, సగటున ఎకరాకు 18.50 క్వింటాల్ దిగుబడి వచ్చి, మొత్తం 11.56 లక్షల టన్నుల దిగుబడి అవుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఇందులో 8.66 లక్షల టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేయాల్సి ఉంటుం దని అంచనా వేశామన్నారు. ఇందుకు గాను ప్రభుత్వంపై 2,400 కోట్ల రూపాయల భారం పడుతుందని వెల్లడించారు. గత నెల 3 వ వారం నుండే మార్కెట్లోకి భారీగా మొక్కజొన్న పంట రావడం వలన ధరలు తగ్గిపోయాయని వివరించారు. ప్రస్తుత మార్కెట్ ధరలు మద్దతు ధర క్వింటాలుకు 2,400 రూపాయలు ఉండగా, దానికన్నా 441 రూపాయలు తక్కువగా ఉందని చెప్పారు. దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. రైతులు మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, మద్దతు ధర పొందవలసిందిగా సూచించారు. తక్కువ ధరలకు ప్రైవేట్‌లో కాకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని కోరారు. గతేడాది కేంద్రం మద్దతు ధరకు సేకరించనప్పటికి రాష్ట్ర ప్రభుత్వమే దాదాపు 535 కోట్లు రూపాయలు ఖర్చు పెట్టి జొన్న పంటను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిందన్నారు. అదేవిధంగా పెసర, మినుము, సోయాచిక్కుడు, కంది, వేరుశనగ లాంటి పంటలపై కేంద్రం 25 శాతం సీలింగ్ విధించిందని ఇది రైతులకు అడ్డంకిగా మారు తుందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

## నార్త్ అమెరికాలో సిపిఎ కాన్ఫరెన్స్‌కు మండలి చైర్మన్ గుత్తా, స్పీకర్ ప్రసాద్ హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 9:** నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశ రాజధాని బ్రిడ్జిటౌన్ లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసి యేషన్ (సిపిఎ) కాన్ఫరెన్స్‌లో గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లేజిస్లేచర్ సెక్రటరీ డా. వి.నరసింహా చార్యులు, అధికారులు పాల్గొన్నారు.

మొదటిరోజు జరిగిన రిజిస్ట్రేషన్, పరిచయ కార్యక్రమాలలో భారతదేశ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, రాష్ట్రాల స్పీకర్లు, చైర్మన్లతో కలిసి తెలంగాణ శాసన మండలి బృందం పాల్గొన్నది.



## మైక్రో ఇరిగేషన్‌కు సబ్సిడీ

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సబ్సిడీ ఇవ్వడంతో పాటు జీఎస్టీ తగ్గింపు నిర్ణయాలతో తెలంగాణలో రైతులకు మైక్రో ఇరిగేషన్ పథకాలు అందుబాటులోకి వస్తున్నాయి. డ్రిప్ పరికరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతర పేద రైతులకు 80 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది. ప్రధానంగా ఏడేండ్లుగా నిలిచిపోయిన మైక్రో ఇరిగేషన్ పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర సర్కార్ చర్యలు చేపట్టింది. మైక్రో ఇరిగేషన్ నిమిత్తం రాష్ట్రం తన వంతు వాటాను గత బడ్జెట్లో కేటాయించింది. నాబార్డు రుణ సాయం కూడా అందుబాటులోకి రానుంది. ఇరిగేషన్ మేనేజ్మెంట్ ట్రాన్స్ఫర్ (ఐఎంటీ) సొసైటీలు, ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్పీఓ), ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) సహకారంతో ఈ పథకాన్ని నిర్వహించనున్నారు. ఈ పథకాలకు ఐదేండ్ల పాటు ప్రభుత్వం సాయం అందించడంతో పాటు, పైప్‌లైన్ ఏర్పాటుకు 60 శాతం సబ్సిడీ ఇవ్వనుంది.

ముఖ్యంగా మెట్ట ప్రాంతాలు, నీటి కొరత ఉన్న మండలాల్లో డ్రిప్ వ్యవస్థే రైతులకు ప్రయోజనకారిగా ఉంటుందని. డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థతో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించొచ్చు. చెరుకు, పత్తి, మిరప, పొగాకు, కూరగాయలు, పూలతోటలు, ఆయిల్పామ్ వంటి పంటలకు డ్రిప్ ఇరిగేషన్ అనుకూలంగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఆర్‌టిఐని యువత ఆయుధంగా గుర్తించాలి

**చట్టాలపై అవగాహనతో సామాజిక మార్పు**

**సదస్సులో ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టా(ఆర్‌టిఐ)ని యువత ఆయుధంగా గుర్తించాలని, చట్టాలపై అవగాహనతో సామాజిక మార్పు వస్తుందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న ఆర్‌టిఐ అవగాహన వారంలో భాగంగా గురువారం హోలీమేరి కాలేజీలో నిర్వహించిన ఆర్టీఐ సదస్సులో మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే యువత అకడమిక్ ర్యాంకుల కోసమే కాకుండా, సామాజిక స్పృహకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరిగే పరిణామాలపై స్పందించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అందులో భాగంగా సమాచార హక్కు చట్టం వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు.

యువత భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న భారత్‌లో వజ్రాయుధంలా ప్రజల ముందుకొచ్చిన సమాచార హక్కు చట్టంపై విద్యార్థులు అవగాహన పొందాలన్నారు. ఈ తరహా చైతన్యం యువత పొందడం వల్లే 135 దేశాల్లో ఆర్‌టిఐ యాక్ట్ బలోపేతమైందన్నారు. ఎన్జీవోలు, పౌర సమాజం పోరాటాల ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఈ చట్టాన్ని యువత భాగస్వామ్యంతోనే మరింత ముందుకు తీసుకెళ్ళొచ్చన్నారు. ఆర్‌టిఐపై విద్యార్థులు గ్రామీణ స్థాయిలో నిరక్షరాస్యులను మేల్కొల్పాలని బాలకిష్టారెడ్డి సూచించారు. కాలేజీ ఫౌండర్ ఛైర్మన్ అరమంద వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిఐపై అవగాహన పొందడం అంటే చట్టాలపై అధిపత్యం సాధించడమేనన్నారు. కాలేజీ విద్యార్థులకు ఈ చట్టంపై ఆసక్తి పెరిగేలా చేస్తామన్నారు.

ఆర్‌టిఐలోని సెక్షన్లన్నీ విద్యార్థులు ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా దీన్ని వ్యాప్తి చేయాలని కాలేజీ ఛైర్మన్ డాక్టర్ అరిమంద సిద్దార్థరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ డాక్టర్ అరిమంద విజయశారద రెడ్డి, డాక్టర్ రవితేజ, ప్రిన్సిపల్, జెవివి సుబ్రహ్మణ్యంతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసి బాలికల హాస్టల్‌లో ముగ్గురు మిస్సింగ్

**నిజామాబాద్ జిల్లాలో కలకలం**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లాలోని బిసి బాలికల హాస్టల్‌లో ముగ్గురు బాలికలు మిస్సింగ్ అయిన ఘటనతో జిల్లాలో కలకలం రేపుతోంది. కోటగల్లి బాలికల పాఠశాలలో వెనకబడిన తరగతుల వసతి గృహం నుంచి ముగ్గురు బాలికలు తప్పిపోయినట్లు తెలిసింది. రెండవ టౌన్ ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బిసి బాలిక వసతి గృహానికి చెందిన 10వ తరగతికి చెందిన ఇద్దరు, 9వ తరగతికి చెందిన ఓ విద్యార్థిని బుధవారం తెల్లవారుజామున హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని.. కనిపించకుండా పోయారని హాస్టల్ వార్డెన్ రెండవ టౌన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వసతి గృహంలోని సిసి కెమెరాలను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఎస్పీడిసిఎల్ చీఫ్ ఇంజినీర్‌పై సస్పెన్షన్ వేటు

**ప్రధాన కార్యాలయంలో కొందరిదే ఇష్టారాజ్యం**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల్లో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంతో పాటు, సంస్థ సిఎండి ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాము చెప్పిందే వేదం, తమకు నచ్చినవే నిబంధలంటూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారనే అపవాదు ఉంది. ఈ విధంగానే తన సొంత ఎజెండాతో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న చీఫ్ ఇంజనీరుపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రధాన కార్యాలయంలోని ఎనర్జీ ఆడిట్ విభాగంలో పనిచేస్తున్న ఆర్టిజన్‌ను ప్రభుత్వ ఇంధన శాఖకు బదిలీ చేస్తూ ఈ ఏడాది మే 2వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించి ఈ ఉద్యోగిని తక్షణమే రిలీవ్ చేయాల్సిందిగా చీఫ్ ఇంజనీర్ ఎనర్జీ ఆడిట్‌ను ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సదరు ఉద్యోగిని రిలీవ్ చేయాల్సిందిగా గత ఐదు నెలలుగా పలువురు ఉన్నతాధికారులు చీఫ్ ఇంజనీర్ ను మౌఖికంగా పలుమార్లు కోరడం జరిగింది. అయినా ఉత్తర్వులను, ఉన్నతాధికారుల ఆదేశాలను పక్కన పెట్టి బదిలీ చేసిన ఉద్యోగిని రిలీవ్ చేయకుండా తన స్వంత ఎజెండాతో వ్యవహరించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విధుల నిర్వహణ పట్ల నిరక్ష్యం, తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, అవిధేయతకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని సదరు చీఫ్ ఇంజనీర్ (ఎనర్జీ ఆడిట్) పై సస్పెన్షన్ వేటు వేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.




గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

## బిఆర్ఎస్ చలో బస్‌భవన్ హాస్యాస్పదం

**ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** చలో బస్‌భవన్ అంటూ బిఆర్ఎస్ నేతలు హడావిడి చేయడం హాస్యాస్పదమని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఉనికి కోసమే బిఆర్ఎస్ నాయకులు నాటకాలు వేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో బంద్‌లు, ధర్నాలు, నిరసనలపై ఉక్కు పాదం మోపారని, వారికి చలో బస్‌భవన్ అంటూ పిలుపునిచ్చే హక్కు లేదని అన్నారు. ఆర్టీసీ విషయంలో బిఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు, కెసిఆర్ పదేళ్ల కాలంలో ఆర్టీసీని సర్వనాశనం చేశారని ఆరోపించారు. బస్‌భవన్‌కు బయలుదేరే ముందు కెసిఆర్ ముక్కు నేలకు రాసి ఆర్టీసీ సిబ్బంది, కార్మికులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 సమ్మె సమయంలో కెసిఆర్ మొండివైఖరి, నాటి మంత్రుల మూర్ఖపు వాదనలతో ఆర్టీసి డ్రైవర్లు ఆవుల నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీసీ కండక్టర్ సురేందర్‌గౌడ్ ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రాణిగంజ్ డిపోలో కండక్టర్‌గా పనిచేసే సురేందర్‌గౌడ్ 2018లో తన బిడ్డ పెళ్లికి బ్యాంకులోన్ తీసుకున్నారనీ, 2019 సమ్మె సమయంలో సెప్టెంబర్ జీతం ఇవ్వకపోవడంతో ఇఎంఐకు సంబంధించిన చెక్కు బౌన్స్ అవడంతో ఒత్తిడికి గురై సురేందర్‌గౌడ్ ఉరిపెట్టుకొని చనిపోయారని అద్దంకి వివరణ ఇచ్చారు. సమ్మె సమయంలో వరుసగా రెండు నెలలు జీతం ఇవ్వకపోవడంతో మహబూబాబాద్ డిపో పరిధిలో డ్రైవర్ ఆవుల నరేశ్ పురుగుల మందు తాగి చనిపోయారని ఆత్మహత్యల కారాణాలు దయాకర్ ఎకరువుపెట్టి చెప్పారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందించి ఇహెచ్‌ఎస్‌ను అమలు చేయాలి

**సిఎస్‌కు రాష్ట్ర ఉద్యోగుల జెఎసి విజ్ఞప్తి**

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఆరోగ్య పథకం విధివిధానాలను రూపొందించి ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. టిజిఈజేఏసీ నేతలు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణారావుని సచివాలయంలో కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారం గురించి కోరారు. టిజిఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరి జనరల్ ఏలూరి శ్రీనివాసరావుల అధ్వర్యంలో జేఏసీ ప్రతినిధి బృందం సిఎస్‌ని కలసి పలు సమష్కారం కోసం విజ్ఞప్తి చేశారు. అందులో ప్రధానంగా.. ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు రూపొందించి ఈహెచ్‌ఎస్‌ను అమలు చేయల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఒక డి.ఎ.ని విడుదల చేయాలని కోరారు. దాంతోపాటు వెంటనే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను సమావేశపరచి మిగిలిన సమస్యలపైనా చర్చించి వాటిని కూడ పరిష్కరించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమములో జేఏసీ నేతలు దామోదర్ రెడ్డి, వంగ రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సదానంద్ గౌడ్, కటకం రమేష్, ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్లు, బి. శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, దాస్య నాయక్, ప్రేమ్ పాల్గొన్నారు.

## సమాచార హక్కు అవార్డు ఎక్సైజ్ సిబ్బందికి అంకితం : కమిషనర్

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సమాచార హక్కు అవార్డు ఎక్సైజ్ ఉద్యోగులందరికీ అంకితం ఇస్తున్నా అని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి హరికిరణ్ తెలిపారు. సమాచార హక్కు చట్టం 2025లో భాగంగా బెస్ట్ పర్ఫార్మెన్స్ హెడ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కింద ఎక్సైజ్ శాఖకు 2025 సమాచార హక్కు చట్టం అవార్డును గవర్నర్ చేతుల మీదుగా కమిషనర్‌కు అందించారు. వచ్చిన అవార్డును ఎక్సైజ్ శాఖ ఉద్యోగులందరికీ అంకితమిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి కిరణ్ పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ శాఖ నుంచి సమాచార హక్కు కింద.. వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి నందుకు, ఆర్టిఐ చట్టం కింద అడిగిన దరఖాస్తులకు సమాచారం అందించడం వల్ల ఈ అవార్డు ఎక్సైజ్ శాఖ కు వచ్చింది. గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా రవీంద్రభారతిలో గురువారం సాయంత్రం కమిషనర్ సి.హరికిరణ్ అవార్డును అందుకున్నారు.




మాట్లాడుతున్న డిజిపి బి.శివధర్‌రెడ్డి

# న్యాయబద్ధతతోపాటు స్నేహపూర్వకంగా పోలీసింగ్

## తెలంగాణ పోలీసుల ఫిలాసఫీగా ఉండాలి

### ఉన్నతాధికారుల సమావేశంలో డిజిపి బి.శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** సమాజంలో పోలీసులు న్యాయబద్ధంగా ఉండడమే కాకుండా కొన్నిసార్లు కఠినంగా కూడా వ్యవహరించాలి. అంతేకాకుండా స్నేహపూర్వకం ఎంతో అవసరమన్నారు. ఇదే వృత్తిపరమైన పోలీసింగ్ అని రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో అదనపు డిజిపిలు, కమిషనర్లు, జిల్లాల ఎస్పిలు, డిసిపిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ వృత్తిలో నాలుగు సూత్రాలు పాటించాలి. ముఖ్యంగా న్యాయబద్ధమైన పోలిసింగ్ చట్టం ముందు అందరు సమానులేనని గుర్తించుకోవాని తెలిపారు. తారతమ్యాలు లేకుండా చట్టాన్ని అమలు చేసి శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ప్రజల విశ్వాసం, అనుబంధం, సహకారం పెంపొందించుకోవాలని చెప్పారు. బేసిక్ పోలీసింగ్ తెలంగాణ పోలీసు వ్యవస్థకు వెన్నెముకని, బీట్ పహారా, విజిబుల్ పోలీసింగ్, నిఘా, ఇంటెలిజెన్స్ సేకరణ, అత్యవసర స్పందన, నేర నివారణ, శాంతి భద్రతలు కమ్యూనిటి పోలీసింగ్ వంటి అంశాలపై ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సీసీటీవీ, ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్లు, ఫోరెన్సిక్ సాధనాలతో శాస్త్రీయ దర్యాప్తుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలను ఎదుర్కొనేందుకు, ఎన్నికల సన్నద్ధతకు శాఖల మధ్య సహకారం కోసం ఇతర విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. విచారణ, సైబర్ నేరాలు, ఫోరెన్సిక్, సాఫ్ట్ స్కిల్స్‌లో సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రతి సంవత్సరం సుమారు 900 హత్యలు జరుగుతుంటే, దాదాపు 8,000 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించడంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు కఠినమైన నిబంధనల అమలు, రాత్రి పహారా, మద్యం తాగి వాహనం నడిపే వారిపై చర్యలు, అవగాహన కార్యక్రమాలు, జిల్లా రోడ్డు భద్రతా కమిటీలు ఏర్పాటు చేయాడమే కాకుండా మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శివధర్‌రెడ్డి సూచించారు. శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం.మహేశ్ భగవత్ మాట్లాడుతూ రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత కావాలన్నారు.

# ప్రపంచ ఆర్థికవృద్ధికి గ్రోత్‌ఇంజిన్ 'భారత్'

### ఐఎంఎఫ్ ఎండి క్రిస్టలినా జార్జియేవా




**న్యూయార్కు, అక్టోబరు 9:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థికవ్యవస్థ వృద్ధికి కీలక ఇంజిన్‌గా మారిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం స్థిరంగా దూసుకెళుతోందని ఆమె పేర్కొన్నారు. వచ్చే వారం వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జార్జియేవా చేసిన వ్యాఖ్యలుప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వృద్ధి సరళిలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా చైనా వృద్ధి క్రమంగా మందగిస్తుండగా, భారత్ ఒక కీలక వృద్ధి చోదక శక్తిగా అభివృద్ధి చెందుతోందని ఆమె వివరించారు. కరోనాకు ముందు ప్రపంచ వృద్ధి రేటు 3.7 శాతంగా ఉండగా, ప్రస్తుతం మధ్యకాలికంగా అది 3 శాతం వద్దే కొనసాగుతుందని అంచనా వేశారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు అనేక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడ్డాయని చెబుతూనే, ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షలు ఎదురుకాలేదని, కాబట్టి ఇప్పుడే ఊపిరి పీల్చుకోవడం తొందరపాటు అవుతుందని ఆమె హెచ్చరించారు.

ఐఎంఎఫ్ మాత్రమే కాకుండా ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలు కూడా భారత్‌పై సానుకూల దృక్పథంతో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, 2026 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. ఇదే బాటలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ కూడా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి సవరించింది.

గత వారం ఆర్‌బీఐ గవర్నర్ సం జయ్ మల్హోత్రా మాట్లాడుతూ, జీఎస్టీ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు, బలమైన ప్రైవేట్ వినియోగం, స్థిర పెట్టుబడుల కారణంగానే ఈ వృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. 2025-26 మొదటి త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతంమేర బలమైన వృద్ధిని నమోదు చేసిందని గుర్తు చేశారు.

# ఎస్‌ఎల్‌బిసి కాంట్రాక్టు సంస్థ కొనసాగింపుపై అనిశ్చితి

## స్టాండింగ్ కమిటీ ససేమిరా అంటూ సలహా

## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేస్తామంటున్న జెపి అసోసియేట్

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ ను కొనసాగించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం మల్లాగుల్లాలు పడుతోంది. తెలంగాణ రాష్ట్రం నీటిపారుదలశాఖ కు చెందిన స్టేట్ లెవల్ స్టాండింగ్‌కమిటి జయప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్‌తో కాంట్రాక్టు ఒప్పొందం రద్దు చేసుకోవాలని ప్రభుత్వానికి సలహా ఇస్తోంది. ఎస్‌ఎల్‌బిసి సొరంగం నిర్మాణం కోసం చైనా నుంచి ఒక అనుభవం కలిగిన టెండర్ వేసినా ఎందుకో ఏమో దానిని పక్కనబెట్టి 2005 ఆగస్టు 25న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి వైఎస్ పాలనలో జయప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్‌తో కాంట్రాక్టు ఒప్పొందం చేసుకున్నారు. ఆనాటి నుంచి ఎస్‌ఎల్‌బిసి పనులు ప్రహసంగా కొనసాగుతున్నాయి. గత ఫిబ్రవరిలో సొరంగం కుప్పకూలి కారీమకులు మృతిచెందడంతో పనులు నిలిచిపోయాయి. 2028 ఆగస్టు 30 వరకు కాంట్రాక్టు రిన్యూవల్ చేసే విషయంలో ప్రభుత్వం ఆలోచిస్తుంటే, జెపిఎ ఎల్‌తో ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. మరోవైపు జేపీ అసోసియేట్స్ అత్యాధునిక టెక్నాలజీతో పనులు చేస్తామంటున్నా నీటిపారుదలశాఖ ఎస్ ఎల్ ఎస్ సి మాత్రం ససేమిరా అంటోంది. జేపీ అసోసియేట్స్ ఆస్తులతో పోల్చితే అప్పులు మించిపోయి దివాలా తీయడమే దీనికి కారణం. జయప్రకాశ్ అసోసియేట్స్ సంస్థ వ్యాపార దివాలా పరిష్కార ప్రక్రియ ను చేపడుతూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ అలహాబాద్ బెంచ్ 2024 జూన్ 3న ఉత్తర్వులు జారీ చేసింది. దివాలా ప్రక్రియ కాలంలో జేపీ అసోసియేట్స్ కంపెనీ వ్యవహారాల పర్యవేక్షణకు రిజల్యూషన్ ప్రొఫెషనల్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీని ఎన్సీ ఎల్టీ నియమించింది. సొరంగం1 నిర్మాణ విషయంలో కంపెనీ పనితీరుపై ఆర్పీ హామీ ఇవ్వడానికి ఇష్టపడకపోయినా, హామీ ఇచ్చే పరిస్థితిలో లేకున్నా, ఎన్సీ ఎల్టీ అనుమతితో ఒప్పందాన్ని రద్దు చేసుకొని మిగిలిన పనుల పూర్తికి మళ్లీ టెండర్లు నిర్వహించాలని ఇరిగేషన్ డిపార్టుమెంట్ స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. పనితీరుపై ఆర్పీ రాతపూర్వకంగా హామీ ఇస్తే పలు షరతులతో జయ ప్రకాశ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలోనే మిగిలిన పనులు జరిపించాలని మరో ప్రత్యామ్నాయాన్ని ఎస్‌ఎల్‌ఎస్సీ సూచించింది.

సొరంగాల నిర్మాణం పనులను ముందుకు తీసుకెళ్లే అంశంపై నల్లగొండ సిఇ చేసిన పలు ప్రతిపాదనలపై గత నెల 12న నీటిపారుదల శాఖ ఇఎన్‌సి (జనరల్) అధ్యక్షతన సమావేశమైన స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ విస్తృతంగా చర్చించి ఈ మేరకు రెండు ప్రత్యామ్నాయాలను సర్కారుకు సూచించింది. ఒక వేళ ఒప్పందాన్ని రద్దు చేస్తే కొత్త నిర్మాణ సంస్థతో పనులు చేయిస్తే తీవ్ర జాప్యంతోపాటు పెరిగిన మార్కెట్ ధరలకు అనుగుణంగా ఆర్థిక భారం సైతం పడనుందని తేల్చి చెప్పింది. అర్ధంతరంగా నిర్మాణ పనులను చేపట్టే విషయంలో సాంకేతిక సమస్యలూ ఎదురవుతాయని స్పష్టం చేసింది. ఎస్‌ఎల్‌ఎస్ పి సిఫారసులను త్వరలో జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం చర్చించి కీలక నిర్ణయం తీసుకోనుంది.

జెపి అసోసియేట్స్‌నే కూలిపోయిన సొరంగం పనులు కొనసాగిస్తే రెండోసారి సవరించి అంచనాల మేరకు మిగుల పనుల వ్యయం రూ.1157.42 కోట్లకు మించకుండా సీలింగ్ విధించాలని స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసింది. షెడ్యూల్ ప్రకారం రిన్యూవల్ చేసిన పనులను గడువును 2028 జూన్ 30కి పెంచేందుకు మాత్రమే స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటి సమ్మతి తెలిపింది.. సిఇ, రిజాల్యూషన్ ప్రొఫెషనల్ పేరుతో సంయుక్తంగా నిర్వహించే ఎస్క్రో అకౌంట్ బిల్లులు చెల్లించాలని సూచించింది. శ్రీశైలం ఎడమగట్టుకాల్వ ప్రాజెక్టులో భాగంగా రెండు సొరంగాలను తవ్వాల్సి ఉండగా, 7.13 కి.మీ.ల రెండో సొరంగం తవ్వకాలు పూర్తి కాగా, 2.8 కి.మీల మేర లైనింగ్ పనులు జరగాల్సి ఉంది. 43.93 కి.మీ.ల తొలి సొరంగం పనులకుగాను రెండు వైపుల నుంచి మొత్తం 34.38 కి.మీల మేర పనులు పూర్తయ్యాయి. మధ్యలో 9.541 కి.మీ.ల సొరంగం తవ్వకాలు జరగాల్సి ఉంది. రెండోసారి సవరించిన అంచనాల ప్రకారం ఒకటో సొరంగానికి సంబంధించి రూ.1157.42 కోట్లు, రెండో సొరంగానికి సంబంధించి రూ.57.08 కోట్లు విలువైన పనులు జరగాల్సి ఉంది ఇప్పటి వరకు టన్నెల్ బోరింగ్ మెషిన్ల(టీబీఎం)తో సొరంగాల తవ్వకాలు జరగగా, ఇటీవల జరిగిన ప్రమాద నేపథ్యంలో ఇతర అత్యాధునిక పద్ధతుల్లో ఇదే వ్యయంతో పనులు చేసేందుకు జేపీ అసోసియేట్స్ పలు షరతులతో సంసిద్ధత వ్యక్తం చేసింది. 2028 ఆగస్టు 30 వరకు గడువు పొడిగించడంతో పాటు బిల్లుల చెల్లింపు షెడ్యూల్లో మార్పులు చేయాలని, బిల్లులను సమర్పించిన 24 గంటల్లోనే గ్రీన్ చానల్ ద్వారా చెల్లింపులు జరపాలని, రూ.35.14 కోట్ల పెండింగ్ బిల్లులు, రూ.104 కోట్ల విద్యుత్ చార్జీలు చెల్లించాలనే షరతు విధించింది. జయప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో నీటిపారుదలశాఖ నుంచి ఆ సంస్థకు కాంట్రాక్టు కొనసాగించడంపై విముఖత వ్యక్తం అవుతోంది.

# ప్రజాస్వామ్యానికి మూలస్తంభం సమాచార హక్కు చట్టం

## గవర్నరు జిష్ణుదేవ్‌వర్మ

## ఘనంగా రాష్ట్ర సమాచార హక్కు చట్టం 20వ వారోత్సవాలు




రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన తెలంగాణ సమాచార హక్కు చట్టం 20వ వారోత్సవాల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 9, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య సాధానికి సమాచార హక్కు చట్టం మూలస్తంభమని తెలంగాణ రాష్ట్ర గవర్నరు జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆర్టీఐ చట్టం సామాన్య ప్రజలకు సాధికారత కల్పించే ఏకైక సాధనమని, పౌరులు నిరాశావాదంగా కాకుండా ఆశావాదంతో ఎంతో జాగురూకతతో వ్యవహరించాలని హితవు పలికారు. సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వాల పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం రాత్రి తెలంగాణ సమాచార హక్కు చట్టం 20వ వారోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సమాచార హక్కు చట్టం 2005 అక్టోబరు 12న పూర్తిగా అమల్లోకి వచ్చిందని, 20 సంవత్సరాలుగా అమలులో ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ముఖ్య కమిషనర్ డా. జి.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ వారోత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గవర్నరు జిష్ణుదేవ్ వర్మ పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ పాలన గురించిన సంపూర్ణ సమాచారం పొందడం ప్రతీ దేశపౌరుడి ప్రాథమిక హక్కు అని నొక్కివక్కాణించారు. ప్రజాస్వామ్యమంటే పౌరులు ఐదేళ్లకొక్కసారి వేసే ఓటుహక్కు మాత్రమే కాదని, ప్రజాపాలనలో వారు భాగస్వామ్యులైనప్పుడే అర్థవంతమైన ప్రజాస్వామ్యం నెలకొంటుందని స్పష్టం చేశారు. అంతేకాక ఈ చట్టం సామాన్యుడికి సైతం పాలనను ప్రశ్నించే హక్కు ధైర్యమిచ్చిందని అన్నారు. ఆధునిక కాలంలో వివిధ మాధ్యమాల ద్వారా సమాచారం విరివిగా అందుబాటులో ఉందని, అయితే వాస్తవాన్ని తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోపడుతుందని చెప్పారు. సమాచారం పొందే వ్యక్తులు బాధ్యతగా వ్యవహరించాలని గవర్నరు హితవుపలికారు. భారత ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే సమాజంలోని ప్రతీఒక్కరూ భుజం భుజం కలిపి బాధ్యతగా కలిసి పనిచేయడం ద్వారానే సాధ్యమన్నారు. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్ సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ కౌషి మాట్లాడుతూ 2005 నుండి అమలులోకి వచ్చిన ఆర్టీఐ చట్టం నేపథ్యాన్ని సవివరపరిచారు. దీనివల్ల సామాన్య ప్రజలకు ప్రభుత్వ పథకాలు అమలు, అర్హత తదితర మరెన్నో వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుందని అన్నారు. కొందరు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తూ స్వార్థ స్వప్రయోజనాల కోసం వాడుకోవడం దుష్పరిణామన్నారు. ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షోపన్యాసంలో సమాచార కమిషన్లు ఆర్టీఐ చట్టంలో అమలులో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబు దారీతనాన్ని పెంచి ఆచరణాత్మక పాలన అందించడంలో తోడ్పడుతుందని అన్నారు. 2025లో కొత్త సమాచార కమిషనర్లను నియమించిన తర్వాత పరిష్కార రేటు చాలా మెరుగుపడిందని అన్నారు. అప్పీలుదారులు ఇప్పుడు చాలా పేషీలలో నెలలోపు తమ కేసుల పరిష్కారాన్ని ఆశించవచ్చని పేర్కొన్నారు. తాము రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో పర్యటిస్తూ ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గవర్నరు చేతులమీదుగా టిజిఐసి హ్యాండ్‌బుక్, జస్టిస్ పి.శ్యామ్‌కౌషి చేతులమీదుగా న్యూస్‌లెటర్లను ఆవిష్కరింపజేశారు. చివరిగా గవర్నరు చేతులమీదుగా పలువురుకి ఉత్తమ జిల్లా, శాఖలు, హెచ్‌ఓడీలు, పిఐఓ/ఎఫ్‌ఏఏలు, ఆఫీసర్లు, వాలంటీర్ల అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సి.వి.ఆనంద్, బెన్‌హూర్ మహేష్‌దత్ ఎక్కా, డా. సి.సువర్ణ, కె.రామకృష్ణారావు, బి.అయోధ్యరెడ్డి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టి

### జర్మనీ ప్రతినిధులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ రంగం బలోపేతంలో భాగంగా సోలార్ విద్యుత్తు ఉత్పత్తి, వినియోగంపై దృష్టి సారించినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జర్మనీ ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లు, 200 యూనిట్ల వరకు గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఆయా లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ అందించాలని ఆలోచనలో ఉన్నామని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా రైతులు, గృహ జ్యోతి వినియోగదారులకు ప్రతినెలా ఖచ్చితమైన ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలనేది తమ ప్రభుత్వ ఆలోచనగా పేర్కొన్నారు. అనంతరం జర్మన్ ప్రతినిధులు సూచించిన సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలో ఏ విధంగా అనుసంధానం చేసుకోగలమనే దానితో పాటు, తెలంగాణ విద్యుత్ రంగాన్ని ఆర్థికంగా, సాంకేతికంగా బలోపేతం చేసుకోవడానికి ఆ ప్రతిపాదనలు ఏ మేరకు ఉపయోగపడతాయో అనేది పరిశీలన చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే జర్మనీ ప్రతినిధులు తీసుకొచ్చిన ప్రతిపాదనలపై అధ్యయనం చేసి ఓ నివేదిక రూపొందించాలని తెలిపారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం సోలార్ రంగం పై ఆసక్తిగా ఉందని తెలుసుకొని కొన్ని ప్రతిపాదనలతో వచ్చినట్టు జర్మనీ ప్రతినిధులు తెలిపారు. ఈ భేటీలో జర్మన్ ప్రతినిధులు డాక్టర్ సెబాస్టియన్, డాక్టర్ చలిగంటి రఘు, రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, రెడ్కో సిఎండిలు కృష్ణ భాస్కర్, ముషారఫ్ ఫారుఖీ, అనిలా, తదితరులు పాల్గొన్నారు.



# బిసి రిజర్వేషన్లపై హైకోర్టు స్టే .. కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష్య ఫలితమే

## వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జిఓ నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో బిసి రిజర్వేషన్లపై స్టే విధించడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష ్యమే ఓబిసిలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని తెలిపారు. బిసిలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపిన ప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి ఉన్న మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరమైన లొసుగులను సరిదిద్దకోవాలని ఆయన సూచించారు. ప్రతీ అంశాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూసి, కాంగ్రెస్ ప్రభుత్వం బిసి వర్గాల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీస్తోందని రాంచందర్‌రావు తెలిపారు. ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహనగానీ, ఆలోచనల స్పష్టత లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి బిసి రిజర్వేషన్లపై చట్టపరమైన సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిసిలను సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఎంపి అరవింద్ మండిపడ్డారు. హైకోర్టు బ్రేక్ వేయడంపై ఎంపి ధర్మపురి అర్వింద్ స్పందించారు. గురు వారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ చేత గాని తనానికి నిదర్శనం అని విమర్శించారు.

# నిలిచిపోయిన ఇందిరమ్మ యాప్ సేవలు

## కొత్త ఇళ్ల ప్రొసీడింగ్స్‌పై అనుమానాలు

## బిల్లులపై ఆందోళన

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో కొత్త ఇళ్ల మార్కింగ్ ఆగిపోయింది. నిర్మాణం చేపట్టిన వారికి బిల్లులు పడతాయో లేదో అన్న అనుమానం ఉంది. ఇందుకు కారణం రాష్ట్రంలో అమల్లో ఉన్న ఎన్నికల కోడ్. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. ఇది పట్టణ ప్రాంతాలకు వర్తించదని అధికారులు చెప్పినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. ఇందిరమ్మ యాప్ సర్వీస్ నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. ఇంటి నిర్మాణం ప్రారంభించి.. పలు దశల్లో ఉన్న లబ్ధిదారులు.. బిల్లుల రాక కోసం ఎదురు చూస్తున్నారు. స్టేటస్ చెక్ చేయడం కోసం ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఓపెన్ చేయాలని చూస్తే అది పని చేయడం లేదు. యాప్ సర్వీస్ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరి ఎందుకు ఇలా జరిగింది అంటే.. ప్రస్తుతం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి.. ఎలక్షన్ రిజల్ట్ వెలువడే వరకు కోడ్ అమల్లో ఉండనుంది.

ఔఅయితే ఎన్నికల కోడ్ కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంటుందని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసింది. మున్సి పాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల కోడ్ వర్తించదని తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో పాలనా వ్యవహారాలు కొనసాగించవచ్చని ఎన్నికల సంఘం పేర్కొంది.

కేవలం గ్రామాల్లోనే ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని.. షెడ్యూల్ రావడానికి ముందే మొదలైన, మంజూరైన పాత స్కీమ్‌లు, అభివృద్ధి పనులను కొనసాగించవచ్చుని.. వాటికి ఎలాంటి కోడ్ వర్తించదని స్పష్టం చేసింది. పట్టన ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రాదని చెప్పినప్పటికీ.. సిటీ పరిధిలో కొత్తగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మార్కింగ్‌లు నిలిపివేశారు. కారణం లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే ఇందిరమ్మ యాప్ సర్వీస్ నిలిచిపోయింది. దీంతో ఇళ్ల మార్కింగ్ నిలిపి వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర గృహనిర్మాణశాఖ అధికారులు వెల్లడించారు.

# గ్లోబల్ కేపబులిటీ సెంటర్లకు రాజధానిగా హైదరాబాద్

## జిసిసి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి కెటిఆర్




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, అక్టోబరు 9:** హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారింది అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం త్వరలోనే మొదటి స్థానానికి వస్తుందని ఆశిస్తున్నాను. హైదరాబాద్ నగరం బెంగళూరును దాటి మరింత ప్రగతి సాధించాలని కోరుకుంటున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాదులో జరిగిన జీసీసీ సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గురువారం హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారడం వెనక గత ప్రభుత్వం కృషి ఎంతగానో ఉన్నది. పది సంవత్సరాలపాటు అన్ని రంగాల్లో, అన్ని కోణాల్లో హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తుల ఆధారంగా కాకుండా శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలను, చట్టాలను, సంస్కరణలను తీసుకురావడం వలన తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచింది అని కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ ఇవన్నీ రంగాల్లో భారీగా పెట్టుబడులను, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించగలిగింది. హైదరాబాద్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటినీ ఉపయోగించుకొని మరింత పెట్టుబడులు వచ్చేలా తమ తమ పరిధిలో కృషి చేయాలని చార్టెడ్ అకౌంటెంట్‌లకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న సంస్కరణల యుగంలో ఆర్థిక కార్యకలాపాల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న చట్టాల నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెంట్ల ప్రాధాన్యత బాగా పెరిగిందని, వీరంతా దేశంలో డిజిటల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌కు సంబంధించిన రంగంలో కీలకంగా మారారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలని ఎల్లప్పుడూ కోరుకుంటామని తెలిపారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండి యా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ సమ్మిట్‌కి తనను ఆహ్వానించినందుకు నిర్వాహకులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

**రేవంత్ బిసిలను దారుణంగా మోసం చేశారు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులపాటు మోసపూరితంగా వ్యవహరించిన తీరుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్టేతో 42 శాతం రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ సర్కారు ఇంతకాలం చేసిందంతా డ్రామా తప్ప మరొకటి కాదని రుజువైపోయిందన్నారు.

కేవలం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరు వల్లనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని కేటీఆర్ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలను దారుణంగా మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం మభ్యపెట్టేందుకు తెచ్చిన జీఓ న్యాయస్థానాల్లో నిలబడదని బీఆర్‌ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమని తేలిపోయిందని ఆయన స్పష్టం చేశారు.

కులగణనను మొదలుకుని జీవో దాకా రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో అడుగడుగున చేసినదంతా మోసం, దగా, నయవంచన తప్ప మరొకటి కాదని, కులగణన నుంచి మొదలుకొని ప్రతి సందర్భంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు బీఆర్‌ఎస్ తరఫున ప్రభుత్వానికి అనేక సూచనలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు.

అసెంబ్లీలో పాస్ చేసిన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సి ఉంది పోయి, ఏకపక్షంగా దేశ రాజధానికి వెళ్లి ధర్నా పేరిట నాటకమాడారు అంటూ విమర్శించారు. ఎన్నికలకు ముందు రిజర్వేషన్లు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి 42 శాతం బీసీలకు పదవులు కట్టబెడతామని చెప్పి, పూటకొక మాటను కాంగ్రెస్ మార్చిందన్నారు. ఒకవైపు రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్ లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చేశారని, చివరికి న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారని ఆయన అన్నారు.

# మేమొస్తే.. కుటుంబానికో ఉద్యోగం

## 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తాం

### ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్

**పాట్నా, అక్టోబరు 9:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్ సంచలన ప్రకటన చేశారు. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు దీనికి వీలు కల్పించే చట్టం తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. 'ప్రభుత్వ ఉద్యోగం లేని ఏ బీహార్ కుటుంబానికైనా కొత్తచట్టం ద్వారా అది లభిస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు తాము ఈ చట్టాన్ని తీసుకువస్తాము. 20 నెలల్లోపు ప్రభుత్వ ఉద్యోగం లేని బీహార్ ఇల్లు ఉండదు' అని పేర్కొన్నారు. తామేమీ గాలిలో లెక్కలు వేసి చెప్పడం లేదని, ప్రభుత్వ డేటా ఆధారంగానే ఈ ఉద్యోగ ప్రకటన హామీ ఇస్తున్నామన్నారు. 'ఇది నా ప్రతిజ్ఞ. ఇది చేయవచ్చు. ఇది జుమ్లేబాజీ కాదు' అని అన్నారు. గురువారంనాడు పాట్నాలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌డిఎ భాగస్వాములు జెడియు, బిజెపి ఉద్యోగాల కల్పిస్తామని వాగ్దానం చేయడం లేదని, నిరుద్యోగ భృతిని ఇస్తామని చెబుతున్నాయని అన్నారు. బీహార్‌లో ఉద్యోగంలేని ఇల్లు ఉండకూడదని భావిస్తున్నామని చెప్పారు.




# ఖచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మోస్ట్ ఎవైటెడ్మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్స్. ప్రముఖ స్టైలిస్ట్ఫిల్మ్ మేకర్ నీరజాకోనదర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. టీజర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తెలుసు కదా అక్టోబర్ 17న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ శ్రీనిధి శెట్టి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**ఫస్ట్ టైం లవ్స్టోరీ చేస్తున్నారు ఎలా అనిపించింది?**

చాలా హ్యాపీగా ఉంది. కేజీఎఫ్,హిట్ త్రీయాక్షన్,తెలుసుకదా ఒక లైట్ హార్టెడ్ మూవీ చాలా కొత్తగా ట్రై చేశాం.తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. **ఈ కథ చెప్పినప్పుడు మిమ్మల్ని అట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి?** ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి వున్నప్పుడు ట్రైయాంగిల్ లవ్స్టోరీ అనుకుంటారు. కానీ ఒక యూనిక్ పాయింట్ని టచ్ చేశాం. సినిమా చూసినప్పుడు మీరు ఖచ్చితంగా సర్ ప్రైజ్ అవుతారు. **నీరజతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నీరజ చాలాపాషన్ తో సినిమా చేశారు. నీరజ చాలా సాఫ్ట్,సపోర్టివ్.

**తెలుసుకదాలో వున్న స్పెషాలిటీ ఏమిటి?**

ఇందులో చాలాకొత్తపాయింట్ వుంది. మూడు క్యారెక్టర్స్ ఆడియన్కి కనెక్ట్ అవుతాయి.

**తమన్ మ్యూజిక్ గురించి?**

ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది.

**వెంకటేష్త్రివిక్రమ్ సినిమాలో మీరు వున్నారని విన్నాం?**

నాకు తెలీదు. ఆ సినిమా అవకాశం రావాలని కోరుకుంటున్నాను.

ఆల్ ది బెస్ట్. థాంక్ యూ .

# 50 యేళ్ల నట జీవితంలో 'అరి' సినిమాలో చేయడం గర్వంగా ఉంది

## డైలాగ్ కింగ్ సాయికుమార్



ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ( ఆర్వీరెడ్డి ) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి 'మై నేమ్ ఈజ్నోబడీ' అనేది ఉపశీర్షిక. వినోద్వర్మ, అనసూయ భరద్వాజ్, సాయికుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్బాయ్" చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్నజయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. 'అరి' సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది హైదరాబాద్లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ పలువురు రాష్ట్రమంత్రులు, సినీ,రాజకీయ ప్రముఖులు అతిథులుగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలోనిర్మాత తిమ్మప్ప నాయుడు పురిమెట్ల మాట్లాడుతూ అరిషడ్వర్గాల నేపథ్యంగా అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి మా దర్శకుడు జయశంకర్ 'అరి' సినిమాను రూపొందించాడు.మూవీకి థియేటర్స్లో మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నా అన్నారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్స్వామి మాట్లాడుతూ ,. అలాంటి అరిషడ్వర్గాల ఆధారంగా జయశంకర్ సినిమా రూపొందించడం అభినందనీయం. ఇది సమాజానికి మంచి చేస్తుంది కాబట్టే సినిమా కార్యక్రమానికి వచ్చాం. అరి సినిమా చూడండి ఆ హరికి దగ్గరవ్వండి. అన్నారు.ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ మనమంతా మనుషులం కాబట్టి అరిషడ్వర్గాలు ఉంటాయి. వాటిని పూర్తిగా వదిలేయడం ఎవరికీ సాధ్యం కాదు. కానీ వీలైనంత తగ్గించుకుంటే మంచిది. మన సమాజం చేయాల్సిన అలాంటి ప్రయత్నానికి ఈ'అరి' సినిమా తోడ్పడాలని కోరుకుంటున్నా. ౧.ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మంచి సందేశం ఇచ్చేలా రూపొందిన 'అరి' సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నా. అలాగే ఈ చిత్ర దర్శక నిర్మాతలకు మంచి పేరు గుర్తింపు ఈ సినిమా తీసుకొస్తుందని ఆశిస్తున్నా. అన్నారు. తెలంగాణ స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ, 'అరి'లాంటి సినిమాలు మన సమాజానికి అవసరం. పెడదారి పడుతున్న యువతను ఇలాంటి మూవీస్ మంచి మార్గంలో వెళ్లేలా చేస్తాయి.

సందేశాత్మక చిత్రాల ద్వారానే మన ప్రేక్షకులకు మంచిని చెప్పడం సాధ్యమవుతుంది. అన్నారు.మినిస్టర్ జి. వివేక్ మాట్లాడుతూ, డైరెక్టర్ జయశంకర్ మా పెద్దపల్లి నియోజకవర్గానికి చెందినవారు. ఆయన గతంలో పేపర్ బాయ్ అనే సినిమా చేశారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. ఇప్పుడు అరిషడ్వర్గాల ఆధారంగా అనే చిత్రాన్ని రూపొందించారు. ఇది కొత్త కాన్సెప్ట్. ఈ చిత్రంలో నటించిన సాయికుమార్నాకు మంచి మిత్రులు. మనందరిలో అరిషడ్వర్గాలు ంటాయి. అయితే వాటిని సాధ్యమైనంత నియంత్రించుకోవాలి. సినిమా బిజినెస్ అంటేనే రిస్క్.'అరి' చిత్రంతో అలాంటి రిస్క్ చేశారు నిర్మాతలు. ఈ సినిమా మంచి విజయాన్ని ఇవ్వాలి. తగినన్ని ప్రోత్సహకాలు ఇస్తూ మన చిత్ర పరిశ్రమను కూడా కాపాడుకోవాలి, అభివృద్ధి చెందేలా చూసుకోవాలి. అప్పుడే స్థానికంగా ఉన్న ప్రతిభావంతులకు అవకాశాలు వస్తాయి. అన్నారుఅలాగే ఈ సినిమా కూడా సక్సెస్ అవుతుందని ఆశిస్తున్నానని అన్నారు.నటి అనసూయ మాట్లాడుతూ, ఈ సినిమాకు వర్క్ చేయడం మంచి ఎక్సీపిరియన్స్ ఇచ్చింది.డైరెక్టర్ జయశంకర్ మాట్లాడుతూ, 'అరి'సినిమా మనల్ని మనం చూసుకునే అద్దం లాంటిది. అరిషడ్వర్గాల కాన్సెప్ట్ ను ఎంతోమంది సద్గురులను కలిసి ఒక ఎంటర్ టైనింగ్గా ఈ చిత్రంలో రూపొందించాను. యాక్టర్సాయికుమార్ మాట్లాడుతూ, పురాణఇతిహాసాల గురించి చిన్నప్పుడు అమ్మ నాకు చెప్పేది.జయశంకర్ అరిషడ్వర్గాల నేపథ్యంగా సినిమా అని చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆరుపాత్రలతో జయశంకర్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మాఆరు పాత్రలు ఎక్కడా కలవవు. అందుకే మీ పాటు నేను కూడా థియేటర్ లో ఈ సినిమా ఎలా వచ్చిందో చూడాలని అనుకుంటున్నానని నా 50ఏళ్ల నట జీవితంలో 'అరి' లాంటి చిత్రంలో నటించినందుకు గర్వ పడుతున్నా..ఈ సినిమాకు కనిపించే మూడు సింహాల్లాంటి ప్రొడ్యూసర్స్ ఇక్కడ ఉన్నారు. కనిపించని నాలుగో సింహం లాంటి ప్రొడ్యూసర్ మా ఆర్వీరెడ్డి అమెరికాలో ఉంటారు. ఈచిత్రంలో ప్రతి ఒక్కరూ బాగానటించారు.వినోద్వర్మ నటన ఆకట్టుకుంటుంది.

# థియేటర్లలలో గర్జించనున్న 'వృషభ'

నవంబర్ 6న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లో గర్జించనున్న కంప్లీట్ యాక్టర్ మోహన్ లాల్ 'వృషభ'మలయాళ సూపర్స్టార్..కంప్లీట్ యాక్టర్ మోహన్లాల్ సినిమా అంటే మాలీవుడ్తో పాటు పాన్ ఇండియన్ లెవెల్లో స్పెషల క్రేజ్ ఉంటుంది. అన్నిభాషల ఆడియెన్స్ మోహన్లాల్ సినిమాల కోసం ఎదురుచూస్తుంటారు.

ఆయన ప్రస్తుతం మోస్ట్ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ మూవీ 'వృషభ'లో హీరోగా నటిస్తున్నారు. కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై 'వృషభ' చిత్రాన్ని శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ మూవీపై అనౌన్స్ మెంట్ నుంచే



ఎక్స్ పెక్టేషన్స్ భారీ స్థాయిలో ఏర్పడ్డాయి. మలయాళ సినీ చరిత్రలోనే భారీ బడ్జెట్ సినిమాల్లో ఒకటిగా రూపొందుతోన్న 'వృషభ' సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రెస్టీజియస్ మూవీని నవంబర్ 6న వరల్డ్ వైడ్గా ఈ సినిమా గ్రాండ్ లెవల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఏక్తా కపూర్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, భారీగా రూపొందిస్తోన్న 'వృషభ'సినిమాను నవంబర్ 6న విడుదల చేస్తున్నామని తెలియజేయటానికి సంతోషిస్తున్నాం. ఇది నా హృదయానికి ఎంతో దగ్గరైన కథ. బలమైన భావోద్వేగాలు, లార్జర్ దేన్ లైఫ్ డ్రామాతో ఇండియన్ సినిమాను గొప్పగా ఆవిష్కరిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్పీరియెన్స్ను అందించటానికిసిద్ధంగా ఉన్నాం అన్నారు.చిత్ర దర్శకుడు నంద కిషోర్ మాట్లాడుతూ నవంబర్ 6న 'వృషభ'చిత్రాన్ని విడుదల చేస్తున్నామని తెలియజేయటానికి ఎంతో ఆనందంగా ఉంది. వృషభ సినిమాతో ఓ చరిత్రను క్రియేట్ చేయబోతున్నాం. బలమైన భావోద్వేగాలతో పాటు అద్భుతమైన విజువల్స్ తో సినిమాను రూపొందించాం. బంధాలు, త్యాగాల కలయికగా రూపొందిన ఈ సినిమా ఆడియెన్స్కు గొప్పగా కనెక్ట్ అవుతుంది. ఇదొక ప్రత్యేకమైన, సంక్లిష్టమైన కథ. దీనికి ప్రాణం పోయటానికి ఎంటైర్ టీమ్ ఎంతగానో కష్టపడ్డారు. నవంబర్ 6న సినిమాను చూసే ప్రేక్షకులు ఓ గొప్ప అనుభూతికి లోనవుతారు అన్నారు.ఇటీవల విడుదలైన టీజర్ను గమనిస్తే మోహన్లాల్ అందులో యోధుడైన రాజు పాత్రలో కనిపిస్తారు. విధి పిలిస్తే ..రక్తమేస్పందించాలనే బలమైన సందేశాన్ని ఆయన పాత్ర ద్వారా అందించారు. రీబర్న్ లవ్.. ఎ లవ్ సో స్ట్రాంగ్, ఇట్ డిఫైస్ డెత్ అనే ఎమోషనల్ ట్యాగ్ లైన్ ప్రేమ గొప్పతనం, అశాంతి, శాశ్వతమైన బంధాలపట్ల ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. భూత కాలానికి, వర్తమాన కాలాన్ని చూపించిన టీజర్తో ప్రేక్షకులకు మరింత ఆసక్తి పెరిగింది. మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సమర్జిత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన సారిక తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. సామ్ సి.ఎస్ సంగీతం అందించిన ఈ చిత్రానికి రసూల్ పూకుట్టి సౌండ్ డిజైన్ చేశారు. ఎస్.ఆర్.కె, జనార్ధన మహర్షి, కార్తీక డైలాగ్స్ రాసిన అద్భుతమైన విజువల్స్ కలయికగా ఉన్న కథను ఎపిక్ యాక్షన్ సినిమాటిక్ జర్నీగా రూపొందించారు.

# సినిమాకు వచ్చిన ప్రతీ ఒక్కరిని నవ్విస్తుంది

హీరోయిన్




ప్రియదర్శి, నిహారికఎన్ ఎం జంటగా విజయేందర్ దర్శకుడిగా బీవీ వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో కళ్యాణ్ మంథిన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిన'మిత్ర మండలి' మూవీ అక్టోబర్ 16న రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో హీరోయిన్ నిహారిక ఎన్ ఎం మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..

**మీ మొదటి చిత్రం ఏది?..**

నేను ముందుగా ఈ 'మిత్ర మండలి' కథనే విన్నాను. కానీ' పెరుసు'తమిళ చిత్రం ముందుగా రిలీజ్ అయింది. 'మిత్ర మండలి'లో ఉండే భారీ క్యాస్టింగ్ వల్ల అందరి డేట్స్ అడ్జస్ట్అవ్వడానికి చాలా టైం పట్టింది. మొత్తానికి అక్టోబర్ 16న మా చిత్రం ఆడియెన్స్ ముందుకు రాబోతోంది.

**'మిత్ర మండలి' లో మీ పాత్ర ఎలా ఉంటుంది?..**

'మిత్ర మండలి' చిత్రంలో నేను ఓ సాఫ్ట్ పాత్రను పోషించాను. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఇన్ ఫ్లూయెన్సర్గా నాకు చాలా కంఫర్ట్ ఉంటుంది. సినిమాల్లో నటించడం చాలా కొత్తగా, ఆనందంగా ఉంది.

**.ప్రియదర్శితో వర్క్ ఎక్స్పీరియెన్స్ గురించి చెప్పండి?..**

ప్రియదర్శి చాలా మంచి వ్యక్తి. అద్భుతమైన నటుడు' ప్రియదర్శి ఎంత సక్సెస్ అయినా కూడా ఒదిగి ఉంటారు.

**భవిష్యత్తులో ఎలాంటి పాత్రలను చేయాలని అనుకుంటున్నారు?..**

నాకుఅన్ని కూడా కామెడీ బేస్డ్ చిత్రాలే వస్తున్నాయి.

**చిత్రం ఎలా ఉంటుంది? ఆడియెన్స్ ఏం ఆశించి థియేటర్కు రావాలి?..**

'మిత్ర మండలి' చిత్రంలో కథ, కథనం చాలా కొత్తగా ఉంటుంది. అందరినీ నవ్వించేలా మా చిత్రం ఉంటుంది. థియేటర్కు వచ్చిన ప్రతీ ఒక్కరినీ హాయిగా నవ్వించేస్తుంది. **'మిత్ర మండలి' దర్శక, నిర్మాతల గురించి చెప్పండి?..** తెలుగు చిత్ర సీమ నన్ను ఎంతో సాదరంగా ఆహ్వానించింది. టాలీవుడ్లో దొరికినంత ప్రేమ, కంఫర్ట్ నాకు ఇంకెక్కడా దొరకలేదు .

# 'పంజరం'ట్రైలర్ విడుదల



కళ్యాణ్ 'ఓజీ' చిత్రం నుంచి

సే స్టోరీ ప్రొడక్షన్స్, ఆర్3 ప్రొడక్షన్స్ బ్యానర్లపై సాయి కృష్ణ తెరకెక్కించిన 'పంజరం' ట్రైలర్ విడుదల.. సే స్టోరీ ప్రొడక్షన్స్, ఆర్3 ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఆర్ రఘున్ రెడ్డి నిర్మాతగా సాయి కృష్ణ దర్శకత్వంలో అనిల్, యువతేజ, ముస్కాన్, రూప ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం 'పంజరం'. కొత్త వాళ్లంతా కలిసి చేసిన ఈ హారర్ మూవీకి సంబంధించిన ట్రైలర్ను నాడు రిలీజ్ చేశారు.ఈ ట్రైలర్ మాత్రం వెన్నులో వణుకు పుట్టించేలా ఉంది. పేదరాసి పెద్దమ్మ అంటూ ఓపెన్ చేసిన ట్రైలర్, ఊరుని చూపించిన తీరు, హారర్ ఎలిమెంట్స్ అన్నీ కూడా రోమాలు నిక్కబొడుచుకునేలా ఉన్నాయి. హారర్ మూవీకి ఉండాల్సిన కెమెరా వర్క్, ఆర్ఆర్ 'పంజరం'లో కనిపించాయి. ట్రైలర్లో చివరి షాట్ మాత్రం అందరినీ భయపెట్టించేలానే ఉంది. ఈ ట్రైలర్ లాంఛ్ చేసిన అనంతరం ఈ కార్యక్రమంలో దర్శకుడు సాయికృష్ణ మాట్లాడుతూ, నాకు ఈ ప్రయాణంలో సహకరించిన టీంకు థాంక్స్. మోహన్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. ఆర్ఆర్, పాటలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఈ చిత్రానికి పని చేసిన ప్రతీ ఒక్కరూ పెద్ద స్టార్స్ అవుతారు. ప్రదీప్ అన్న ఈ చిత్రంలో మంచి పాత్రను పోషించారు. పద్మ మాకు ఎంతో సపోర్ట్ చేశారు. రమణ, సురేష్ , ప్రదీప్ ఇలా అందరూ బాగా నటించారు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన అనిల్, యువతేజ, ముస్కాన్, రూపలకు థాంక్స్. మా ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. మా సినిమాకు ఆడియెన్స్, మీడియా సపోర్ట్ ఉంటుందని భావిస్తున్నాను అని అన్నారు.హీరో యువతేజ మాట్లాడుతూ, 'పంజరం' చిత్రంలో నేను మల్లి అనే పాత్రను పోషించాను. నా కారెక్టర్, లుక్స్ అన్నీ కొత్తగా ఉంటాయి. మా దర్శకుడు సాయి ఈ మూవీని గొప్పగా తీశారు. అనిల్ నాకు చిన్ననాటి స్నేహితుడు. రూప, ముస్కాన్ అద్భుతంగా నటించారు. నాని అన్న మ్యూజిక్ అదిరిపోద్ది. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది అని అన్నారు.హీరో అనిల్ మాట్లాడుతూ, ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తు న్నాను. సినిమా కూడా అంతే స్థాయిలో ఉంటుంది. ఇందులో నేను కార్తిక్ అనే పాత్రను పోషించాను. మా సినిమా అందరినీ ఆకట్టుకుంటుందిఅని అన్నారు.హీరోయిన్ రూప మాట్లాడుతూ, 'పంజరం' చిత్రంలో వెన్నెల పాత్రను పోషించాను. నాకు ఇంత మంచి కారెక్టర్ ఇచ్చిన సాయికి థాంక్స్. ట్రైలర్ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. సినిమా కూడా అందరినీ ఆకట్టుకుంటుంద్ధి అని అన్నారు. హీరోయిన్ ముస్కాన్ మాట్లాడుతూ 'పంజరం' సినిమాకి మేం ప్రాణం పెట్టి పని చేశాం. మా ట్రైలర్ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది అనిఅన్నారు.

# పూరిసేతుపతి సినిమాకి నేషనల్ అవార్డ్ విన్నర హార్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి తొలిసారిగా కలిసి చేస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ పూరి సేతుపతి చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జెబి మోషన్ పిక్చర్స్ బ్యానర్ పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్, జెబి నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్నారు. టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త విజయ్ సేతుపతి సరసన కథానాయికగా నటిస్తోంది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి చిత్రాలతో



పాపులరైన జాతీయ అవార్డు గ్రహీత హార్షవర్ధన్ రామేశ్వర్ పూరిసేతుపతి చిత్రానికి సంగీతం అందించనున్నారని మేకర్స్ ప్రకటించారు. యాక్షన్, ఎమోషన్, ఎలివేషన్ కలగలిసిన న్యూ జనరేషన్ మ్యూజిక్ ని ఎక్స్ పీరియన్స్ చేయడానికి సిద్ధంగా ఉండండి.

టబు, విజయ్కుమార్ కీలక పాత్రల్లో నటిస్తుండగా బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ హిలేరియస్ పాత్రల్లో కనిపించనున్నారు. ప్రధాన నటీనటులు పాల్గొనే ఈ చిత్రం కొత్త షెడ్యూల్ వచ్చే వారం ప్రారంభమవు తుంది. పాన్ఇండియా ఎంటర్టైనర్ పూరిసేతుపతి, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం,హిందీ ఐదు భాషలలో విడుదల కానుంది.

తారాగణం:

# 'బైసన్' చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్

విక్రమ్ తనయుడు ధృవ్ విక్రమ్ నటిస్తున్న నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్ నిర్మాణంలో, ప్రముఖ దర్శకుడు పా రంజిత్ సమర్పణలో మారి సెల్వరాజ్ దర్శకుడుగా ధృవ్ విక్రమ్ హీరోగా నటిస్తున్న



చిత్రం'బైసన్'. ఈ చిత్రాన్ని అక్టోబర్ 24న జగదంబే ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ బాలాజీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా జగదాంబే ఫిలిమ్స్ ప్రొడ్యూసర్ బాలాజీ మాట్లాడుతూ.."ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ధృవ్ తనదైన పర్ఫామెన్స్ తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటారు. ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తో ప్రేక్షకులకు ముందుకు రాబోతున్న ఈ సినిమా తెలుగులో మంచి విజయాన్ని అందుకుంటుందని భావిస్తున్నాం. నాకు తెలుగులో విడుదల చేసే అవకాశాన్నిచ్చిన నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్మెంట్ సంస్థలకు ధన్యవాదాలు' అని అన్నారు.అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్గా నటిస్తున్న ఈ సినిమాలో పశుపతి, కలైయరసన్, రెజిషా విజయన్, హరికృష్ణన్, అళగమ్ పెరుమాళ్, అరువి మదన్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా రంజిత్, అదితి ఆనంద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నివాస్ కే ప్రసన్న సంగీత దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు.తాజాగా ఈ చిత్రం నుంచి మొదటి పాటను విడుదల చేశారు. నివాస్ కే ప్రసన్న కంపోజ్ చేసిన ఈ పాటకు దర్శకుడు మారి సెల్వరాజ్ తమిళంలో లిరిక్స్ రాయగా, ఎనమంద్రా రామకృష్ణ తెలుగు లిరిక్స్ అందించారు. మనువర్ధన్ పాటను పాడారు. తీరేనా తీరేనా. 'గుండెల్లోన మండుతున్న మూగవేదన.' అంటూ సాగిన పాట సినిమాపై క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. ఇందులో ధృవ్ ఇంటెన్స్ లుక్ లో కనిపిస్తున్నారు.

# 'హైవాన్' మూవీతో ఒక గ్రేట్ జర్నీ చేస్తున్నా అక్షయ్ కుమార్

స్టార్ హీరో అక్షయ్కుమార్, సైఫ్ అలీఖాన ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ రూపొందిస్తున్న సినిమా 'హైవాన్'. సరికొత థ్రిల్లర్గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీతో ఫస్ట్ టైమ్ నెగిటివ్ క్యారెక్టర్లో నటిస్తున్నారు అక్షయ్కుమార్. తాజాగా 'హైవాన్' సినిమా లాస్ట్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఓ స్పెషల్ వీడియోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు అక్షయ్ కుమార్.ఈ వీడియోలో అక్షయ్ కుమార్ స్పందిస్తూ 'హైవాన్' మూవీతో ఒక గ్రేట్ జర్నీ చేస్తున్నా. ఈ చిత్రంలో నటిస్తున్న క్యారెక్టర్ అనేక అంశాల్లో నన్ను ఆశ్చర్య పరుస్తోంది. ఇలాంటి రోల్లో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ ప్రియదర్శన్కు థ్యాంక్స్. ఆయన మూవీ సెట్ లో ఉంటే ఇంట్లో ఉన్న ఫీల్ కలుగుతుంది. సైఫ్తో కలిసి నటించడాన్ని ఎంజాయ్ చేస్తున్నా అంటూ పేర్కొన్నారు.హైవాన్ మూవీతో అక్షయ్ కుమార్, సైఫ్ అలీఖాన్ 17 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తున్నారు. హైవాన్ చిత్రాన్ని టాప్ ప్రొడక్షన్ వ్యాల్యూస్తో నిర్మిస్తున్నారు నిర్మాతలు వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్.నటీనటులు : అక్షయ్కుమార్, సైఫ్ అలీఖాన్, తదితరులు, టెక్నికల్ టీమ్: పీఆర్ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్) బ్యానర్స్: కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్నిర్మాతలు, వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయ్ ఫెన్ రచన, దర్శకత్వం ప్రియదర్శ.



# కొండంత ప్రేమ గుప్పెడు బియ్యం!

ఓ రెండు మారుమూల తండాలు. కాయకష్టంతోనే అక్కడివాళ్ల రోజులు గడిచేది. కానీ, ఊహించని వరదతో ఒక్క పూటలో నిలువ నీడనీ, చేతికొచ్చిన పంటనీ కోల్పోయారంతా. ఇది తెలుసుకున్న ఆ ఇతర గ్రామాల మహిళలు పొరుగు కష్టాన్ని తమదిగా భావించారు. చేయిచేయి కలిపి సాయం అందించారు. అది ఆగస్టు 27... తెలవారుతుండగానే కామారెడ్డి జిల్లా, రాజంపేట మండలంలో కుండపోతగా వాన. వాగు పక్కనే ఉండే ఎల్లాపూర్, నడిమి తండాల ప్రజలు బెంబేలెత్తారు. వాగు ఉప్పొంగి కళ్లెదుటే తమ పశువులు, పంటలు వరదకు కొట్టుకుపోతుంటే.. నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. సమీపంలోని ఎత్తైన ప్రాంతాలూ, ఆవాసాల్లో తలదాచుకొని ప్రాణాలు కాపాడుకున్నారు. వరద తగ్గాక ఇళ్లకు వచ్చి చూస్తే బురద చేరి వస్తువులు, తిండి గింజలూ పనికిరాకుండా పోయాయి. దాంతో బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారు. వారి దయనీయ పరిస్థితికి చలించిన ఆ మండల సమాఖ్య మహిళలు గొప్ప ఆశయంతో వారి ఆకలి తీర్చారు.

**ఆచరణలోకి వచ్చిందిలా...** ప్రతి నెలా సమాఖ్య సంఘాల సమావేశం జరుగుతుంది. అలా 15 రోజుల కిందట రాజంపేటలో ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఎల్లాపూర్, నడిమి తండాల వరద బాధితులకు తమవంతు సాయం చేయాలని గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు, ఐకెపి ఎపిఎం రాజారెడ్డి చర్చించారు. 'గుప్పెడు బియం'తో ఆకలి తీర్చాలనుకున్నారు. ఆ ఆలోచనని ఆచరణలో పెట్ట దానికి పెద్ద సమయమేమీ పట్టలేదు. మండలంలో 20గ్రామ సంఘాలు ఉండగా.. వీటి పరిధిలో 583 స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) ఉన్నాయి. వీఇల్లో దాదాపు ఆరువేల మంది మహిళలు సభ్యులు. వీళ్లంతా తమ సంఘ సమావేశాల్లో నిర్ణయం తీసుకుని గుప్పెడు బియ్యం ఇవ్వడానికి ముందుకొచ్చారు. మహిలలు తెచ్చిన బియ్యాన్ని పదేసి కిలోల చొప్పున ప్యాక్ చేశారు.





**సేకరించింది 22 క్వింటాళ్లు...** వారం వ్యవధిలోనే 22 క్వింటాళ్ల బియ్యం సేకరించారు. వీటిని మండల కేంద్రానికీ, అక్కడి నుంచి బాధిత తండావాసులకు చేర్చి ఇటీవల అందజేశారు. బాధితులకు బియ్యం పంపిణీలో జిల్లా అధికారులూ చొరవ చూపారు. 'మహిళలు పొదుపులోనే కాదు.. కష్టాల్లో ఉన్నవాళ్లను ఆదుకోవడంలోనూ ముందు నిలిచారు. ఇది వారి ఐక్యతకూ, సేవా గుణానికీ నిదర్శనం' అంటూ కొనియాడారు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. 'గుప్పెడు బియ్యం' కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి లత, కోశాధికారి లావణ్య పాత్ర ఎనలేనిది. స్వయం సహాయక మహిళలు బియ్యంతోపాటు దుస్తులూ, దుప్పట్లనూ బాధితులకు. ' ఆ తండాల మహిళలు మాకు తెలుసు. వారికి కష్టం వచ్చినప్పుడు స్పందించాల్సిన బాధ్యత ఉందనుకున్నాం. ఇదే భావనని సంఘ సభ్యులందరిలో కల్పించాం. వరద బాధితులు తేరుకునే వరకు కనీసం ఆకలి బాధ తీరనుంది. ఇంతకన్నా గొప్ప సంతృప్తి ఏం ఉంటుంది' అంటారు సహాయక సంఘాల మహిళలు. □

# సాంకేతికతతో గ్రామస్తుల కష్టాలను తీర్చారు ..

ప్రభుత్వ సేవలు కావాలంటే సుదూరం వెళ్లాలి... ధ్రువపత్రం తీసుకోవాలంటే నెలలు . పోనీ అప్పుడైనా వస్తాయా అంటే ఎన్నో వ్యయప్రయాసలు... అదే ఆ మహిళా లను ఆలోచనలో పడే సింది. పెద్ద చదువులు లేకపోయినా సాంకేతికతను ఉంచుకుని గ్రామస్థుల కష్టాలను తీర్చారు. ఆ ప్రయత్నమే, కౌటుకా, అనితా దేబ్ దాస్‌ను కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేసేలా చేసింది.



**మా గ్రామానికి ప్రత్యేక వెబ్‌సైట్:**
**-కౌటుకా నాయక్**

మాది ఒడిశాలోని సుకాటి. నాలుగు వేల జనాభా కలిగిన మా పంచాయతీ మైదానం శివారు గిరిజన గ్రామం. పదో తరగతి వరకు చదువుకున్న నేను 2022లో సర్పంచ్‌గా ఎన్నికయ్యాను అప్పటి వరకు జాబ్కార్డు, కులధ్రువీకరణ... ఇలా ఏవి కావాలన్నా ఊరివాళ్లు చాలా దూరం వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. దీనివల్ల ఓ రోజు పని కోల్పోవాల్సి రావడంతో చాలామంది దరఖాస్తు చేసుకోవడమే మానేశారు. దాంతో ఇంటికి వెళ్లాలనుకుంటున్నాను. ఆ ఆలోచనను అధికారులతో పంచుకున్నా. వారి సాయంతో ఒక కామన్ సెంటర్‌ను ఏర్పాటుచేశా. ఇప్పుడు దీని ద్వారా జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలే కాదు. భూముల మ్యుటేషన్, ఉపాధిహామీ జాబ్కార్డులు, రేషన్‌కార్డు, నల్లాల అను మతి... వంటి సౌకర్యాలను అందుకుంటు న్నారు. మా ఊరి పేరుతో వెబ్‌సైట్ కూడా చేయవచ్చు. ఇందులో సమస్యలపైనా ఫిర్యాదు చేయొచ్చు. ఉచిత వైఫై సదుపాయం ఏర్పాటు చేశాం. ఈ సేవా కోసం 15వ ఆర్థిక సంఘం నిధులు, పీఎంవైఎస్, నరేగా, మినరల్ ఫౌండేషన్, బిజూ గ్రామజ్యోతి యోజన పథకాలను సద్వినియోగం చేసుకున్నాం. ఎన్జీవోల సహకారం తీసుకున్నాం. ఈ-గవర్నన్స్ సేవ వల్ల ప్రజల కష్టాలు తీరాయి. నాణ్యమైన జీవనం సాగించగలుగు తున్నారు. ఈ కృషిని గుర్తించే... తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈగవర్నెన్స్ అవార్డుల్లో జ్యూరీ బహుమతిని ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.1.25 లక్షల ప్రోత్సాహకం ఇచ్చారు.



**మా పంచాయతీకి ఐఎస్‌వో ధ్రువీకరణ**
**- అనితా దేబ్‌దాస్**

పంచాయతీలకు ఈ-గవర్నెన్స్ అవార్డులు ప్రకటించారు. త్రిపుర రాష్ట్రంలోని మా మజ్లిస్పుర్ పంచాయతీ సిల్వర్ అవార్డు కింద రూ.5 లక్షలు గెలుచుకోవడం గర్వంగా ఉంది. నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ఏడాదిన్నర కిందట సర్పంచ్ ఎన్నికయ్యా. అంతకముందు ఉప సర్పంచ్‌గా పనిచేశా. అప్పటి గ్రామ ప్రజలు దేనికైనా దరఖాస్తు చేస్తే అవి రావడానికి నెల రోజుల సమయం పట్టేది. రోజువారీ పనులన్నీ మానుకోవలసి వచ్చేది. దానికి పరిష్కారంగా మా పంచాయతీలో ఈ-గవర్నెన్స్ సేవల్ని అందుబాటులోకి తెచ్చాం. గ్రామంలో నాలుగు ఇంటర్నెట్ సర్వీసు సెంటర్లు ఏర్పాటయ్యాయి. మొబైల్ వ్యాన్ ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరిస్తాం. గ్రామ పంచాయతీ కార్యాలయం కేంద్రం గానూ మరెన్నో సేవలూ అందిస్తున్నాం. ఇప్పుడు సమీప గ్రామాల ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తాం. పరిష్కారానికి గ్రామ స్థాయిలో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుచేసు కున్నాం. ప్రతి వారం వాటి మీద సమీక్షించు కుంటాం. మా గ్రామంలో ప్రతి వీధికి వైఫై జోన్లు ఏర్పాటు చేశాం. పంచాయతీకి సంబంధించి అన్ని రికార్డులతో పాటు గర్భిణుల వివరాలకు డిజిటలైజేషన్ చేశాం. ఇలా మొత్తం 12 రకాల సేవలందిస్తున్నాం. ఈ సేవలకు గుర్తింపుగా ఇప్పటికే మా పంచాయతీ ఐఎస్వో ధ్రువీకరణ ఉంది. గతంలోనూ సీఎం స్మార్ట్ అవార్డు గెలుచుకున్నాం. తాజాగా ఈ-గవర్నెన్స్ అవార్డుల్లో దేశంలోనే రెండో స్థానం లభించడం ఆనందంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది. □

**చెలి చిట్కా:** ప్రతిరోజు నుదటిమీద చందనం బొట్టుపెడితే విశిష్ట జ్ఞాపకశక్తి వస్తుంది. మార్కెట్‌లో లభించే తిలకం ముద్రల్ని కుంకుంలోగాని చందనంలో గాని ముంచి పెట్టుకుంటే అందంగా ఉంటుంది.

# పదిలమైన గుండె ఆరోగ్యానికి..

మహిళల గుండె ఆరోగ్యం ప్రధానంగా కొలెస్ట్రాల్ స్థాయుల పైన ఆధారపడి ఉంటుంది. ఇది ఆహారానికి సంబంధించిన అంశం. మహిళల్లో హార్మోన్లు, జీవక్రియలో మార్పులవల్ల, ముఖ్యంగా మెనోపాజ్ దశలో కొలెస్ట్రాల్ గుండె ఆరోగ్యంపైన చెడు ప్రభావం చూపుతుంది. సంతృప్త, ట్రాన్స్ ఫ్యాట్స్ శరీరంలో ఎల్డీఎల్ కొలస్ట్రాల్ని పెంచుతాయి. బదులుగా ఫైబర్ అధికంగా ఉండే శాకాహారాన్ని తీసుకోవాలి. ఇవి లిపిడ్ స్థాయుల్ని నియంత్రిస్తాయి. పప్పులు, ఓట్స్, సెనగలు, రాజ్మాను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఆపిల్, జామ, నిమ్మ జాతి పండ్లను ఎక్కువగా తీసుకుంటూనే, పెరుగు, మజ్జిగ, ఇడ్లీ లాంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. నెయ్యి, వెన్న, రెడ్ మీట్‌కు బదులుగా నట్స్, విత్తనాలు, అవకాడో, ఆలివ్ నూనెని ఆహారంలో భాగం చేసుకుంటే శరీరంలో ఆరోగ్యకరమైన కొవ్వులు పెరుగుతాయి. సాల్మన్ వంటి చేపల్లో ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు గుండె



ఆరోగ్యానికి ఎంతో మేలు. ఇవి ట్రైగ్లిజరైడ్స్ సంఖ్యను తగ్గించి రక్త ప్రసరణ సాఫీగా సాగేలా చేస్తుంది. ఇంట్లో, వృత్తిలో ఒత్తిళ్ల, హార్మోన్లలో మార్పులవల్ల ఆహా వేళలతోపాటు తీసుకునే పరిమాణంలోనూ మార్పు ఉంటుంది. కాబట్టి ఆహారాన్ని నిర్ణీత సమయంలో, తగిన మోతాదులో తీసుకోవడం ముఖ్యం గుండె ఆరోగ్యానికి ఇవి ఉండాలి, తినకూడదన్న నియమం లేదు. పరిమితంగా ఏవైన ఉండవచ్చు. అదే సమయంలో పోషకలల్లో భిన్నత్వం ముఖ్యం. దీనికితోడు ఒత్తిడిని నియంత్రణలో ఉంచడం అవసరం. అప్పుడే మహిళల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. □

# విటమిన్ 'డి' తగ్గితే..

పిల్లలకి ఆటల్లో దెబ్బలు తగలడం సహజమే. అయితే, కొన్నిసార్లు ప్రమాదవశాత్తు చేయో, కాలో కూడా విరుగుతూ ఉంటాయి. వీటిల్లో చాలావాటికి సర్జరీల అవసరమూ ఉండకపోవచ్చు. అయితే, ఆ చిన్నారికి డి విటమిన్ లోపం ఉంటే మాత్రం అది అతుక్కోవడానికి సమయం పట్టొచ్చుట. అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ నేషనల్ చేసిన ఓ స్టడీ దీన్ని వెల్లడిస్తోంది. ఇందులో భాగంగా 188 మంది గాయాలు పాలైన పిల్లల్ని పరీక్షించారట. ఆపై రేడియోగ్రాఫిక్ ఫలితాలతో పోల్చి చూడటం ద్వారా ఈ సూచన సూచించ బడింది. దీంతో మరోసారి పిల్లల ఎదుగుద లలో, ఎముకల దృఢంగా మారడంలో డి విటమిన్ కీలకపాత్ర అనే విషయం వెల్లడైంది. అందుకే, డి. విటమిన్ ఎక్కువగా ఉండే పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, తృణధాన్యాలను వారికిచ్చే ఆహారంలో తప్పక చేర్చాలి. ఇక, రోజూ కాసేపైనా కచ్చితంగా చిన్నారులు ఆరుబయట ఆడుకునేలా చూడండి. ముఖ్యంగా ఎండలో చర్మం చురుక్కు మనేదాకా ఉండనివ్వాలి. అంటే దాదాపు ఇరవై నిమిషాల నుంచి గంట వరకూ సమయం పట్టొచ్చు. అప్పుడే విటమిన్ డి శరీరానికి తగినంతగా అందు తుంది. ఎముకలు పుంజుకునేలా చేస్తుంది. □



# మెరిసే యవ్వనం కోసం..

కొంతమందికి చిన్నతనంలోనే ముఖంపై ముడతలు పడుతుంటాయి. ఈ వయసు తక్కువ అయినా ఎక్కువగా కనిపిస్తుంది. మరి ఈ సమస్యను తగ్గించుకోవడానికి రకరకాల చికిత్సలు చేయించుకోవడం, ఏవేవో క్రీములు రాసుకోవడం.. వైద్యం చేస్తున్నారు. ఫలితంగా కొందరికి సమస్య తగ్గకపోగా... కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. కాబట్టి ముందు నుంచే మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు దరికి రాకుండా.. నవయవ్వనంతో మెరిసిపోవచ్చు.



**బ్లూ బెర్రీలు..** చర్మ సౌందర్యానికి ఉపయోగపడే పాలీఫినోల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు.. మొదలైనవి బ్లూ బెర్రీ పండ్లలో అధికంగా లభిస్తాయి. ఇవి ఫ్రీరాడికల్స్ నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. అలాగే కొత్త చర్మకణాలను ఉత్పత్తి చేయడంలోనూ ఇవి సహాయపడతాయి. కాబట్టి వీటిని రోజూ తీసుకోవడం వల్ల నవయవ్వనంతో మెరిసిపోవచ్చు.




**టమాటాలు..** టమాటాల్లో ఉండే లైకోపీన్ సూర్యుడి నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మానికి రక్షణ కల్పిస్తుంది. ప్రతిరోజూ టమాటాలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల రక్తనాళాల్లో రక్తప్రసరణ సజావుగా జరిగి చర్మానికి మెరుపు వస్తుంది.

**తేనె..** తేనెలో ఉండే యాంటీవైరల్, యాంటీఆక్సిడెంట్ గుణాలు చర్మాన్ని నవయవ్వనంగా ఉంచడంలో సహాయపడ తాయి. అందుకే తేనెను ఇంట్లో సహజసిద్ధంగా తయారు చేసుకునే ఫేస్ మాస్కులలో ఉపయోగిస్తారు.



**పెరుగు:** చర్మానికి ఉపయోగపడే బ్యాక్టీరియా పెరుగులో ఉంటుంది. దీనివల్ల చర్మం లోపల, బయటి నుంచి కూడా నవయవ్వనంగా తయారువుతుంది. అలాగే కొన్ని సందర్భాల్లో చర్మం ఎర్రగా మారడం.దద్దుర్లు రావడం జరుగుతుంది. ఇలాంటి సమస్యల్ని తగ్గించుకోవడానికి పెరుగులో ఉండే ప్రొ బయోటిక్స్ తోడ్పడతాయి.

**ఓట్స్..** మనకు సహజసిద్ధంగా మొక్కల నుంచి లభించేవి. కాబట్టి వీటిని తినడం వల్ల చర్మకణాలక ఎలాంటి నష్టం వాటిల్లకుండా కాపాడుకోవచ్చు. ఇవేకాకుండా సహజంగా మొక్కల నుంచి లభించేవి.



**గోధుమ, బార్లీ..** వంటి వాటిని కూడా మనం రోజూ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల చర్మంపై ముడతలు, వృద్ధాప్య ఛాయలు దరికి రాకుండా జాగ్రత్త పడచ్చు.

**గ్రీన్ టీ ...** మన శరీరంలో చర్మం కొత్త చర్మ కణాల ఉత్పత్తయితే తాజాగా, నవనవ్వనంగా కనిపిస్తుంది. కాబట్టి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే గ్రీన్ టీని ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. ఎందుకంటే ఇది కొత్త చర్మాన్ని ఉత్పత్తి చేయడంలో.. వాటి అభివృద్ధిలో తోడ్పడుతుంది.

**సరిపడినంత నీరు...** చర్మం నవయవ్వనంగా కనిపించాలంటే మన శరీరంలో తగినంత నీరు ఉండాలి. కాబట్టి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి. వీటితో పాటు యాంటిఅక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఇతర పండ్లు, కూరగాయలను ఎక్కువ మొత్తంలో తినడం అలవాటు చేసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు రాకుండా నివారించవచ్చు. □

# దుస్తులు ఓ పద్ధతిలో అమర్చుకోవాలి..

ఉదయం లేవగానే ఇంట్లో పని, ఆపై ఆఫీసు హడావుడి మొదలవుతుంది. ఆ సమయంలో దుస్తుల ఎంపిక, ఆపై వాటిని మ్యాచింగ్ దుపట్టానో, లెగ్గింగో వెతకడం... పెద్ద ప్రహసనమే. ఇలా కాకూడదంటే, బీరువాలో దుస్తులన్నీ ఓ పద్ధతిలో అమర్చుకోవాలి. అప్పుడే కావాల్సినవి క్షణాల్లో తీసుకోవచ్చు. ఏం చేయాలంటే..

**చోటు మిగల్చాలి...** క్రీములు, పౌడర్లు, ఫ్యాన్సీ ఆభరణాల బాక్సులు, హ్యాండ్ బ్యాగులు వంటివి వార్డ్‌రోబ్ లోపలి ప్లాట్‌ఫామ్‌పై ఉంచుతాం. అలాగే హెయిర్ డ్రయ్యర్‌వంటి వాటికీ చోటిస్తుంటాం. అలాకాకుండా బీరువాలో హ్యాంగర్స్ తగిలించే రాడ్‌కు హ్యాంగింగ్ హుక్స్‌ని అటాచ్ చేయాలి. వాటికి హ్యాండ్‌బ్యాగు, తాళాలు, స్కార్ఫ్, టైలు తగిలిస్తే చాలు. అలాగే మార్కెట్లో లభ్యమవుతున్న అడిసిన్ హుక్ బార్ కూడా ఈ సమస్యకు పరిష్కారాన్ని ఇస్తుంది. దీని వెనకున్న స్ట్రిప్ తొలగించి అలమర లోపల గోడకు అతికించాలి. బ్యాగు, గొడుగు, కెమెరా, తాళాలు... వంటివన్నీ దీనికి వేలాడదీయొచ్చు. చివరగా బ్యూటీ క్రీములు, జ్యూయెలరీ బాక్సులను బీరువాలో ఓ పక్కగా ట్రేలో పెడితే సరి. అన్నీ కలగలిసి పోకుండా ఉంటాయి.

**జారకుండా...** సాధారణ హ్యాంగర్‌కు దుస్తులు తగిలిస్తొంటాం. రెండుమూడు రోజులకు వాటి నుంచి దుస్తులు జారి వార్డ్‌రోబ్‌లో చిందరవందరగా కనిపిస్తాయి. ఇలా కాకుండా హ్యాంగర్స్‌కు చివర్లలో రెండువైపులా వెల్వెట్ క్లాత్ ముక్కలు అంటించి యాంటిస్కిడ్ హ్యాంగర్ మార్చాలి. అలాగే ఒకే హ్యాంగర్‌కు అయిదారు దుపట్టాలు తగిలించకుండా వీటికోసం ప్రత్యేకంగా వస్తున్న అర్గనైజర్స్ వాడండి.



**వృథాగా..** వార్డ్‌రోబ్ నిండా దుస్తులుంటాయి. కానీ ఎంపికకు సరైనవాటిని ఎంచుకోవడం కష్టమవుతుంది. దీనికి కారణం చినిగిందనో, కుట్టు ఊడిందనో, బటన్ లేదనో, వదులు లేదా బిగుతుగా ఉందనో వినియోగించని వాటిని కూడా మిగతా వాటితో కలిపి సర్దేస్తాం. ముందుగా రెండు అట్టపెట్టెలు తీసుకుని ఒకదానిపై ఆల్ట్రేషన్, మరొకదానిపై డొనేషన్ అని రాసిన స్లిప్ అంటించాలి. ఆ తర్వాత బీరువాలో వినియోగించని వాటిని విభజించి ఈ అట్టపెట్టెల్లో సర్దాలి సమయం ఉన్నప్పుడు వాటిని బాగుచేయడం, పేదలకివ్వడం చేయొచ్చు. ఇలా ఖాళీ అయిన వార్డ్‌రోబ్ ఉపయోగపడేవి మాత్రమే కనిపిస్తాయి. సమయం వృదా కాదు. అలాగే షెల్ఫ్ డివైడర్స్ ఏర్పాటుతో పిల్లల దుస్తులు, లోదుస్తులు వంటివాటిని సర్దితే అలమరలో అన్నీ ఒకచోటకు కలవకుండా ఉంటాయి. □

## తెలుసుకుందాం..

మగవారితో పోలిస్తే ఆడవారిలో భావోద్వేగాలతో కూడిన పీడకలలు ఎక్కువగా వస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఆందోళన, అణచిన భావోద్వేగాలు, హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు కారణం. అంతేకాదు, అమ్మాయిలకు తమ కలల్ని గుర్తుంచుకునే సామర్థ్యమూ ఎక్కువేనట. □

# దీపారాధన ఎందుకంటే ..



దేవుని ప్రతిమ ముందు దీపం వెలిగించడం మన సంప్రదాయం. ఉదయం, కొందరు సాయంత్రం, ఇంకొందరు ఉదయ సంధ్యల్లో వెలిగిస్తారు. శుభ కార్యాలను ప్రారంభించే ముందు దీపం వెలిగించే ఆచారమూ ఉంది. చీకటి అజ్ఞానానికి, కాంతి జ్ఞానానికి గుర్తు. భగవంతుడు జ్ఞాన స్వరూపుడు. జ్ఞానాన్ని ప్రసాదించే వాడు, పోషించే వాడు కాబట్టి జ్యోతి రూపంలో భగవంతుని ఆరాధిస్తాం. వెలుగు చీకటిని తరిమేసినట్లు జ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుంది. జ్ఞానాన్ని తరగని, చౌర్యంకాని అపు రూప సంపదగా భావించి వెలిగించి నమస్కరిస్తాం జ్ఞాన స్వరూపమైన కాంతిని శుభ సూచనగా భావించి పెళ్లి, పేరంటం లాంటి సంద ర్భాల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తారు. దీపానికి వాడే తైలం, నెయ్యి మనలోని వాసనలు, స్వార్థపూరిత సంస్కారాలకు సంకేతం కాగా.. అందులోని వత్తి అహంకారానికి ప్రతీక. ఎప్పుడైతే ఆధ్యాత్మిక చింతనతో దీపం వెలిగిస్తారో అప్పుడు వారిలోని మాలిన్య వాసనలు కరిగి, అహంకారం తొలగి పోతుంది.

**దీపం జ్యోతి పరబ్రహ్మ దీపంస్సర్వం తమోపహః**
దీవేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమోస్తుతే అని ప్రార్థిస్తూ దీపం వెలిగించాలి. అజ్ఞానాన్ని హరించి, జ్ఞానాన్ని ప్రసాదించి, అబద్ధం సిద్ధింపచేసుకునే శక్తినిచ్చే సంధ్యా దీపానికి నమస్కరించాలని భావం. □



ఆధ్యాత్మికం

# చిటికెలో గోధుమ హల్వా



ఒక్కోసారి ఏమైనా తియ్యగా తినాలనిపిస్తుంది. సరిగ్గా అప్పుడే ఇంట్లో స్వీట్లు ఏమీ ఉండవు. అలాంటప్పుడు తక్కువ సమయంలో తయారయ్యే దీన్ని హాయిగా ఆరగించొచ్చు. పండగలూ, ఏమైనా వేడుకలప్పుడు చేసుకున్నా త్వరగానే అయిపోతుంది. ముందుగా కడాయిలో కప్పు గోధుమపిండిని తీసుకుని తక్కువ మంట మీద వేయించాలి. అది కమ్మటి వాసన వస్తున్నప్పుడు కప్పు నెయ్యి వేసుకోవాలి. ఒకేసారి కాకుండా కొంచెం కొంచెం కలపాలి. మరో గిన్నెలో రెండు కప్పుల నీళ్లు మరిగించాలి. వీటిని గోధుమపిండిలో కొద్దికొద్దిగా పోస్తూ బాగా కలపాలి. మొత్తం నీళ్లు పోసేసరికి పిండి మెత్తగా, గుల్లగా అవుతుంది. ఇప్పుడు కప్పు బెల్లం తురుము వేయాలి. ఇది పూర్తిగా కరిగేంతవరకూ కలుపుతూనే ఉండాలి. తర్వాత చిటికెడు యాలకుల పొడి జతచేయాలి. నచ్చితే చివర్లో జీడిపప్పు, కిస్మిస్లనూ వేసుకోవచ్చు. మీరూ ఇంట్లో ప్రయత్నించి చూస్తే.. తయారీ సులువూ, రుచి అద్భుతమని ఒప్పుకుంటారు కూడా. □

### షాంఘై టెన్నిస్ మాస్టర్స్‌లో..

# వరల్డ్ నంబర్ 11 హోల్గర్ ఓటమి




**న్యూఢిల్లీ:** షాంఘై మాస్టర్స్ 2025లో ప్రపంచ నెంబర్ 11 హోల్గర్ రూన్ అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. అతనిపై ప్రపంచ అత్యల్ప నెంబర్ 204 స్థానంలో ఉన్న వాలెంటిన్ వాచెరోట్ విజయం సాధించాడు. షాంఘై మాస్టర్స్ సెమీఫైనల్స్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో హోల్గర్‌పై 2-6, 7-6 (7/4), 6-4 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. 26 ఏళ్ల ఈ యువకుడితో జరిగిన తొలి సెట్‌ను సునాయాసంగా గెలుచుకునేందుకు రూన్ మూడవ, ఏడవ గేమ్‌లలో బ్రేక్ వేశాడు. డబుల్ ఫాల్ట్ తర్వాత రెండవ సెట్‌లోని నాల్గవ గేమ్‌లో ముందుకు వెళ్లే అవకాశాన్ని వాచెరోట్ ఉపయోగించుకున్నాడు, కానీ రూన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో వాచెరోట్ గట్టి పట్టుదలతో టైబ్రేక్‌ను సాధించాడు. నియంత్రణ సాధించడంలో విఫలమైనందున రూన్ మరిన్ని ప్రయత్నాలు చేసి, టైబ్రేక్‌లో రెండు ఏస్‌లు కొట్టినప్పటికీ, చివరికి రెండవ సెట్‌ను వదులుకున్నాడు. మూడవ సెట్ యొక్క ఏడవ గేమ్‌లో అతను సమయ ఉల్లంఘనకు గురై, వాచెరోట్‌కు బ్రేక్ ఇవ్వడానికి మూడు అనవసర తప్పిదాలు చేయడంతో అతని ఓటమి ఖాయమైంది. హోల్గర్ రూన్ చివరి ప్రయత్నం చేసినప్పటికీ వాచెరోట్ అనూహ్యంగా పాయింటు సాధించి అసంభవమైన విజయాన్ని సాధించాడు.

### ఆసియా కప్ క్వాలిఫైయర్‌లో

# భారత్, సింగపూర్ మ్యాచ్ డ్రా



**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి ఆసియా కప్ 2027 క్వాలిఫైయర్ మ్యాచ్‌లో సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌ను భారత్ 1-1తో డ్రాగా ముగించింది. గురువారం నేషనల్ స్టేడియంలో జరిగిన క్వాలిఫైయం మ్యాచ్‌లో రెండవ అర్ధభాగం ప్రారంభంలో సింగపూర్‌తో భారత్ జట్టు (బ్లూ టైగర్స్) హోరా హోరీగా పోరు సాగించింది. రహీమ్ అలీ చివరిలో నాటకీయ సమం చేయడం ద్వారా విలువైన పాయింట్‌ను కాపాడుకున్నాడు. ఆట ప్రారంభం నుంచే భారత్ పట్టుదల ప్రదర్శించి, దాడులను చేయడంతో ప్రారంభమైంది. కానీ మొదటి అర్ధభాగం ముగిసేసరికి సింగపూర్ మ్యాచ్‌లో మరింతగా పోరు సాగింది. లయన్స్ జట్టు గురుప్రీత్ సింగ్ సంధును గోల్ అవకాశాలను సృష్టించింది. కానీ భారత్ 0-0తో బ్రేక్ స్థాయికి చేరుకుంది. రెండవ అర్ధభాగం భారత్‌కు ప్రారంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. పునఃప్రారంభమైన ఒక నిమిషం తర్వాత సందేశ్ జింగాన్‌కు రెండవ పసుపు కార్డు వచ్చింది. దీనితో బ్లూ టైగర్స్ పది మందితో మిగిలిపోయింది. సింగపూర్ వెంటనే సంఖ్యాపరమైన ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకుంది, ఇఖ్సాన్ ఫాండి అహ్మద్ 46వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించాడు. ఎదురుదెబ్బ తగిలినప్పటికీ, భారతదేశం దృఢంగా నిలిచింది. గురుప్రీత్ సింగ్ సంధు అనేక కీలక సేవ్‌లను చేసి లోటును ఒకే చోట ఉంచాడు. చివరగా, 89వ నిమిషంలో, రహీమ్ అలీ డిఫెన్సివ్ లోపంతో పాటు, సింగపూర్ గోల్ కీపర్ ఇజ్వాన్ మహబుద్ స్లిప్ ను సద్వినియోగం చేసుకుని గోల్ చేసి స్కోరును సమం చేశాడు.

### వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో

# భారత్‌కు తొలిసారి పతకం ఖాయం

### క్వార్టర్ ఫైనల్లో కొరియాపై విజయం

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ మిశ్రమ జట్టు తొలిసారిగా పతకాన్ని ఖాయం చేసుకుంది. రెండు దశాబ్దాల కరువుకు ముగింపు పలికి ఆతిథ్య జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో కొరియాను ఓడించింది. గౌహతిలోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో గురువారం జరిగిన చారిత్రాత్మక ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో పతకాన్ని ఖరారు చేసుకుంది. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఉత్కంఠభరితమైన క్వార్టర్ ఫైనల్ పోరులో ఆతిథ్య జట్టు విజయం సాధించింది. తొలి సెట్‌లో కొరియాను 44-45, 45-30, 45-33 తేడాతో ఓడించి, ఆసియా అండర్ 19 మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్ ఇండోనేషియాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది.



అలాగే ఇండోనేషియా 45-35, 45-35 తేడాతో చైనీస్ తైపీని ఓడించింది. సెమీఫైనల్‌కు చేరుకోవడం ద్వారా ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో భారతదేశానికి తొలి మిశ్రమ జట్టు పతకం ఖాయమైంది. క్వార్టర్ ఫైనల్స్ తొలి బాలుర డబుల్స్‌లో భార్గవ్ రామ్ అరిగెల-విశ్వ తేజ్ గొబ్బూరు 5-9 తేడాతో చో హ్యోంగ్ వూ-లీ హ్యోంగ్ వూ చేతిలో ఓడిపోవడంతో మొదటి సెట్ అలాగే సాగింది. బాలికల డబుల్స్‌లో వెన్నల-రేషికా యు జంట 10-9 తేడాతో చియోన్ హ్యే ఇన్-మూన్ ఇన్ సియోలను ఓడించి ఒక పాయింట్ తేడాతో లోటును తగ్గించగలిగింది. ఆ తర్వాత రౌనక్ చౌహాన్ చోయ్ అహ్ సెయుంగ్‌ను 11-9 తేడాతో ఓడించి వారిని ఒక పాయింట్ దగ్గరకు తీసుకువచ్చారు.



### మహిళల ప్రీమియర్ లీగ్:

# నవంబర్ 25న వేలం

### ఐదుగురిని మాత్రమే కొనసాగించే అవకాశం

**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌కు విశేష ఆదరణ కల్పించిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. గత మూడు సీజన్లు అభిమానులను అలరించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ రాబోతోంది. అంతకంటే ముందుగా వేలం నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. నవంబర్ 25 లేదా 29న ఆక్షన్ జరిపేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఎంతమందిని అట్టిపెట్టుకోవాలి? రైట్ టుమ్యాచ్? వంటివాటి గురించి ఫ్రాంచైజీలకు నిర్వాహకులు గురువారం ఈమెయిల్ ద్వారా కీలక సూచనలు చేశారు. ఈసారి ఐదుగురినిమాత్రమే అట్టిపెట్టు కునేందుకు ఫ్రాంచైజీలకు అనుమతిచ్చారు. ఇందులో గరిష్టంగా భారత క్రికెటర్లు ముగ్గురు, విదేశీయులు ఇద్దరు ఉండాలని సూచించారు. భారత క్రికెటర్లలో ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను రిటైన్ చేసుకునేందుకు ఒకే చెప్పారు. నవంబర్ 5వ తేదీలోపే అన్ని యాజమాన్యాలు తమ రిటైన్ ప్లేయర్ల జాబితాను వెల్లడించాలని తెలిపారు. పేర్ల నమోదుకు నవంబర్ 18 ఆఖరు తేదీ. నవంబర్ 20న వేలంలో నిలిచిన ప్లేయర్ల పేర్లను బీసీసీఐ విడుదల చేయనుందని సమాచారం. అలాగే రైట్ టు మ్యాచ్‌ను అనుమతిస్తూ నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక ఫ్రాంచైజీ ఐదు ఆర్టీఎమ్‌లో పాల్గొనవచ్చు. ఒకవేళ ఫ్రాంచైజీ నలుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్లకు ఒకేఒక ఆర్‌టీఎమ్ ఛాన్స్ ఉంటుంది. అలానే ముగ్గురిని రీటైన్ చేసుకుంటే రెండు ఆర్‌టీఎమ్స్‌లోపాల్గొనవచ్చు. ఇద్దరిని రీటైన్‌చేసుకుంటేమూడు ఆర్‌టీఎమ్స్, ఒక్కరినే అట్టిపెట్టుకుంటే నాలుగు ఆర్‌టీఎమ్స్ లభిస్తాయి. ఇక ఈ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి..ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

### రంజీ ట్రోఫీలో

# హైదరాబాద్ కెప్టెన్‌గా తిలక్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టును టీమిండియా స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ నడిపించనున్నాడు. ఢిల్లీతో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే రంజీ మ్యాచ్ కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెలెక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో దుమ్ము రేపుతున్న తిలక్ తిరిగి కెప్టెన్‌గా నియమించింది. అతనికి రాహుల్ సింగ్ డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. ఈ రంజీ కి టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ దూరంగా ఉన్నాడు. ఆస్ట్రేలియా పర్యటన, సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌ల నేపథ్యంలో దేశవాళీ క్రికెట్ నుంచి సిరాజ్‌కు విశ్రాంతి కల్పించారు. హైదరాబాద్ జట్టులో సీవీమిలింద్, తన్మయ్‌అగర్వాల్, అభిరత్‌రెడ్డి, హిమతేజ, తనయ్ త్యాగరా



జన్, రోహిత్ రాయుడు, నిశాంత్, అనికేత్, కార్తికేయ, అలీ కాచి డైమండ్, రాహుల్ రాదేశ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. నితేష్, సాయి ప్రజ్ఞయ్, రక్షన్‌రెడ్డి, నితేష్ కనాలా, మిఖిల్ జైస్వాల్ స్టాండ్‌బైలుగా ఎన్నికయ్యారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టీ20ల సిరీస్‌కు తిలక్ వర్మ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో అతను రెండో రంజీ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. కాగా గత సీజన్‌లో ఎలైట్ గ్రూప్‌బీలో ఆడిన హైదరాబాద్ జట్టు7 మ్యాచ్‌లకు 2మాత్రమే గెలిచింది.మరో2 మ్యాచ్‌లను డ్రాచేసుకొని మూడింటిలో ఓడింది. లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# టిసిఎస్ నికరలాభం రూ.12,075 కోట్లు




### గతేడాదికంటే 1.4% వృద్ధి

### వాటాదారులకు రెండో మధ్యంతర డివిడెండ్

**ముంబయి, అక్టోబరు 9:** భారతీయ ఐటీ సేవల రంగంలో అతిపెద్ద సంస్థగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసికంలో కంపెనీ నికరలాభం రూ.12,075 కోట్లుగా వెల్లడించింది. గతేడాది ఇదే రెండో త్రైమాసికంలో నికరలాభం రూ.11,909 కోట్లతో పోలిస్తే ఈసారి 1.4 శాతం వృద్ధి చెందినట్లు వెల్లడించింది. అయితే, మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. మార్కెట్ అంచనాల ప్రకారం కంపెనీ నెట్ ప్రాఫిట్ రూ.12,573 కోట్లుగా ఉండగా ఫలితాల్లో రూ.12,075 కోట్లకు పరిమితమైంది. టాటా గ్రూప్ టెక్ దిగ్గజం ఆపరేషన్స్ రాబడులు రెండోత్రైమాసికంలో 2.4శాతం వృద్ధి చెంది రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు చేరింది. వాటాదారులకు ఈ ఏడాది రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్ చెల్లిస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన రికార్డ్ తేదీని ఈనెల 15గా నిర్ణయించింది. అర్హులైన షేర్ హోల్డర్లకు డివిడెండ్ నవంబర్ 4న ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్ జూన్‌లో కంపెనీ ఆదాయం రూ.63,437 కోట్లతో పోలిస్తే ఈసారి రెవెన్యూ 3.7 శాతం పెరిగింది. స్థిరకరెన్సీలో 0.8 శాతం వృద్ధి సాధించింది. త్రైమాసికం వారీగా టిసిఎస్ ఇంటర్నేషనల్ రెవెన్యూ 0.6 శాతం పెరిగినట్లు తెలిపింది. ఇక కంపెనీ ఆపరేటింగ్ మార్జిన్ 25.2 శాతం వద్ద ఉంది.త్రైమాసికం వారీగాచూస్తేచూస్తే 70 బేసిస్ పాయింట్లు పెరిగింది. నెట్ మార్జిన్ 19.6 శాతంగా ఉన్న క్రమంలో కంపెనీ నెట్ ఇన్‌కమ్ 8.4 శాతం వృద్ధి నమోదు చేసినట్లు టిసిఎస్ తెలిపింది. రెండో త్రైమాసిక ఫలితాల ప్రకటన నేపథ్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు ధర లాభాల్లో ముగిసింది. గురువారం మార్కెట్లు ముగిసే సమయానికి కంపెనీ షేరు బిఎస్‌ఇలో రూ.3061.95 వద్ద ముగిసింది. క్రితం రోజు ముగింపుతో పోలిస్తే 1.16 శాతం లాభపడింది. ఈసారి ఫలితాల్లో రాణిస్తుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఈ షేర్లు కొనేందుకు మొగ్గు చూపడంతో షేర్లు లాభాల్లో ముగిసినట్లు తెలుస్తోంది.

# ఎస్‌ఎంఇలకోసం ఫోన్‌పే 'స్మార్ట్‌ప్యాడ్'

**ముంబయి, అక్టోబరు 9:** దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారుల డిజిటల్ చెల్లింపుల స్వీకరణలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చేందుకు ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ముందుకొచ్చింది. యూపిఐ సౌండ్‌బాక్స్‌తో పాటు కార్డు చెల్లింపులను కూడా స్వీకరించేలా ఒకే పరికరంలో రెండు సదుపాయాలను అందిస్తూ 'ఫోన్‌పే స్మార్ట్‌పాడ్'ను ఆవిష్కరించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 వేదికగా ఈ సరికొత్త హైబ్రిడ్ డివైజ్‌ను కంపెనీ పరిచయం చేసింది. ప్రస్తుతం చాలామంది వ్యాపారులు యూపిఐ చెల్లింపుల కోసం స్మార్ట్‌స్పీకర్లను వాడుతున్నారు. అయితే, కార్డు ద్వారా చెల్లించాలనుకునే కస్టమర్లు వచ్చినప్పుడు, పిఒఎస్ మెషిన్ లేకపోవడంతో వ్యాపారాన్ని కోల్పోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఫోన్‌పే ఈ స్మార్ట్‌పాడ్‌ను రూపొందించింది. ఇది స్మార్ట్‌స్పీకర్, పాయింట్ ఆఫ్ సేల్ (పిఒఎస్) పరికరాల కలయికగా పనిచేస్తుంది. తద్వారా వ్యాపారులు తక్కువ ఖర్చుతోనే అన్ని రకాల డిజిటల్ చెల్లింపులను సులభంగా స్వీకరించవచ్చు. పూర్తిగా భారత్‌లోనే తయారైన ఈ పరికరం, వ్యాపారుల అవసరాలకు తగ్గట్టుగా రూపొందించబడింది. ఈ స్మార్ట్‌పాడ్ మాస్టర్‌కార్డ్, వీసా, రూపే, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి అన్ని ప్రధాన నెట్‌వర్క్‌లకు చెందిన కార్డులను అంగీకరిస్తుంది. ఎన్‌ఎఫ్‌సి (ట్యాప్ అండ్ పే), ఇఎంవి చిప్ (డిప్ అండ్ పే) కార్డులతో చెల్లింపులు చేయవచ్చు. కస్టమర్లకు కనిపించేలా ఒక డిస్‌ప్లే, వ్యాపారి కోసం మరో డిస్‌ప్లే ఉండటం దీని ప్రత్యేకత. పిన్ ఎంటర్ చేయడానికి కీప్యాడ్, లావాదేవీల కోసం ఈరసీదుల వంటి అత్యాధునిక ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి. ఈ ఆవిష్కరణపై ఫోన్‌పే చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ మా పాత స్మార్ట్‌స్పీకర్లు క్యూఆర్ కోడ్ చెల్లింపులను సులభతరం చేస్తే, ఈ స్మార్ట్‌పాడ్ ఒక అడుగు ముందుకేసి కార్డు చెల్లింపులను కూడా సాధ్యం చేస్తోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్‌ను స్వీకరించాలనుకునే చిన్న వ్యాపారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. దీనివల్ల వినియోగదారులు తమకు దగ్గర్లోని చిన్న దుకాణాల్లో కూడా కార్డులను వాడగలుగుతారని వివరించారు. స్మార్ట్‌స్పీకర్ 2.0లోని సెలబ్రిటీ వాయిస్ కన్ఫర్మేషన్, 4జి నెట్‌వర్క్, ఫాస్ట్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు కూడా ఇందులో కొనసాగుతాయని ఆయన తెలిపారు.





### గ్లోబల్

# ఫోర్బ్స్ బిలియనీర్ ముకేష్ అంబాని

**ముంబయి, అక్టోబరు 9:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదలచేసిన భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ముకేశ్ సంపద 12 శాతం క్షీణించింది. ఇక ముకేశ్ అంబానీ తర్వాత 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు.

ఒపి జిందాల్‌కు చెందిన సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో, టెలికం దిగ్గజం సునీల్ మిట్టల్ 34 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, టెక్ బిలియనీర్ శివ నాడార్ 33 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2025 ఫోర్బ్స్ జాబితాలో 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ 9 శాతం (100 బిలియన్‌డాలర్లు) పడిపోయి 1ట్రిలియన్ డాలర్లకు చేరింది. ఇందుకు పలు కారణాలు ఉన్నట్లు ఫోర్బ్స్ నివేదించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.